ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 129 పేజీలు: 8+4 వెల: 6.50

**హార్ముజ్‌ను తెరుస్తాం.. కానీ ఫీజు తప్పదు: ఇరాన్**

**కాల్పులు ఆపండి.. ఇజ్రాయెల్‌కు ట్రంప్ హెచ్చరిక**

5లో



సోమవారం విశాఖ స్టీల్ కర్మాగారంలోని ఎస్ఎంఎస్1లో లిక్విడ్ స్టీల్ దూసుకొచ్చి భగ్గుమన్న ప్లాంట్

# స్టీల్ ప్లాంట్‌లో ఘోరకలి

**లిక్విడ్ స్టీల్ తరలిస్తుండగా భారీ పేలుడు**

**మరుగుతున్న స్టీల్ పడడంతో 9మంది సజీవ దహనం**

**విశాఖ కర్మాగారంలో అంతా హృదయ విదారక దృశ్యాలు**

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు**

**డి.సిఎం పవన్, మంత్రి లోకేశ్ ప్రగాఢ సానుభూతి**

**మృతుల కుటుంబాలకు రూ.2లక్షల సాయం ప్రకటించిన ప్రధాని**



క్షతగాత్రులను తరలిస్తున్న సిబ్బంది

**విశాఖపట్నం(గాజువాక),జూన్ 8,ప్రభాతవార్త:** విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం సంభవించింది. స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్1) విభాగంలో జరిగిన భారీ పేలుడు కారణంగా తొమ్మిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉండడంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని తెలుస్తోంది.సోమవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ఎస్ఎం ఎస్1లోని సీసీడీ2 వద్ద కార్మికులు విధుల్లో ఉన్నారు. ఎల్ అండ్ డి మీద లాడిల్ ఉంచి, స్లైడ్ గేట్ ఓపెన్ చేసిన వెంటనే సాంకేతిక లోపంతో 1600 డిగ్రీల వేడితో కూడిన ద్రవరూప ఉక్కు (లిక్విడ్ స్టీల్) ఒక్కసారిగా బయటకు దూసుకొచ్చింది. దీంతో అక్కడ భారీ పేలుడు సంభవించి, మంటలు వ్యాపించాయి. అక్కడ పనిచేస్తున్న 14 మంది కార్మికులపై ఆ వేడి ద్రవం పడిపోవడంతో ఎనిమిది మంది అక్కడికక్కడే గుర్తుపట్టలేనంతగా కాలిపోయి మరణించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు కన్నుమూశారు. **మృతుల వివరాలు: ఉక్కు ఉద్యోగులు:** గోల్డ్ కుమార్ (మేనేజర్ మెషిన్2 ఇంచార్జ్), గొంతిన భానుకుమార్ (టెక్నీషియన్), జి.వి. అప్పారావు (టెక్నీషియన్), ఎం.కృష్ణ నాగు (టెక్నీషియన్), కే.ప్రభాకర్ (జనరల్ ఫైర్ మెన్). **కాంట్రాక్ట్ కార్మికులు:** రమణ, త్రినాథ్, ఎం.అప్పలరాజు, (మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది). పమాదం జరిగిన వెంటనే ఉక్కు రక్షణ సిబ్బంది రంగంలోకి దిగి మృతదేహాలను వెలికితీశారు. తీవ్రంగా గాయపడిన మిగతా వారిని అత్యవసరంగా నగరంలోని వివిధ ప్రైవేట్ >>2



ప్లాంట్‌లో మంటలను ఆర్పుతున్న సిబ్బంది



సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వనిత రాణికి రాజ్యసభ నామినేషన్లు దాఖలు చేస్తున్న చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీష్

# టిడిపి అభ్యర్థుల నామినేషన్లు

**చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీష్‌లు రాజ్యసభకు ఏకగ్రీవమయ్యే అవకాశం**

**విజయవాడ,జూన్8,ప్రభాతవార్తప్రతినిధి:** రాజ్యసభ ఎంపీ అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీ తరుపున సానా సతీష్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్‌లు నామినేషన్‌లు దాఖలు చేశారు. సోమవారం అమరావతి అసెంబ్లీ భవనంలో సానా సతీష్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ లు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్‌అధికారి ఆర్.వనితా రాణికి అందచేశారు.ఈ నామినేషన్ల దాఖలు ప్రక్రియలో కూటమి పార్టీ నేతలు పాల్గొని ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు.రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా సానా సతీష్ రెండు సెట్‌ల నామినేషన్‌లను సమర్పించారు. ప్రతిపాదకులుగా చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీ నారాయణ, పంతం వెంకటేశ్వరరావు(నానాజి), తంగిరాల సౌమ్య సంతకాలు చేశారు. రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా బాష్యం రామకృష్ణ రెండు సెట్‌ల నామినేషన్‌లను సమర్పించారు. ప్రతిపాదకులుగా మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు బి.రామాంజనేయులు,కొలిశెట్టి శ్రీనివాస్, శ్రీరాం తాతయ్యలు సంతకాలుచేశారు. రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా చింతకాయల విజయ్ రెండు >>2

# 2027కు భూ రికార్డులు క్లీన్

**పూర్తి ప్రక్షాళనకు మూడేళ్ల సమయం**

**కరెన్సీ నోట్ల తరహాలో పాస్ పుస్తకాలకు భద్రతా ఫీచర్లు**

**రాష్ట్రంలో రాజకీయం చేసే అర్హత గొడ్డలి పార్టీకి ఎక్కడిది?**

**ప్రజలకు, నిరుద్యోగులకు ఆ పార్టీ క్షమాపణలు చెప్పాలి**

**సిద్ధాంతంలో 'మీ భూమి మీ హక్కు' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**



సోమవారం సిద్ధాంతం సభలో పాస్ పుస్తకాలు అందచేస్తున్న సిఎం చంద్రబాబు

**ఆచంట, జూన్ 8 ప్రభాతవార్త:** 2027 నాటికి రాష్ట్రంలో భూ రికార్డులను ప్రక్షాళన చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గత పాలకులు పశ్చిమగోదావరిజిల్లా లాంటి పచ్చని ప్రాంతంలోనూ భూ చిచ్చు పెట్టారని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. గజం భూమిని కూడా సద్వినియోగం చేసుకునే రైతులనూ గత ప్రభుత్వం వదిలి పెట్టలేదని తీవ్రస్థాయిలో ఆరోపించారు. పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతంలో 'మీ భూమి మీ హక్కు' పేరిట రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. దుర్మార్గమైన గత పాలకుల నిర్వాకంతో రికార్డులన్నీ గందరగోళంగా తయారయ్యాయని ప్రజలకు చెందిన భూముల విషయంలో సమస్యలు సృష్టించారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూ రికార్డులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేశారని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లాంటి దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేసి యాజమాన్య హక్కుల్ని రక్షించామని వివరించారు. క్యూ ఆర్ కోడ్ సహా కరెన్సీ నోట్ల తరహాలోనే అత్యంత పటిష్టమైన భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు చేసిన అవకతవకల కారణంగా భూమి రికార్డుల ప్రక్షాళనకు 3ఏళ్ల సమయం పడుతుందని సిఎం అన్నారు. దేశం లోనే తొలిసారి బ్లాక్ చైన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతీ యూనిట్‌కు శాశ్వతమైన బ్లాక్ చైన్ ఐడిలు ఇస్తున్నామని,దీని ద్వారా రికార్డులను ట్యాంపరింగ్ చేసేందుకు అవకాశం ఉండదని తెలిపారు. ప్రజల ఆస్తి పత్రాలపై ఫొటోలు ముద్రించుకున్నారని, పొలం సరిహద్దు రాళ్లపై బొమ్మల కోసం రూ.800 కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. ప్రస్తుతం భూ ముల రీసర్వేప్రక్రియలో రైతులను కూడా భాగస్వాములను చేస్తు న్నామని, ఇకెవైసీ చేశాకే పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి రైతులకు అందిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 6688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూమి రికార్డులను అప్డేట్ చేశామని అన్నారు. 26.46 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశామన్నారు. వచ్చే 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 67.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. 2027 నాటికి రాష్ట్రంలో ప్రతీ రైతు వద్దా తప్పుల్లేని పాస్ >>2

**స్వచ్ఛ గోదావరి -పవిత్ర పుష్కరాలు లక్ష్యంగా**

# సమగ్ర కార్యాచరణ



**గోదావరిలో కాలుష్యాన్ని వదులుతున్న ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలి: డి.సిఎం పవన్ ఆదేశం**

**రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు సైతం నోటీసులు ఇవ్వాలి**

**విజయవాడ,జూన్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** గోదావరిలో కాలుష్యాన్ని వదులుతున్న ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు.గోదావరి ఇంత బహిరంగంగా కాలుష్యానికి గురవుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు,మీన మీసాలు లెక్కిస్తున్నారా అంటూ మండిపడ్డారు.నదీ కాలుష్యానికి కారకులెవ్వరైనా కఠినంగా వ్యవహరించాలన్నారు. గోదావరి జలాల పవిత్రను కాపాడుతూ పుష్కరాలు నిర్వహిద్దామన్నారు. స్వచ్ఛ గోదావరి–పవిత్ర పుష్కరాలు లక్ష్యంగా ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించామన్నారు.గోదావరి పరివాహక ప్రాంతంలోని 6 జిల్లాల్లో గల 262 పుష్కర పంచాయతీలను గుర్తించి, వాటిని మురుగు రహిత పంచాయతీలుగా మార్చాలని స్పష్టం చేశారు. మురుగు నీరు నేరుగా జీవనదిలో కలవకుండా మున్సిపాలిటీల సామర్థ్యానికి అనుగుణంగా మురుగు శుద్ధి ప్లాంట్ల (ఎస్‌టీపీ) నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కాలుష్య నివారణ పనుల కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (పీసీబీ) మంజూరు చేసిన రూ.100 కోట్ల నిధులను వినియోగించాలని ఆదేశించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో గోదావరి నది కాలుష్యాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాడు సేకరించిన నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించిన అనంతరం వచ్చిన నివేదికలన పవన్ పరిశీలించారు. ఈ నివేదికలలో పొందుపర్చిన అంశాల ఆధారంగా సోమవారం డీసీఎం పవన్ కల్యాణ్ తన కార్యాలయం నుంచి రాజమహేంద్రవరం జిల్లా అధికారులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలిందన్నారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నెలకు ఒకసారి నమూనాలు సేకరిస్తున్నట్లు అధికారులు బదులు ఇచ్చారు. >>2

**ఎపి బస్సుకు బీహార్‌లో**

# ఘోర ప్రమాదం



**ముగ్గురు దుర్మరణం**

**మరో 15మందికి తీవ్రగాయాలు**

**మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు, గాయపడిన వారికి రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సిఎం చంద్రబాబు**

**విజయవాడ/సంగం జూన్8, ప్రభాతవార్తప్రతినిధి:** బీహార్ రాష్ట్రంలో నెల్లూరు జిల్లా యాత్రికులతో ప్రయాణిస్తున్న ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు, గాయపడిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అదేవిధంగా తీవ్రంగా గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.2లక్షలు, స్వల్ప గాయాలపాలైన వారికి ఒక్కొక్కరికి రూ.1లక్ష చొప్పున సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 1వ తేదీన నెల్లూరు జిల్లా >>2



**బ్రిడ్జిని ఢీకొని ప్రైవేట్ బస్సు బోల్తా**

**ఖమ్మం జిల్లా సత్తుపల్లి వద్ద దుర్ఘటన**

**ఏలూరు జిల్లా నుంచి వెళ్తున్న బస్సు**

**12 మందికి తీవ్ర గాయాలు**

**సత్తుపల్లి జూన్ 8 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా ధర్మాజీ గూడెం నుంచి హైదరాబాద్ వెళుతున్న కె.వి.ఆర్ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఖమ్మం జిల్లా సత్తుపల్లి సమీప కొత్తలంకపల్లి రైల్వే బ్రిడ్జి సమీపానికి చేరగానే ముందుగా వెళుతున్న వాహనాన్ని ఓవర్టేక్ చేయబోయి రైల్వే బ్రిడ్జిని ఢీకొట్టి బోల్తా కొట్టిన సంఘటన ఆదివారం రాత్రి 12గంటల సమయంలో జరిగింది. బస్సులో దాదాపు 36 మంది ప్రయాణికులు ఉండగా ఈ ప్రమాదంలో 12మందికి గాయాలవుగా అందులో నలుగురికి కాళ్లు చేతులు విరిగి తీవ్ర గాయాలు అవటంతో సత్తుపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా ఎనిమిది మంది స్వల్పగాయాలు అవటంతో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేసి అనంతరం పంపించారు. వీరంతా >>2




# ఎన్డీయేపై 'ఇండియా' ఐక్యపోరు

**సర్, ఎన్నికల అక్రమాలపై సిజెఐకి లేఖ**

**విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్**

**ధరల పెరుగుదలపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి**

**ఇండియా కూటమి భేటీలో 5 కీలక నిర్ణయాలు**

**మీడియాకు వెల్లడించిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే**

**న్యూఢిల్లీ, జూన్ 8:** బిజెపి నేతృత్వంలోని ఎన్‌డియే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటం చేయాలని ఇండియా కూటమి పక్షాలు నిర్ణయించాయి. అలాగే ఎన్నికల, రాజకీయ వ్యూహాలను పునఃరూపకల్పన చేయడంపై విస్తృత ఏకాభిప్రాయం కుదిరింది. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), పేపర్ లీక్‌లు, నిరుద్యోగం, దేశంలో నెలకొన్న ఆందోళనకరమైన ఆర్థిక పరిస్థితులతో సహా అనేక కీలకఅంశాలపై ఎన్‌డియే ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి తమ ప్రచారాన్ని, వ్యూహాన్ని పదును పెట్టేందుకు కూటమి మిత్రపక్షాలు ఐదు కీలక నిర్ణయాలను ఖరారు చేశాయి. కీలక నిర్ణయాలలో భాగంగా, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓటర్ల జాబితాల సవరణలో ఆరోపించబడుతున్న అవకతవకలు, ఎన్నికల నిష్పాక్షికతపై ఉన్న తీవ్ర ఆందోళనల గురించి భారత ప్రధాన >>2



సోమవారం సిద్ధాంతం సభలో పాస్‌పుస్తకాలు అందుకున్న రైతులు

# 2027కు భూ రికార్డులు క్లీన్

>> పుస్తకం ఉంటుందని అన్నారు.

**రెవెన్యూ శాఖలో సమూల మార్పులు:** రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని, రీసర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. విక్రయం, బహుమతి, విభజన వంటి 9 లక్షల లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటే షన్ తెచ్చామని తెలిపారు. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేశామని, రూ.10 లక్షల లోపు ఆస్తులకు రూ.100తో బదిలీ చేస్తున్నామని స్పష్టం చేశారు. 1బి, అడంగల్, డికెటి, ఇనాం, సీలింగ్ వంటి పాత రికార్డుల డిజిటైజేషన్ ప్రక్రియ చేపట్టామని అన్నారు. 80శాతం ఇకెవైసి పూర్తయిన తర్వాతే గ్రామాలను వెబ్ ల్యాండ్ 2.0లోకి తీసుకుంటున్నామని అన్నారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం కల్పించామన్నారు. రాష్ట్రంలోని 1.37 లక్షల ఎకాల విలేజ్ సర్వీసు ఇనామ్ భూములను 22 ఏ నుంచి తప్పించామని తెలిపారు. తిరుపతి జిల్లాలో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న శెట్టిపల్లి గ్రామ భూములను పరిష్కరించి వారికి అప్పగించామన్నారు. ఆక్వా రైతులకు అండగా నిలబడ్డామని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గోదావరి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో పాటు, ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరిచారు. ఆక్వా జోన్ పరిధిలోని చెరువులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఆక్వా ఫీడ్ రేట్లు పెరగడంతో రైతులు ఇబ్బంది పడు తున్నారని రాయితీలు ఇవ్వాలని సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని కేంద్రాన్ని కోరామన్నారు. పశ్చిమ గోదావరి లాంటి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై దృష్టి పెట్టామని సిఎం వివరించారు. ఆక్వా పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలు కాలుష్య సమస్యగా మారకుండా న్యూట్రాసిటికల్ ఔషధాల తయారు చేసుకునే అవకాశం ఉందన్నారు.

**రెండేళ్లుగా సమపాళ్లలో సంక్షేమం అభివృద్ధి**

కూటమి ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్నామని, సంక్షేమం- అభివృద్ధి- సుపరిపాలన అందిస్తున్నామని సిఎం చంద్రబాబు వివరించారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా తిరుపతి, అమరావతి, విశాఖలో మూడు ప్రాంతాల్లో మూడు సభలు నిర్వహిస్తున్నామని సిఎం తెలిపారు. అభివృద్ధిని ట్రాక్‌లో పెట్టామని, పెట్టుబడులు ఉద్యోగాల కల్పన జరుగుతోందని అన్నారు. సంక్షేమంలో దేశంలో ఎవరూ చేయలేని విధంగా ప్రజలకు మేలు చేస్తున్నాం అని వివరించారు. సూపర్ సిక్స్‌లో చెప్పినవాటికంటే అదనంగా ఇచ్చామని తెలిపారు. పెన్షన్, తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఆటోడ్రైవర్లు, మత్స్యకారులు ఇలా అందరికీ సంక్షేమం అందిస్తున్నామని చంద్రబాబు వివరించారు.

**గొడ్డలి పార్టీది ఓర్వలేనితనం**

డిఎస్సీ ద్వారా దాదాపుగా 16 వేల మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని, పరీక్షలు అంటే తెలీని వ్యక్తులు, రిజర్వేషన్ల గురించి అవగాహన లేని వాళ్లు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని సిఎం చంద్రబాబు ఆరోపించారు. గత పాలకులు జాబ్ క్యాలెండర్ ఇస్తామని దగా చేశారని.. కూటమి ప్రభుత్వం వచ్చాకే ఉద్యోగాలు ఇచ్చి జాబ్ కేలండర్ విడుదల చేశామన్నారు. దీన్ని చూసి ఓర్వలేకే నేరాలు ఘోరాలు చేసి ఎదుటివారిపై దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. గొడ్డలి పార్టీ చరిత్ర రాష్ట్రంలో అందరికీ తెలుసని, నేరాలు చేసి ఎదుటి వాళ్లపై నెట్టేస్తుందని ఆక్షేపించారు. చేసిన ప్రతీ ఆరోపణకూ మంత్రులు అధికారులు పూర్తిగా వివరణ ఇచ్చారని.. దీనికి ఆ వైపు నుంచి సమాధానం లేదని అన్నారు. అసలు రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత ఆ పార్టీకి లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులను గొడ్డలి పార్టీ నేతలు క్షమాపణలు కోరాలన్నారు. ప్రజల్ని క్షమాపణ కోరకుండా రాష్ట్రంలో రాజకీయాలు చేసేందుకు గొడ్డలి పార్టీకి అర్హత లేదన్నారు. ప్రజలకు రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నందుకు తాను సంతోషిస్తున్నానని, కానీ వైసిపి నేతలు రాష్ట్రంలో భూ కబ్జాలు చేశారని రికార్డులు తారుమారు చేశారన్నారు. తెలంగాణా రాష్ట్రానికి వెళ్లి అక్కడి ఎమ్మార్వో, జెసి సంతకాలు ఫోర్జరీ చేసి రికార్డులు తారుమారు చేశారన్నారు. ఈ నేరంలో రూ.1500 కోట్ల అక్రమాలు జరిగాయన్నారు. ఇంత నేరం జరిగితే గొడ్డలి పార్టీ అధ్యక్షుడు.. వినుకొండ మాజీ ఎమ్మెల్యేను ఎందుకు సస్పెండ్ చేయలేదని సిఎం చంద్రబాబు ప్రశ్నించారు. గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలి పట్టే రైతులు గుర్తుకు రారని, కోడి కత్తి డ్రామాలు ఆడేవారికి వరికోతలు ఎలా తెలుస్తాయని సిఎం వ్యాఖ్యానించారు. గంజాయి బ్యాచ్‌లను ఓదార్చేవారికి పంటల సాగు ఎలా తెలుస్తుందని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలంటే గొడ్డలి పార్టీ వ్యక్తులను దూరంగా పెట్టాలని సిఎం వ్యాఖ్యానించారు.

**అందరి ఆరోగ్యం కోసం యోగాంధ్ర**

అనంతరం పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పై జిల్లా నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందించే వివిధ పౌరసేవలను మెరుగ్గా అందించటంలో కృషి చేస్తున్న అధికారులను అభినందించారు. ఆగస్టు 15 లోగానే రాష్ట్రవ్యాప్తంగా సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల కార్యక్రమాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకు రానున్నట్టు వివరించారు. ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నది మా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. త్వరలో రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మృగశిర కార్తెను పురస్కరించుకుని చేపలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. జూన్ 21 తేదీన రాష్ట్రంలో కోటి మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 2047 సంపన్నమైన, ఆనందకరమైన ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేయటమే లక్ష్యమని వివరించారు. అనంతరం సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సిఎం సందర్శించారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఉత్పత్తి అవుతున్న కోకో ద్వారా తయారైన చాక్లెట్లను, కొబ్బరి, పామాయిల్ ఉత్పత్తుల ప్రదర్శనల్ని పరిశీలించారు. వరి ఊక, గడ్డి ద్వారా తయారైన వివిధ ఉత్పత్తులు, గుర్రపు డెక్క ద్వారా తయారైన వర్మీ కంపోస్టును సీఎం పరిశీలించారు. ఆక్వా వ్యర్థాల ద్వారా తయారైన ఉప ఉత్పత్తులను పరిశీలించి తయారీ దారులను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

# స్టీల్ ప్లాంట్‌లో ఘోరకలి

>> ఆసుపత్రులకు స్టీల్ ప్లాంట్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘోర ప్రమాదానికి గల కారణాలపై ఉక్కు యాజమాన్యం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. సాంకేతిక లోపమా లేక నిర్వహణలో నిరక్ష్యమ్లా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద వార్తతో ఉక్కునగరంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

**ప్రధాని సాయం**

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదంపై ప్రధాని మోదీ సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపిన ప్రధాని మోదీ మృతుల కుటుంబాలకు మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు పరిహారాన్ని ప్రకటించారు. అదే విధంగా క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతి**

విజయవాడ,జూన్ 8,ప్రభాతవార్తప్రతినిధి: విశాఖ స్టీల్ ప్లాంట్ లో చోటు చేసుకున్న ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతికి లోనయ్యారు. ప్రమాదం గురించి తెలిసిన విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. స్టీల్ ప్లాంట్ లో చేపట్టిన సహాయ చర్యలపై ఆరా తీశారు. ఈ క్రమంలో విశాఖలో ఘటనా స్థలానికి డీసీఎం పవన్ కళ్యాణ్ మంగళవారం బయలుదేరి వెళ్తున్నారు.

**తీరని విషాదం: మంత్రి లోకేష్**

విశాఖ స్టీల్ ప్లాంటు ప్రమాదంలో కార్మికులు మృతిచెందటం తీరని విషాదమని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారుజ మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. ప్రభుత్వ యంత్రాంగం క్షతగాత్రులకు వైద్యం, ప్రమాద స్థలంలో సహాయకచర్యలను పర్యవేక్షిస్తోందని నారా లోకేష్ తెలిపారు.

**మాజీ సీఎం జగన్ దిగ్భ్రాంతి**

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదం పట్ల వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై స్పందించిన ఆయన, కార్మికుల మృతికి సంతాపం ప్రకటించారు. కార్మికుల ప్రాణాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**నిర్లక్ష్యమే కారణం: షర్మిల**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతి గురిచేసిందని. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు.విషాదపు ఘటన గుండెను కలిచివేసింది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాం. ప్లాంట్‌లో ప్రమాదానికి ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వ నిరక్ష్యమే ప్రధాన కారణం. ఈ ఘటనకు పూర్తి భాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని మోడీ వహించాలని డిమాండ్ చేశారు.

# సమగ్ర కార్యాచరణ

>> మరి అలాంటప్పుడు ఇంత కలుషితమవుతుంటే చర్యలు ఎందుకు తీసుకోలేదని పవన్ అధికారులను అడిగారు. అధికారులు తాము నిర్వర్తించాల్సిన విధులను క్రమం తప్పకుండా చేసి తీరాలి అన్నారు.నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలిందన్నారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మొత్తం రోజువారీ మురుగు నీరు 104 మిలియన్ లీటర్లు గోదావరిలో కలుస్తుందని నివేదికలు చెబుతున్నాయి.ఆంధ్ర పేపర్స్ పారిశ్రామిక వ్యర్థాలు32 మిలియన్ లీటర్లు కలుస్తున్నాయి.ఆక్వా సాగు వ్యర్థాలు 13.24 మిలియన్ లీటర్లు, గ్రామీణ ప్రాంతాల మురుగు నీరు8.38 మిలియన్ లీటర్లు గోదావరిలో కలుస్తున్నారు.దీనిపై మీరు దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.ఈ విషయంలో అలసత్వం లేదన్న అధికారులపై ఆయన మండిపడుతూ మరి అలాంటప్పుడు ఇంత కలుషితమవుతుంటే చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. వీటిపై చర్యలు తీసుకోవడం మీ కర్తవ్యమని స్పష్టం చేసారు.ఆంధ్ర పేపర్ మిల్స్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలి అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు సైతం నోటీసులు ఇవ్వాలి అన్నారు. గోదావరి పుష్కరాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.అంతేకాకుండా వెంటనే ఆంధ్ర పేపర్ మిల్స్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిప్యూటీ సీఎం పవన్ ఆదేశించారు. పర్యవేక్షణ సరిగా చేయని రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు సైతం నోటీసులు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను పవన్ ఆదేశించారు. గోదావరి పుష్కరాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు పవన్ స్పష్టమైన సూచనలతో దిశానిర్దేశం చేశారు.రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నదిని కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు గతంలోనూ కీలక ఆదేశాలు జారీ చేశారు.

## రెవెన్యూ శాఖలో సమూల మార్పులు: సిఎం చంద్రబాబు

**పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో, జూన్ 8:** వివాదాలు లేకుండా రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకు వస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. పెనుగొండ మండలం సిద్ధాంతంలో ఏర్పాటు చేసిన మీ భూమి మీ హక్కు గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రీసర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామన్నారు. అమ్మకం, బహుమతి, విభజన వంటి 9 లక్షల లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ తెచ్చామన్నారు. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేశాం. రూ.10 లక్షల లోపు ఆస్తులకు రూ.100తో బదిలీ చేస్తున్నామన్నారు. అంతకంటే ఎక్కువ విలువైన ఆస్తులకు రూ.1,000 స్టాంప్ డ్యూటీ చెల్లిస్తే చాలన్నారు. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ వంటి పాత రికార్డుల డిజిటలైజేషన్ ప్రారంభించామన్నారు. 9 (2) నోటీసుల జారీ సమయంలో కూడా ఈకేవైసీ అమలు చేస్తున్నామన్నారు. 80 శాతం ఈకేవైసీ పూర్తయిన తర్వాతనే గ్రామాలను వెబ్‌ల్యాండ్ 2.0లోకి తీసుకుంటున్నామన్నారు.



సోమవారం విశాఖలో ప్రమాద స్థలిని సందర్శించిన ఎంపి భరత్, హోంమంత్రి అనిత తదితరులు

# టిడిపి అభ్యర్థుల నామినేషన్లు

>>సెట్ల నామినేషన్లు సమర్పించారు. ప్రతిపాదకులుగా మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, సుందరపు విజయ్ కుమార్, బోడే ప్రసాద్‌లు సంతకాలు చేశారు. ఈరోజు ఉదయం వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు సాన సతీశ్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ ప్రత్యేక పూజలు చేశారు. వీరికి వెంకటపాలెం టీటీడీ దేవస్థానం పండితులు సాదర స్వాగతం పలికారు. టీడీపీ అభ్యర్థులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని వేద పండితులు ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం ఏపీ అసెంబ్లీ వరకు టీడీపీ అభ్యర్థులు సైకిళ్లపై వెళ్లి, ఆపై నామినేషన్ దాఖలు చేశారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎం.అఖిల్ కుమార్, పి.విజయ కుమారి తోపాటు కూటమి నేతలు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) వరుపుల సత్య ప్రభ,బండారు సత్యానంద రావు పాల్గొన్నారు. ఇంకా 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ తదతర నేతలు పాల్గొన్నారు.

**ఏకగ్రీవం దిశగా కూటమి రాజ్యసభ సభ్యులు**

ఆంధ్రప్రదేశ్ నుండి ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాల ఎన్నికల ప్రక్రియ కీలక ఘట్టానికి చేరుకుంది. శాసనసభలో కూటమికి ఉన్న ఏకపక్ష బలాబలాల దృష్ట్యా, ఈ నాలుగు స్థానాలు ఏకగ్రీవం కాబోతుండటం దాదాపు ఖరారైంది. కూటమి ఒప్పందంలో భాగంగా టిడిపి మూడు స్థానాల్లో, జనసేన పార్టీ ఒక స్థానంలో తమ అభ్యర్థులను రంగంలోకి దించాయి. టిడిపి తరపున సానా సతీశ్, విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, పార్టీ సోషల్ మీడియా వింగ్ ఇన్‌ఛార్జ్ చింతకాయల విజయ్‌లు సోమవారం తమ నామినేషన్ పత్రాలను అధికారికంగా దాఖలు చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీరికి బిఫారాలను అందజేసి, నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేయించారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్‌ను తమ అభ్యర్థిగా ప్రకటించారు. పార్టీకి ఆయన అందించిన సేవలు, నిబద్ధతను గుర్తిస్తూ ఈ అవకాశం కల్పించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. లింగమనేని రమేశ్ కూడా అసెంబ్లీలో రిటర్నింగ్ అధికారికి శనివారమే తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ప్రతిపక్ష వైసిపి సంఖ్యాబలం లేకపోవడంతో ఈ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి దించలేదు. దీంతో నామినేషన్ల ఉపసంహారణ గడువు ముగిసిన తర్వాత కూటమికి చెందిన ఈ నలుగురు అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు అధికారులు అధికారికంగా ప్రకటించనున్నారు.

# ఎన్డీయేపై 'ఇండియా' ఐక్యపోరు

>> న్యాయమూర్తి (సిజెఐ)కి లేఖ రాయాలని ఇండియా కూటమి పార్టీలు నిర్ణయించాయి. త్వరలోనే సిజెఐకి నిరసన లేఖను రాసి అందజేయడంపై పార్టీలు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. ఇండియా కూటమి సమావేశం అనంతరం మీడియా సమావేశంలో ఖర్గే, మమత, అఖిలేష్ తదితరులు వివరాలు వెల్లడించారు. ఇటీవలి నీట్ పేపర్ లీక్‌ల కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న వేదన, నిరాశల అంశంపై రెండవ నిర్ణయం తీసుకున్నారు.

ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో విద్యా వ్య వస్థ నిర్వహణలో జరిగిన లోపాలపై పలువురు నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఆయన రాజీనామా డిమాండ్ చేయాలని ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో నీట్, సిబిఎస్ఇ పరీక్షలకు హాజరైన లక్షలాది మంది యువతకు అన్యాయం జరిగిందని, వారిని గాలికి వదిలే శారని వారు పేర్కొన్నారు. కాబట్టి బాధ్యతా యుత పదవిలో ఉన్నవారిని దీనికి జవాబుదారీని చేయాలని అన్నారు. దేశంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రస్తుత తీవ్ర ఆర్థిక పరిస్థితి, పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రైతుల సమస్యలు, ఇతర ప్రజా ప్రయోజన అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేశారు.

ఈ ఇండియా బ్లాక్ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ, సీనియర్ నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా, ఎన్‌సిపి ఎస్‌పి నాయకురాలు సుప్రియా సూలే హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీతో ఉన్న విభేదాల కారణంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) సహా పలు ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశానికి దూరంగా ఉన్నాయి.

# పారదర్శక పాలనే లక్ష్యం

## సాంకేతిక సంస్కరణలతో ఆదర్శంగా పౌరసరఫరాలశాఖ: మంత్రి నాదెండ్ల

**విజయవాడ,జూన్8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రైతు సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా తీసుకుని, పారదర్శకత, సాంకేతికత, వేగవంతమైన సేవల సమన్వయంతో వ్యవహరిస్తుందని రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.తద్వారా సివిల్ సప్లైస్ శాఖ గత రెండు సంవత్సరాల్లో చారిత్రాత్మక సంస్కరణలను అమలు చేసి దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతు ఎక్కడా ఇబ్బందులు పడకుండా, ధాన్యం కొనుగోళ్లలో సంపూర్ణ పారదర్శకత, తక్షణ చెల్లింపులు, మధ్యవర్తుల నిర్మూలన, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన ఆశయంగా పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అధికారులు, రైతు సహాయక కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ మరియు అనుబంధ శాఖల సమన్వయంతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు.



**రైతుకు ప్రథమ ప్రాధాన్యత:** రైతు కష్టపడి పండించిన ప్రతి గింజకు గౌరవం దక్కేలా, ధాన్యం విక్రయంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందన్నారు. రైతు సంక్షేమాన్ని కేంద్రబిందువుగా తీసుకుని, పారదర్శకత, వేగవంతమైన చెల్లింపులు, సాంకేతిక ఆధారిత సేవలతో దేశంలోనే ఆదర్శవంతమైన ధాన్యం కొనుగోలు విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 17.97 లక్షల మంది రైతుల నుండి 1.29 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో సుమారు రూ.30,361 కోట్ల విలువైన ధాన్యం కొనుగోళ్లు నిర్వహించి, రైతులకు సకాలంలో చెల్లింపులు చేయడం జరిగిందన్నారు.రైతులకు చెల్లింపుల విషయంలో అత్యంత వేగవంతమైన విధానాన్ని అమలు చేస్తూ, 90 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేయగా, మిగిలిన చెల్లింపులు కూడా 48 గంటలు దాటకుండా పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా, చెల్లింపుల్లో జాప్యం లేకుండా, పూర్తి పారదర్శకతతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు...

**సాంకేతిక సంస్కరణలు - దేశంలోనే తొలిసారి వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయం**

..రైతులకు మరింత సులభమైన, పారదర్శకమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ఆధారిత ధాన్యం నమోదు మరియు విక్రయ విధానాన్ని అమలు చేసినట్లు తెలిపారు. ఈ వినూత్న వ్యవస్థ ద్వారా రైతులు ఎటువంటి మధ్యవర్తుల అవసరం లేకుండా నేరుగా తమ ధాన్యాన్ని నమోదు చేసి విక్రయించే అవకాశం పొందుతున్నారన్నారు. ఇప్పటికే 40 వేల మందికి పైగా రైతులు ఈ విధానాన్ని వినియోగించుకుని సుమారు 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నేరుగా సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు విక్రయించినట్లు ఆయన తెలిపారు. ఈ సంస్కరణ ద్వారా మధ్యవర్తుల జోక్యం గణనీయంగా తగ్గడమే కాకుండా, రైతులకు పారదర్శక వ్యవస్థలో నేరుగా లాభం చేకూరిందని ఆయన పేర్కొన్నారు.

**వర్షాలు - తుఫానుల సమయంలో రైతులకు రక్షణ:** వర్షాకాలంలో ధాన్యం తడవకుండా కాపాడేందుకు దేశంలోనే తొలిసారిగా చిన్న, సన్నకారు రైతులకు రూ.50 కోట్లు విలువైన టార్పాలిన్లు ఉచిత పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. తుఫానులకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి రైతు సహాయక కేంద్రాల ద్వారా ఈ సేవలు అందించామని పేర్కొన్నారు.

**దీపం-2" పథకం - కోట్లాది కుటుంబాలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల లబ్ధి:** "దీపం-2" పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన కుటుంబాలకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని 1.08 కోట్ల గ్యాస్ కనెక్షన్లను లక్ష్యంగా తీసుకుని అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా కుటుంబాలపై గ్యాస్ వ్యయభారం తగ్గించి, సాధారణ ప్రజలకు ఆర్థిక ఊరటనందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ పథకం కింద ఇప్పటివరకు పలు విడతల్లో భారీ స్థాయిలో సబ్సిడీని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 97.36 లక్షల సిలిండర్లకు రూ.764 కోట్ల సబ్సిడీ, రెండో విడతలో 93.83 లక్షల సిలిండర్లకు రూ.777కోట్లు, మూడో విడతలో 94.81 లక్షల సిలిండర్లకు రూ.791 కోట్లు, నాలుగో విడతలో 92.28 లక్షల సిలిండర్లకు రూ.760 కోట్ల రాయితీ నేరుగా ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

# బ్రిడ్జిని ఢీకొని ప్రైవేట్ బస్సు బోల్తా

>> ఆదివారం రాత్రి ఏంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన కె.వి.ఆర్ ట్రావెల్ బస్సులోని ఏలూరు జిల్లా ధర్మాజీ గూడెం, చింతలపూడి, ముసునూరు, తదితర గ్రామాల నుంచి హైదరాబాద్ వెళ్లడానికి బస్సులో ఎక్కారు. బస్సు బయలుదేరిన అర్ధగంటలోనే సత్తుపల్లి సమీప కొత్తలంక పల్లి రైల్వే బ్రిడ్జికి రాగానే రైల్వే బ్రిడ్జిని ఢీకొని బోల్తా కొట్టడంతో బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జయింది. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమవగా, ముందు చక్రాలు కూడా ఊడిపోయాయి.సమాచారం అందుకున్న వి.ఎం. బంజర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో బస్సులోఉన్న ప్రయాణికులను బయటికి తీసి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌ల ద్వారా సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 36 మంది ప్రయాణికులు ఉండగా, మిగతా వారు సురక్షితంగా బయటపడటం ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.అయితే బస్సు డ్రైవర్ మద్యం మత్తులో అతి వేగంతో ముందు వెళ్తున్నా వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తూ బస్సు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బస్సులోని ప్రయాణికులు తెలిపారు. గాయాలైన వారు శ్రావణ శశి, మల్లిక, బాలాజీ, గణేష్, రామకృష్ణ, శిరీష, ప్రణీత, నరసింహ, స్వప్న, సీతరత్నం, సుస్మిత, తదితరులు చింతలపూడి ధర్మాజీగూడెం ముసునూరు తదితర గ్రామాల నుంచిబస్సులో హైదరాబాద్ బయలుదేరిన ప్రయాణికులు. బస్సు ప్రమాదంపై సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తులింగం, వీఎం బంజర్ ఎస్సై వెంకటేష్, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎపి బస్సుకు బీహార్‌లో ఘోర ప్రమాదం

>> నుంచి కాశీ యాత్రకు బయలుదేరిన ప్రైవేటు బస్సు బీహార్‌లో ప్రమాదానికి గురైంది. ఎదురుగా వచ్చిన లారీ బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సంగం ప్రాంతానికి చెందిన ఇద్దరు, ఆత్మకూరుకు చెందిన ఒక మహిళ మృతి చెందినట్లు సమాచారం. మరో 15 మంది యాత్రికులు గాయపడగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఘటనపై వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధితులకు అత్యవసర వైద్యసాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

అవసరమైతే ప్రత్యేక సహాయక బృందాలను ఏర్పాటుచేసి సమన్వయం చేయాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సంగం, దుత్తలూరు, ఆత్మకూరుకు చెందిన యాత్రికులతో బస్సు జూన్ 1వ తేది కాశీయాత్రకు బయలుదేరింది. గయా,వారణాసి పుణ్యక్షేత్రాల దర్శనానికి బయలుదేరిన ఈ యాత్ర బస్సు బీహార్ రాష్ట్రం గయావద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న లారీ అతి వేగంతో బచ్చి బస్సును ఢీకొనగా సంగంకి చెందిన ఇద్దరు వ్యక్తు లు అక్కడిక్కడే మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.



క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న దృశ్యం

**ప్రత్యేక విమానంలో మృతదేహాలు :** మృతదేహాలను రోడ్డు మార్గన తీసుకొని రావాలంటే 38 గంటలు పైగా సమయం పడుతుందని మృతి చెందిన ముగ్గురు యాత్రికుల మృతదేహాలను సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గయా నుండి రేణుగుంట విమానాశ్రయానికి తీసుకొని వస్తున్నట్లు మంత్రి ఆనం వెల్లడించారు. ప్రత్యేక వాహనాల ద్వారా వారి స్వగ్రామాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## వారం - వర్జ్యం

09-06-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
నవమి రా.2.32,
పూర్వాభాద్ర ఉ.9.36
వర్జ్యం : రా.7.05-రా.8.39
దు.ఉ.8.10-ఉ.9.02,
(2) రా.11.53-రా.12.45
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.వివాహయత్నాలు జరుగుతాయి.

**వృషభం:** అప్రయత్నంగా కార్యసిద్ధి. పలుకుబడి హోదాలో ఉన్న వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. బంధువుల కలయిక.

**మిథునం:** సన్నిహితుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. తండ్రి నుండి ఆస్తి లాభం పొందుతారు.వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** నూతన పెట్టుబడులకు అనుకూల కాలం. బంధువులకు కలసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** ఉద్యోగాలలో ప్రోత్సాహకరంగా ఉంటుంది. పారిశ్రామిక రంగాలలోని వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి.

**కన్య :** పదే పదే మీ సహాయాన్ని అర్థించే కొందరిని దూరంగా ఉంచుతారు. క్రీడల యందు ఆసక్తి చూపుతారు. వస్త్రలాభం.

**తుల :** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. ఆరోగ్య విషయంలో మెలకువ అవసరం. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**వృశ్చికం:** ఎన్ని సమస్యలు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగి అనుకున్న కార్యాన్ని విజయవంతంగా పూర్తి చేస్తారు.

**ధనుస్సు:** నూతన తరహా ఆలోచనలు చేసి ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తారు. ఇంటా బయటా మీదేపై చేయిగా వుంటుంది.

**మకరం:** సాంకేతిక విద్యావకాశాలు లాభిస్తాయి. రెండు, మూడు విధాలుగా ధనలాభం పొందుతారు. వస్త్రలాభం.

**కుంభం:** కీలక విషయాలలో స్వంత ఆలోచనలు తీసుకుంటారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. వాహనసౌఖ్యం.

**మీనం:** శత్రువులు సైతం మిత్రులుగా మారుతారు. పెద్దల నుండి సాయం అందుకుంటారు. శుభవార్తలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హెచ్‌పివి టీకా పంపిణీ గడువు మరో 3నెలలు పొడిగింపు

**విద్యాసంస్థల పునఃప్రారంభం దృష్ట్యా పెంచినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి**

**సచివాలయం, జూన్ 8 ప్రభాతవార్త:** గర్భాశయ ముఖద్వారం (సర్వైకల్ క్యాన్సర్ కేసుల నిరోధానికి చేపట్టిన హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పివి) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మూడు నెలలపాటు (ఆగస్టు వరకు) పొడిగించినట్లు రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 2,71,071మంది బాలికల (78.57శాతం) కు హెచ్‌పివి టీకాలు వేసినట్లు వెల్లడించారు.14ఏళ్ల (14వ పుట్టినరోజు పూర్తిచేసుకొని 15వ పుట్టినరోజు లోనికి ఇంకా అడుగుపెట్టని) బాలికలకు కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించి హెచ్‌పివి టీకా వేస్తున్నామని తెలిపారు. ఈ కేటగిరిలో రాష్ట్రంలో 3.45లక్షల మంది బాలికలు ఉండగా సోమవారం నాటికి 78.57శాతం మందికి టీకా వేసినట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రెండు విడతలుగా కలిపి రాష్ట్రానికి 3,81,780డోసుల వ్యాక్సిన్ వచ్చిందని తెలిపారు. త్వరలోనే విద్యాసంస్థలు పునః ప్రారంభం కానున్నందున మిగిలిన బాలికలకు త్వరగా టీకా పంపిణీ పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు మంత్రి ఆదేశించారు. టీకా వేయించుకునేందుకు సందిగ్ధంలో ఉన్న వారికి అవగాహన కల్పించాలని స్పష్టంచేశారు. తక్కువగా టీకాల నమోదు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.



# జోజిలా టన్నెల్ రెడీ

- నేడు కేంద్రమంత్రి గడ్కరీ చేతుల మీదుగా బ్రేక్ త్రూ కార్యక్రమం
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మితమవుతున్న టన్నెల్ ఇదే
- అత్యంత పొడవైన సింగిల్‌ట్యూబ్ ద్విముఖ రహదారి సొరంగం



**జోజిలా రోడ్ టన్నెల్ ప్రాజెక్ట్**

**అనంతపురం, జూన్ 8 ప్రభాతవార్త బ్యూరో:** దేశ సరిహద్దుల్లో అత్యంత ప్రతిష్టాత్మక జమ్మూ కాశ్మీర్–లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలను నిత్యం అనుసంధానించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జోజిలా టన్నెల్ ప్రాజెక్ట్ మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించిన నేపథ్యంలో నేడు (మంగళవారం) కేంద్ర రవాణా శాఖ మంత్రి లాంచనంగా ప్రారంభించనున్నారు. 13.153 కిలోమీటర్ల పొడవైన జోజిలా టన్నెల్, ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మితమవుతున్న అత్యంత పొడవైన సింగిల్‌ట్యూబ్ ద్విముఖ రహదారి సొరంగంగా గుర్తింపు పొందింది. జమ్ముకాశ్మీర్‌లో సోనమార్గ్ సమీపంలోని బాల్తాల్ పశ్చిమ పోర్టల్ నుంచి ద్రాస్ కార్గిల్ ప్రాంతంలోని సోనామార్గ్ తూర్పు పోర్టల్ వరకు విస్తరించిన జోజిలా టన్నెల్ ప్రాజెక్టు, భారీ మంచు, హిమపాతాలు, తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగా సంవత్సరంలో సగం కాలం మూసి ఉంచే జోజిలా పాస్‌కు శాశ్వత పరిష్కారం చూపుతుంది. సముద్ర మట్టానికి సుమారు 11,578 అడుగుల ఎత్తులో నిర్మితమవుతున్న ఈ టన్నెల్, భారతదేశ పర్వత ప్రాంత మౌలిక సదుపాయాల అభివృద్ధిలో అత్యంత కీలకమైన మైలురాయిగా నిలుస్తుంది. పశ్చిమ హిమాలయాల్లోని అత్యంత క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు, హిమపాతాల ముప్పు, తీవ్రమైన శీతాకాలం వంటి ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతున్న జోజిలా టన్నెల్ తుది బ్రేక్‌త్రూ వల్ల భారతదేశం అత్యంత క్లిష్టమైన పర్వత ప్రాంత రవాణా మౌలిక సదుపాయాల నిర్మాణంలో సాధించిన అసాధారణ విజయానికి నిదర్శనం. జోజిలా టన్నెల్ పూర్తి ఐన తరువాత కాశ్మీర్–లడఖ్ మధ్య అన్ని కాలాల్లో నిరంతర అనుసంధానం కల్పించడంతో పాటు, ప్రాంతీయ అభివృద్ధి, ఆర్థిక సమగ్రత, జాతీయ భద్రతా సామర్థ్యాలను మరింత బలోపేతం చేయనుంది.

**ప్రాజెక్టు విశేషాలు**

జోజిలా ప్రాజెక్ట్ మొత్తం పొడవు రోడ్లు, వంతెనలతో కలిపి 30.894 కి.మీ.
ఇందులో జోజిలా ప్రధాన టన్నెల్ పొడవు 13.153 కి.మీ.
నిల్‌గ్రార్ టన్నెల్ టి1 పొడవు 457.35 మీటర్లు.
నిల్‌గ్రార్ టన్నెల్ టి2 పొడవు 1,953.63 మీటర్లు (సుమారు రెండు కిలోమీటర్లు).



ఎన్‌డియే బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే పులిపర్తి నాని

# నేడు తిరుపతిలో ఎన్‌డియే సభ

- హాజరుకానున్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

**తిరుపతి, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు అమలుతీరు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించామని విస్తృతంగా ప్రచారం చేసుకోవడానికి తిరుపతిలో మంగళవారం ఎన్‌డియే పార్టీల నేతలు బహిరంగ సభ జరగనుంది. తిరుపతి రూరల్ తిరుపతి–నాయుడుపేట జాతీయ రహదారి పక్కన ఈ సభకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం పూర్తిచేసింది.
సోమవారం రాత్రి వరకు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఇతర జిల్లా యంత్రాంగం స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షించి పూర్తిచేశారు. సుమారు లక్షమందికి పైగా పాల్గొనే ఈ సభలో జనానికి సిఎం చంద్రబాబు నాయుడు, డిసిఎం పవన్‌కల్యాణ్, బిజెపి చీఫ్ మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, సవిత పాల్గొంటున్నారు.
పూర్తిఏర్పాట్లులో అధికారులు తలమునకలయ్యారు. మంగళవారం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా దామినేడు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు విచ్చేసే ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించారు. పర్యటన సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, అత్యవసర సదుపాయాలు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ముఖ్యమంత్రి మంగళవారం ఉదయం 10.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుండి రోడ్డుమార్గంలో దామినేడు సమీపంలో ఏర్పాటు చేసిన ఎన్ డి ఏ బహిరంగ సభలో పాల్గొంటారు. కార్యక్రమం ముగించుకుని మధ్యాహ్నం 2 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని హెలికాప్టర్‌లో ఉండవల్లి చేరుకుంటారు.

# 12న పాఠశాలలు పునఃప్రారంభం

- ఎలాంటి మార్పు లేదని ప్రభుత్వం స్పష్టీకరణ

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవులు పొడిగింపు అంశంపై ప్రభుత్వం స్పష్టతను ఇచ్చింది, రాష్ట్రంలో పాఠశాలల పునఃప్రారంభం తేదిల్లో మార్పులేదని తెల్చిచెప్పింది. వేసవి సెలవులను పొడిగించే ప్రతిపాదన ఏపీ లేదని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ముందగా ప్రకటించినట్లే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఈ నెల 12వ తేదీన పునఃప్రారంభం కానున్నట్లు స్పష్టం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మకూడదని కీలక సూచనలు చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణలో స్కూళ్ల రీఓపెనింగ్‌ను ఈ నెల 15వ తేదీకి వాయిదా వేశారు. ఈ నెల 13న రెండో శనివారం, 14న ఆదివారం కావడంతో వేసవి సెలవులను పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే 12న హాలిడే ఇచ్చినందకు, మరో కిటుకు పెట్టింది సర్కార్. విద్యా సంవత్సరం నష్టపోకుండా జులై 11వ తేదీన రెండో శనివారం తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపింది.

# పెళ్లికి ముందు లైంగిక సంబంధం నేరం కాదు

- కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన గాజుల తిరుపతి కేసులో సుప్రీం తీర్పు
- ఉద్యోగంలోకి తీసుకోవాలని తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆదేశం


**హైదరాబాద్, జూన్ 8 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** మేజర్ల విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పెళ్లి కాని ఇద్దరు వయోజనులు పరస్పర అంగీకారంతో శారీరక సంబంధాన్ని కలిగి ఉండడాన్ని చెడు ప్రవర్తనగా భావించకూడదని స్పష్టం చేసింది. ప్రేమ విషయంలో నమోదైన ఒక క్రిమినల్ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అలాగే కేసులో తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు కీలక ఆదేశాలు జారీ చేసింది. నియామక ప్రక్రియలో పరిగణించి ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించింది. కేసు వివరాల ప్రకారం, పిటిషన్ దారుడు (తెలంగాణలో గాజుల తిరుపతి అనే వ్యక్తి ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. బోర్డు పోస్టింగ్ ఇవ్వలేదు) తన పొరుగింటి యువతితో కొన్నేళ్ల పాటు ప్రేమ సంబంధం కొనసాగించాడు. ఇద్దరి మధ్య ఉన్న ఆ సంబంధం తర్వాత వివాహ సంబంధంగా మారలేదు. దీంతో 2014లో వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చి మోసం చేశాడంటూ అతడిపై కేసు నమోదైంది.
అయితే తర్వాత ఇరువురు పరస్పర అంగీకారంతో రాజీకి వచ్చారు. 2015లో లోక్ అదాలత్‌లో ఆ వివాదం పరిష్కారమైంది. కేసును కొనసాగించేందుకు యువతి ఆసక్తి చూపలేదు. దీంతో వ్యవహారం అక్కడితో ముగిసింది. అయినప్పటికీ, ఆ కేసు నేపథ్యంలో అతడిపై నైతిక అపరాధం (మోరల్ టర్పిట్యూడ్) ముద్ర పడిందని భావించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు నియామకాన్ని రద్దు చేసింది. దీనిని సవాలు చేస్తూ అభ్యర్థి న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి అతడి వాదనను సమర్థిస్తూ నియామకాన్ని మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. ఆ తీర్పును సవాలు చేస్తూ అధికారులు అప్పీల్‌కు వెళ్లగా, చివరకు సుప్రీంకోర్టు కూడా అభ్యర్థికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.
ప్రతి ప్రేమ సంబంధం వివాహంతోనే ముగియాలనే నియమం లేదని పేర్కొంది. కేవలం వివాహం జరగలేదనే కారణంతో ఒక వ్యక్తి మరొకరిని మోసం చేశాడని తేల్చేయడం సరికాదని స్పష్టం చేసింది. సంబంధం విఫలమైందంటే అది తప్పనిసరిగా మోసమే అని భావించలేమని పేర్కొంది. అదేవిధంగా, సంబంధంలో బెదిరింపులు లేదా ఒత్తిడి ఉన్నట్లు ఆధారాలు ఉంటే నియామక సంస్థలు అభ్యర్థి అర్హతపై సందేహాలు వ్యక్తం చేయవచ్చని ధర్మాసనం తెలిపింది. అయితే ప్రస్తుత కేసులో అలాంటి పరిస్థితులు ఏవీ కనిపించలేదని పేర్కొంది. యువతితో బలవంతంగా రాజీ ఒప్పందం చేసుకున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ఇద్దరి మధ్య సంబంధం ఏర్పడిన సమయంలో వివాహం చేసుకునే నిజమైన ఉద్దేశం ఉందా?, లేదా? అనే అంశాన్ని ఆయా కేసుల వారీగా పరిశీలించాల్సి ఉంటుందని న్యాయస్థానం సూచించింది. ఇద్దరి పరస్పర సమ్మతితో ఏర్పడిన సంబంధాలు, మోసపూరితంగా వివాహ వాగ్దానం చేసి ఏర్పడిన సంబంధాల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం తెలిపింది. కేవలం సంబంధం వివాహానికి దారితీయలేదనే కారణంతో ఒకరిపై మరొకరు మోసపూరిత ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని కోర్టు అభిప్రాయపడింది.
ఈ తీర్పు వ్యక్తిగత స్వేచ్ఛ, పరస్పర అంగీకారం, ఆధునిక సామాజిక సంబంధాలపై న్యాయవ్యవస్థ దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## తిరుమల సమాచారం



### సింహవాహనంపై వేణుగోపాలస్వామి

**తిరుమల, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న చిత్తూరు జిల్లా కార్వేటినగరంలోని రుక్మిణి– సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో సోమవారం ఉదయం స్వామివారు యోగనారాయణుడి అలంకారంలో సింహవాహనంపై భక్తులకు దివ్యదర్శనమిచ్చి అనుగ్రహించారు. యోగశాస్త్రంలో సింహం వాహనశక్తికి, ధైర్యానికి, శీఘ్రగమనానికి ప్రతీకగా భావిస్తారు. భక్తుడు సింహబలం వంటి అచంచలమైన భక్తిశ్రద్ధలను కలిగి ఉన్నప్పుడే భగవంతుని అనుగ్రహానికి పాత్రుడవుతాడని ఆధ్యాత్మిక గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఈ వాహనసేవలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చెంగల్రాయులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొని స్వామివారి దివ్య మంగళరూపాన్ని దర్శించి పరవశించారు.



### ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అందిస్తున్న ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భూరం తిరుమల దీక్షిత్ సోమవారం హైదరాబాద్‌లో టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడును కలసి రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో దాత తండ్రి విశ్రాంత ఇంజనీర్ బి.జగదీశ్వర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లో తనిఖీల డొల్లతనం

- వెంటనే గమనించి పట్టుకున్న భద్రత సిబ్బంది



**తిరుమల, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకొండపై చీమచిటుక్కుమన్నా వెంటనే కనిపెట్టి పట్టుకునే అత్యాధునిక ఎఐ వ్యవస్థతోబాటు ఆధునిక నిఘా నేత్రాలు పనిచేస్తున్నా ఓ భక్తుడు ఏకంగా తన సెల్‌ఫోన్‌ను తీసుకుని ఏకంగా వైకుంఠమ్ క్యూలైన్లలోని తనిఖీ వరకు వచ్చేవాడు. అంతేగాక ఆ భక్తుడు తనచేతిలోని సెల్‌ఫోన్‌తో వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, పరిసరాలు పూర్తిగా చిత్రీకరించాడు. ఆ దృశ్యాలను వెంటనే తనవారికి పంపి సామాజిక మాధ్యమంలో హల్‌చల్ చేయించాడు. ఇదీ కాస్త సోమవారం ఉదయం దుమారం రేగడంతో వెంటనే అప్రమత్తమైన టిటిడి భద్రత సిబ్బంది జరిగిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి వివరణ ఇచ్చుకొనే ధోరణి వచ్చింది. అయితే తిరుమలలో భద్రత వ్యవస్థ పటిష్టంగా ఉందని, అప్రమత్తంగానే వ్యవహరిస్తోందని టిటిడి పిఆర్‌ఒ విభాగం సవివరాణత్మక ప్రకటన ఇవ్వడం మరీ విశేషం. సామాన్యభక్తుడు ఏకంగా సెల్‌ఫోన్‌తో వైకుంఠమ్‌లోకి రావడం చిన్నవిషయం కాదు. ఆపై కంపార్టుమెంట్‌లలో పరిస్థితి చిత్రీకరించడం మరీ కలవరం. ఈ నేపథ్యంలో తిరుమలలో భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ టిటిడి పటిష్టమైన మూడంచెల భద్రతా వ్యవస్థను నిరంతరాయంగా అమలు చేస్తోందని వివరణ ఇవ్వడం కొసమెరుపు. ప్రతి షిఫ్టులో వందలాది మంది భద్రతా సిబ్బంది చెకింగ్, స్కానింగ్ విధుల్లో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. ఏదైనా కారణాల వల్ల ఒక భద్రతా అంచె వద్ద గుర్తించబడని మొబైల్ ఫోన్ వంటి నిషేధిత వస్తువులు తదుపరి అంచెలలో గుర్తించి, నిర్దేశిత డిపాజిట్ విధానాన్ని అమలు చేయడం జరుగుతోంది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిని గుర్తించి, వారిపై అవసరమైన శాఖాపరమైన చర్యలు కూడా తీసుకుంటున్నారు. సోమవారం సోషల్ మీడియాలో ఒక భక్తుడు సెల్‌ఫోన్‌తో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించి, అక్కడి కంపార్ట్‌మెంట్ల దృశ్యాలను చిత్రీకరించి పోస్ట్ చేసినట్లు టిటిడి దృష్టికి వచ్చింది. అయితే, వాస్తవానికి సదరు భక్తుడు ఆదివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌కు మొబైల్ ఫోన్‌తో వచ్చినప్పటికీ, వివిధ దశల్లో నిర్వహించిన భద్రతా తనిఖీల్లో భాగంగా డౌన్ స్కానింగ్ పాయింట్ వద్ద అతడిని గుర్తించి, భద్రతా సిబ్బంది మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన తిరుమలలో అమలవుతున్న మూడంచెల భద్రతా వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోందనడానికి నిదర్శనం. తిరుమలలో భద్రత విభాగం పూర్తిగా ప్రోటోకాల్ విధులకు, తమ దర్శనాలకు, తమ వారికి దర్శనాలకే పరిమితమైపోయిందనడానికి ఇదో నిదర్శనం,

# తిరుమలలో నీటి పొదుపు మంత్రం!

- గోగర్భమ్ డ్యామ్ నుండి ప్రధాన ఫిల్టర్ హౌస్ వరకు అదనపు పైప్‌లైన్







**తిరుమల, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** రోజురోజుకూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న లక్షమంది భక్తులతో కొండపై నీటి వినియోగం కూడా పెరిగింది. రోజుకు సరాసరి 50లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతోంది. ఇందులో తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాలు గోగర్భమ్ డ్యామ్, పాప వినాశనం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార తీర్థాల ప్రాజెక్టుల నుండి రోజుకు 25లక్షల గ్యాలన్ల వరకు నీరు వినియోగిస్తున్నారు. మిగిలిన మరో 25–30 లక్షల గ్యాలన్ల నీరు చంద్రగిరి సమీపంలోని కళ్యాణిడ్యామ్ నుండి తిరుమలకు పంపింగ్ చేసుకుంటున్నారు. దీనివల్ల టిటిడికి భారం కూడా పెరిగింది. అయితే కల్యాణిడ్యామ్ నుండి నీటి పంపింగ్‌ను తగ్గించుకునే దిశగా టిటిడి అడుగులేస్తోంది. దీనివల్ల అదనపు భారం కూడా తగ్గుతుందని భావిస్తున్నారు. ఇందుకోసం తిరుమలలోనే ఐదు ప్రధాన జలాశయాల నుండి రోజుకు అవసరమైన 50లక్షల గ్యాలన్ల నీటిని సాఫీగా సరఫరా చేసుకునేందుకు గోగర్భమ్ డ్యామ్ నుండి తిరుమలలోని ప్రధాన ఫిల్టర్ హౌస్ వరకు నీరు వృధాకాకుండా పూర్తిస్థాయిలో అదనపు పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఇప్పటికే గత టిటిడి బోర్డు సమావేశంలోనే సుమారు ఆరుకోట్ల రూపాయల అంచనాతో పనులు చేపట్టేందుకు ఆమోదించారు. ఈ పనుల కోసం త్వరలోనే ఇ టెండర్లను పిలిచి పనులు ప్రారంభించేందుకు టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కార్యాచరణ సిద్ధం చేశారు.
తిరుమలలో తాగునీటి జలాశయాలైన గోగర్భం డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 2,894 అడుగులు, పాపవినాశనం 697.14 అడుగులు, ఆకాశగంగ జలాశయం 685లక్షల గ్యాలన్ల నీటి సామర్థ్యం. రెండు ప్రధాన పెద్దజలాశయాలు కుమారధార, పసుపుధార తీర్థాలు. ఈ రెండు జలాశయాల్లో పసుపుధార 2,833లక్షల గ్యాలన్లనీటి సామర్థ్యం, కుమారధారతీర్థం 4,258లక్షల గ్యాలన్ల నీటిసామర్థ్యం కలిగి ఉన్నాయి. వీటిల్లోని నీటిని పొదుపుగా వాడుకునేందుకు టిటిడి చర్యలు ఉపక్రమించింది. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదువతుండటంతో నీటిని మరింత పొదుపుగా వాడుకోవాలని యోచిస్తున్నారు. 2025 అక్టోబర్‌లో తుఫాన్ ప్రభావంతో భారీ వరదలు వచ్చాయి. అప్పట్లో కొండపై ఐదు జలాశయాలు నీటితో నిండుకున్నాయి. ఆ తరువాత మళ్ళీ అడపాదడపా వర్షాలు కురిసినా నీరు మాత్రం చేరలేదు, దీంతో ఇప్పుడు పాపవినాశనం, గోగర్భమ్ డ్యామ్ నుండి దిగువకు విడుదలవుతున్న మిగులు నీటిని పంపింగ్ చేసుకునేందుకు అవసరమైన అదనపు పైప్‌లైన్ ఏర్పాటుపై ఆలోచన చేశారు. అదనపు పైప్‌లైన్ ఏర్పాటుతో నీటిని మరింత పొదుపుగా వాడుకోవచ్చని అధికారుల ఆలోచన. 500 ఎంఎం దయాపైప్‌లైన్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. అదనపు పైప్‌లైన్ నిర్మాణం జరిగితే వర్షాకాలంలో నీరు వృధాపోకుండా నీటిని పొదుపు చేసుకునేందుకు అవకాశం కలుగుతుంది. తిరుమలలోని జలాశయాల్లో 14,304 లక్షల గ్యాలన్లు నీటి సామర్థ్యం కాగా ప్రస్తుతం నాలుగు వేల లక్షల గ్యాలన్ల నీరు పైగా మాత్రమే అందుబాటులో ఉంది. ఈ నీరు కేవలం 90 రోజులు మాత్రమే అవసరాలకు సరిపోతుందనేది టిటిడి వర్గాల సమాచారం. వరుణదేవుడు దయతో సకాలంలో ఏదో ఒకరూపంలో నైరుతి రుతుపవనాలు, అల్పపీడనాలతో వర్షాలు కురవకపోతే తాగునీటికి ప్రత్యామ్నాయ పరిస్థితులపై ఆలోచన చేస్తున్నారు.

## వివేకా హత్య కేసుపై సిబిఐ కోర్టులో విచారణ

**హైదరాబాద్ జూన్ 8, ప్రభాతవార్త:** మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి సోమవారం నాడు హైదరాబాద్ సిబిఐ కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసును మరింత సమగ్రంగా విచారించాలని వివేకానంద రెడ్డి తనయ డాక్టర్ సునీతా రెడ్డి దాఖలు చేసిన పిటి షన్‌పై కోర్టు ఈ విచారణ చేబట్టింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని నిందితుల తరపు న్యాయ వాదులు కౌంటర్ దాఖలు చేశారు. వివేకానం ద రెడ్డి హత్య కేసు విచారణ ఇప్పటికే పూర్తయ్యిందని, మరోసారి దర్యాప్తు అవసరం లేదని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపా రు. అయితే దీనిపై సునీతారెడ్డి తరపు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. తమ అభ్యంత రాలను పరిగణలోకి తీపుకోలేదని, ఛార్జిషీట్‌లోని అనేక అంశాలపై మరింతగా విచారణ చేయాలని వారు కోర్టును కోరారు. ఇరువర్గాల వాదనలు విన్న సిబిఐ కోర్టు దీనిపై తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసింది.


ఆర్.సి.నెం. 1331/2025/ఏ/ తే:08.06.2026

**రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయము అనకాపల్లి**

**పత్రిక ప్రకటన**

**ఫారమ్–1 షెడ్యూల్–2**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మెట్రోపాలిటన్ రీజియన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2016 (ఆంధ్రప్రదేశ్ చట్టం నెం.5/2016) యొక్క సెక్షన్ 116(2)(ఇ) క్రింద ఇచ్చిన అధికారాలను వినియోగించుకొని, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ (ఎం) శాఖ జి.ఓ.ఎం.ఎస్.నెం.146, తేదీ 30-07-2025 ద్వారా విశాఖపట్నం మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (VMRDA) కమిషనర్‌కు సంబంధిత భూములపై వుడా ల్యాండ్ పూలింగ్ స్కీం (రూల్స్, 2016) ప్రకారం భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్) కార్యక్రమాన్ని చేపట్టడానికి అనుమతి ఇవ్వబడింది.
ఈ పథకాన్ని అమలు చేయుటకు అనకాపల్లి, రెవిన్యూ డివిజనల్ అధికారి వారిని కాంపిటెంట్ అథారిటీగా నియమించడమైనది. అనకాపల్లి జిల్లా, అనకాపల్లి రెవిన్యూ డివిజన్ పరిధిలో ప్రతిపాదిత గ్రామాలు మరియు భూసమీకరణకు లభ్యమయ్యే భూముల వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి.

| క్రమ సంఖ్య | గ్రామం పేరు | మండలం | సర్వే నెం. | ప్రతిపాదిత విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) | లభ్యమయ్యే విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) |
|---|---|---|---|---|---|
| 1. | అంతకపల్లి | సబ్బవరం | 109, 110, 114, 117, 120, 121, 123, 661-680 | 166.669 | 166.669 |

అందువలన, ఫారమ్–1 షెడ్యూల్–2 సబ్బవరం మండలంలో, అంతకపల్లి గ్రామమునకు సంబంధించిన లబ్ధిదారులు జాబితా సిద్ధం చేసి తేది.09.06.2026దిన సదరు ప్రకటనను ఈక్రింద తెలుపబడిన ప్రభుత్వ కార్యాలయములలో ప్రజలకు సమాచారము నిమిత్తం ప్రచురించడమైనది.
1) కలెక్టర్ వారి కార్యాలయము, అనకాపల్లి
2) మెట్రోపాలిటన్ కమీషనర్ వారి కార్యాలయము, VMRDA విశాఖపట్నం
3. రెవిన్యూ డివిజినల్ అధికారి వారి కార్యాలయము, అనకాపల్లి
4) తహసిల్దారు వారి కార్యాలయము, సబ్బవరం
5) మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి వారి కార్యాలయము, సబ్బవరం
6) స్టేషన్ హౌస్ ఆఫీసర్ వారి కార్యాలయము, సబ్బవరం
7) సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయము, సబ్బవరం
8) గ్రామసచివాలయం, అంతకపల్లి
9) గ్రామ పంచాయతీ కార్యాలయము, అంతకపల్లి
ఈ నోటిఫికేషన్ (ప్రకటన) వెలువడిన 60 రోజులలోగా అనగా తేది:09.06.2026 నుండి తేది: 08.08.2026ది లోపు సంబంధిత వ్యక్తులు వారి యొక్క అభ్యంతరములను / సలహాలను ఫారము–2 లోను మరియు అంగీకార పత్రములను ఫారం–3 ద్వారా అధీకృత అధికారి వారికి అనగా రెవిన్యూ డివిజనల్ అధికారి, అనకాపల్లి వారికి సమర్పించవచ్చును.
భూసమీకరణ పథకము క్రింద ప్రతిపాదించిన భూమి ప్లాను అతుకుబడి రైతులు మరియు అనభ్యంతర ప్రభుత్వ భూముల ఆక్రమణదారులు గాని లేదా ఇతరులు గాని కార్యాలయ పని వేళలలో అధీకృత అధికారి వారి కార్యాలయములో తనిఖీ చేసుకొను నిమిత్తము లభ్యముగా వుండును. సదరు నకలును అథారిటీ అనగా విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారి వెబ్‌సైట్‌లో కూడా పొందు పరచబడినది.
గడువు తీరిన పిదప వచ్చిన అభ్యంతరములు మరియు గడువులోపు వచ్చిన అభ్యంతరములలో ఆక్షేపించే వ్యక్తి అతనికి సంభందించిన ఆక్షేపణ స్వభావము నందు స్పష్టత లేనిచో అవి తిరస్కరించబడును.
నిర్దిష్ట గడువులోగా వచ్చిన అభ్యంతరములు మరియు సలహాలు తేదీ:09.08.2026దిన ఉదయము 11:00 గంటలకు తహసీల్దార్ వారి కార్యాలయం, సబ్బవరంవారి వద్ద విచారించబడును. సంబందిత ఆక్షేపణదారులు స్వయముగా గాని లేదా వారి న్యాయవాది ద్వారా గాని హాజరై మౌఖిక లేదా డాక్యుమెంటరీ వివరణ తెలియజేయవచ్చును.

సం/- అధీకృత అధికారి (ల్యాండ్ పూలింగ్ స్కీము)
మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, అనకాపల్లి

వార్త

కేవలం ఆలోచించడం కాదు, ఆచరణ ముఖ్యం. అదీ ఇప్పుడే ప్రారంభించాలి తప్ప రేపటికి వాయిదా వేయకూడదు.

-ఇ. గిబ్బన్

# ఈ పంథా ఏ 'మార్పు' కోసం!


'మా వ్యూహాలకు మేమే రాజులం. వ్యూహం చేశామంటే అవి పండి తీరాలంతే! అని ఎవరేనా అనుకుంటే వాళ్ల పప్పులో కాలేసినట్లే! ఎవరు వ్యూహం చేశారని అల నాడు విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు పార్టీ స్థాపించిన అతి తక్కువ కాలంలో ఆంధ్రప్రదేశ్ పీఠమెక్కగలిగారు. ఎవరి ప్రోత్సాహంతో ద్రవిడ నాట సినీ కథానాయకుడు దళపతి విజయ్ కొత్త రాజకీయ పార్టీతో ప్రజల్లోకొచ్చి ప్రజల కోసం, ప్రజల చేత ప్రజల పాలనకు తెరదీసే అవకాశమిచ్చారు.అదంతా ప్రజల చలువ వల్లనే. అదే దారిలో, అదే పోకడలో ద్రవిడ నాట రాజకీయాలు నడపాలన్న ధోరణిలో తమిళ నాడు మాజీ బిజెపి నేత అన్నామలై మరోసారి నడుం బిగించారు. తాను తమిళనాడు బిజెపి అధ్యక్షునిగా ఉన్నంతకాలం అక్కడ రాజకీయాల్లో కొత్త బాటలు వేసేం దుకు బిజెపి అధిష్ఠానం సహకారం పూర్తిస్థాయిలో దక్కలేదని ఆయనే స్వయంగా చెప్పారు. ఇటీవలి ఎన్నికల్లోనైనా ద్రవిడ పార్టీలను దాటి విజయ పథంలోకి అడుగుపెట్టాలన్న ఆయన ప్రయత్నాలకు బిజెపి కలిసి రాలేదు. తమిళనాట ద్రవిడ పార్టీల అనుబంధం నుంచి బయటికొచ్చే ప్రయత్నమేవీ చేయకపోగా అన్నాడిఎంకెలో కలిసి సాగడంతో అన్నామలై కాస్త పక్కకు జరిగి మౌనంగా, దూరంగా జరిగి ఉండిపోయారు. ఎన్నికల ముందూ వ్యూహాలు, ప్రతివ్యూహాలు ఆనక ఓటమి చెందితే మరో ఎన్నికకు సిద్ధం కావడం మామూలుగా ఏ రాజకీయ పార్టీయేనా చేసే పని. కానీ ఒక్కసారిగా ద్రవిడనాట ద్రవిడ నేపథ్యం, భావజాలం ఉన్న పార్టీలు చతికిలపడిపోవడం, సంప్రదాయేతర పార్టీతో ద్రవిడేతర పార్టీ అధికారంలోకి రావడంతో ఇప్పుడక్కడ రాజకీయ కలకలం చోటు చేసుకొంది. ఇవే సమీకరణలతో ఐదేళ్ల పాటు పార్టీలు నడుపుకోవడం, ప్రజాబాహుళ్యంలోకి వెళ్లి మనుగడ సాధించడమూ కష్టమే. పార్టీలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి.అయితే ఐదేళ్లు వేచి ఉండాలా? పదేళ్లు వేచి ఉండాలా అనే విషయమై స్పష్టత లేని తమిళనాడు రాజకీయాలను ఎవరూ నమ్ముకునే పరిస్థితి లేదు. పార్టీల్లో ద్వితీయశ్రేణి నేతలు అటూ ఇటూ చెల్లాచెదుర వుతున్నాయి. ప్రథమ శ్రేణి నాయకత్వం కూడా పక్క చూపులు చూస్తున్నాయి. ఎంత వేచి చూసినా కను చూపు మేరలో భవిష్యత్ ఆశాజనకం లేదని ఎంచి మాజీ మంత్రులు అధికార పార్టీలో చేరిపోతున్నారు. అన్నాడిఎంకె నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన నేతలు ఎక్కువ కాలం అధికారంలో లేకుండా ఉండేట్లు లేరు. ఎమ్మెల్యేగా గెలిచిన వారు సైతం బేషరతుగా టి.వి.కె. పార్టీలోకి చేరిపోతున్నారు. టివికె అధినేత ముఖ్యమంత్రి పూర్తి మెజారిటీకి అతితక్కువ దూరంలో ఉన్నందున చాలా మంది దానిని అందిపుచ్చుకుంటే తృణమోప్రణమో ప్రజా సేవలో ఉన్నట్లుగా ఉంటుంది. మర్యాద దక్కించు కున్నట్లూ ఉంటుంది అనుకుంటూ జంప్‌లు చేసేస్తు న్నారు. ఐపిఎస్ ఉద్యోగంచేస్తూ సమాజంలోమార్పుకోసం తన వంతుగా రాజీనామా చేసి రాజకీయ జపం చేసిన అన్నామలై కిందపడ్డా మళ్లీ తన ప్రయత్నాలను, ఆలోచ నలను వీడలేదు. ఎప్పుడైతే భారతీయ జనతాపార్టీవదిలి సరికొత్త రాజకీయ ప్రయాణానికి అడుగులువేశారు.'వుయ్ ది పీపుల్' పేరిట రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించా రు. స్పందన అనూహ్యం. త్వరలో ప్రజలే కేంద్రంగా ఓ రాజకీయ పార్టీని స్థాపించే పనిలో పడ్డారు. 'మారుదాం. మార్చుదాం' అనే నినాదంతో కొత్త రాజకీయ ప్రస్థానానికి నాంది పలికారు. 'నా మార్గం వేరు, నా లక్ష్యాలు విస్తృ తం. తమిళనాట ఒక సరికొత్త రాజకీయ సంస్కృతిని, సమున్నతమైన మార్పును తీసుకురావాలనుంది అని అన్నామలై స్పష్టం చేశారు. ఎవరెన్ని రాజకీయాలు చేసి నా, రాజకీయ పార్టీ లకు అంతిమ లక్ష్యం అధికారమే. ఒక ఉద్యమానికి పునాది వేస్తే 'మార్పు' అదే వస్తుందన్న ఆలోచనలతో ఆయన వ్యూహాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల తమిళ తంబి లో వచ్చిన మార్పు సినీ నటుడి పార్టీకి అధికారం కట్టబెట్టిన తీరు చూస్తే 'మళ్లీ ఇంకేంకావాలి' అనిఎవరైనా ప్రశ్నిస్తే, అన్నామలై తన గమ్యానికి సరైన దారి వేసుకునే పనిలో ఉన్నారు. తమిళనాడు రాజకీయా ల్లో కాకావికలైన అన్ని పార్టీలు తమ రాజకీయమార్గాన్ని, రాజీ మార్గాన్ని కొత్త పుంతలు తొక్కించే ప్రయత్నం చేస్తున్నారు. ముందు ఉద్యమంలా బయటికొచ్చి ఆపైన రాజకీయ ఆకాంక్షలు నెరవేర్చుకునే విధంగా ఆలోచనలు చేస్తున్నారు. తమిళునిగా కొనసాగుతూ బిజెపిలో ఉండ డం కష్టమైన పనిగా భావించిన అన్నామలై కొత్త పంథా లోకి అడుగు పెట్టారన్న మాట. కొత్తగా రాజకీయాన్వే షణ చేసే వారికి రాజకీయాలు నేర్పేందుకు సన్నద్ధమ య్యారు. కోయంబత్తూరులో ఎపిజె అబ్దుల్ కలాం సెంటర్ ఫర్ ఎథిక్స్ ప్రారంభించే ఏర్పాట్లు జరుగుతు న్నాయి.రాజకీయ నేతలు కొత్తగా పార్టీ పెట్టే సమయం లో చెప్పే మాటలే ఆయనా చెప్పారు. తమిళనాట రాజ కీయ కూటముల్లో మిత్రులెవరూ ఆనందంగాలేరు. బయ టికెళ్లి అధికార పార్టీలో మమేకమైపోయినా లోపలుండి చేసేదేమీ లేదని తదుపరి కార్యాచరణకు సంసిద్ధంలో ఉన్నారు.నెమ్మదిగా తమకున్న రాజకీయ అనుబంధాలను తప్పించుకునే ప్రయత్నంలో ఉన్నారు. మొన్నటిఎన్నికల్లో చితికిపోయిన వారు సైతం ఏంచేయాలో తోచక, నలు గురులో నవ్వులపాలవకుండా ఉండేందుకు కొత్తగా ఉద్య మాలు నిర్మిస్తామంటున్నారు. ఇదిలాఉండగా సూపర్ స్టార్ విజయకాంత్ సతీమణి, సామాజిక కార్యకర్త ప్రేమలతా రజినీకాంత్ ఎండిఎంకె తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ ద్రవిడ పార్టీల కూటమిలో ఉండిపోవడం తో తమిళనాడు రాష్ట్ర శ్రేయస్సు అభివృద్ధి కోసం 'నినా దంతో'మక్కల్ మేడ్రై' పేరిట సామాజిక ఉద్యమానికిపిలు పునిచ్చారు.ఆరాష్ట్రంలో రాజకీయ సామాజికపరిణామాలు ఎంతో మందికి ఎన్నో కొత్తదారులు చూపిస్తున్నాయి.

జీవితం ఒక పాఠశాల వంటిది. ఇక్కడ ప్రతి బాధ, ప్రతి హృదయం విదారకత మనకు అమూల్యమైన పాఠాన్ని నేర్పుతుంది.



స్వామి వివేకానంద

అనేక విత్తనాలు విత్తడం ద్వారా నేల ఏ విధంగా సారవంతమ వుతుందో అలాగే రకరకాల విషయాలను పరిశీలించడం ద్వారా మనసు వికసిసుంది.



జెఫర్సన్

# 'పొల్లు మాట'లతో చేటు తేవొద్దు

**తెలంగాణావారి హక్కులను ఇతరుల పాలు కాకుండా చేయడానికి. ఎవరైనా ఎక్కడివారైనా ఇక్కడికి రావచ్చు, ఏమైనా చేసుకోవచ్చు కాని ఇచటి రాజకీయ పరమైన ఉన్నత పదవులు అంటే, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రిలాంటివి ఇక్కడి వారికే, లేక ఇక్కడ చిరకాలంగా నివసిస్తున్నా వారికే దక్కాలి అనే నిబంధనను చేసుకోవచ్చు. అప్పుడు తెలంగాణలోని విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు, భూమి వనరులు మున్నగువాటికిచెందిన యాజమాన్యతలు పూర్వం నుండి ఇచటే పుట్టి పెరిగిన వారికి లేక చాన్నాళ్ల నుండి ఇచ్చట స్థిరపడ్డవారికి మాత్రమే లభించేటట్లు చేయవచ్చు. ఆర్థిక స్థోమతే కదా అన్ని స్థోమ తల కంటే మిన్న. అలాంటి ఆర్థిక స్థోమత తగ్గుతుందేమో నని తెలంగాణా ప్రాంతం వారికున్న భయాందోళనలు, సందేహాలు సహజమే కదా! ఇప్పుడు గొడవంతా వస్తున్నది ఆ భయాందోళనల, సందేహాల వలననే కదా? తెలంగాణా వారి భయాందోళనలను, సందేహాలను నివారించాలంటే పవన్ కళ్యాణ్ వీటిని పట్టించుకోవలసుంటుంది. సిద్ధమేనా మరి! పవన్ కళ్యాణ్ కాస్తాగి వీటిగురించి సావధానంగా ఆలోచించి ముందడుగు వేయగలరా మరి?**



డా॥కొండలరావు వెల్చాల

ఇదేనా మన సభ్యత, సంస్కారం, సాంప్రదాయం? ఇదేనా మనకు మన విద్య ద్వారా లభించినవినయం, వివేకం, వికాసం? ఈ మధ్య హైదరా బాదులో చెలరేగుతున్న మాటల మాయాజాలం నన్నెంతో కలవరపరి చింది. ఇంకా కలవర పరుస్తూనే ఉంది. దేశ స్వాతంత్ర్య సమరంలో, హైదరాబాదు రాష్ట్రం భారతదేశంలో విలీనం కావడానికి ఆనాటి హైదరా బాదు వారు జరిపిన విలీన పోరాటం లో, అటు తదుపరి తెలంగాణ అస్తిత్వ పోరాటంలో చాలా చురుకుగా పనిచేసి కరవళ్ల మోసిన వాణ్ణి, కారాగారాల్లో బంధించబడినవాణ్ణి. నిజమైన, స్వచ్ఛమైన స్వాతంత్ర్య సమరయోధుణ్ణి. కనుకనే ఈనాటి అసభ్యకరమైన, ఆందో ళనకరమైన మాటల పోటీలను చూస్తుంటే, వింటుంటే తట్టుకోజాలడం లేదు. ఇదేనా మనం మన యువతకిస్తున్న సందేశం, వారసత్వం? ఇందుకొరకేనా మనం సకల త్యాగాలతో స్వాతంత్ర్యాన్ని సాధించింది? అని అనుకుంటూ శాంతి ప్రశాంతతలు కోల్పోతున్నాను. ఒక దేశం లేక రాష్ట్రంవారు ఇంకొక దేశానికి, రాష్ట్రానికి అనేకానేక కారణాల వల్ల రావటం పోవటం జరగడం అనాదిగా మామూలే కదా! అది వ్యాపారం కొరకు కావచ్చు, విద్య కొరకు కావచ్చు. ఉపాధి కొరకు కావచ్చు, కాని నాకు తెలిసినంతవరకు అది రాజకీయాల కొరకు మాత్రం కాదు, కాకూడదు కూడా. కాని ఇప్పుడు మాత్రం తక్కినవాటికంటే రాజకీయ కారణాలే ఎక్కువేమోనని తెలంగాణావారు గాభరా పడుతున్నారు. అందుకేనేమో కొందరు అలజడులకు, అసభ్య పదజాలాలకు పాటుపడుతున్నారు. ఇది వారి విశ్వాసానికి చెందిన విషయం. దానికి గత చరిత్ర కారణం కదా! కాదనగలమా మరి! ఒకప్పుడు తెలంగాణాను ఆంధ్రా ప్రాంతంలో విలీనం చేస్తున్నప్పుడు 'జంటిల్మెన్ అగ్రిమెంట్' ద్వారా తెలంగాణా వారికి ఆంధ్రాప్రాంతపు నేతలు ఎన్నో వాగ్దానాలు చేశారు. వాటిని పట్టించుకోకపోవడం వలననే కదా ప్రత్యేక తెలం గాణా పోరాటం వచ్చింది. మరి ఇప్పుడుకూడా ఈనాటి ప్రభుత్వాలు అనేకానేక వాగ్దానాలు చేస్తూనే ఉన్నాయి. వాటిని అమలు చేయకుండా చేతులెత్తేస్తూనే ఉన్నాయి. వాటికి అనేకానేక కారణాలు ఉదహరిస్తూ. మరొకసారి తెలుగువారందరూ కలిస్తే రెండు రాష్ట్రాలు ఒక్కటైతే తెలం గాణా వారికి అదే గతి పడుతుందేమోననే అనుమానం రాకుండా ఉంటుందా? ఇంగ్లీషులో ఒక సామెత 'వి హాడ్ ద ఎక్స్‌పీరియన్స్ బట్ మిస్స్‌డ్ ద మీనింగ్' యనునది ఉంది. ఇంకొకటి 'హిస్టరీ టీచస్ అజ్ దట్ మ్యాన్‌కైండ్ హార్డ్లీ లర్న్స్ ఎనీథింగ్ ఫ్రమ్ హిస్టరీ' యనునది. ఇప్పుడు హైదరాబాద్‌లో జరుగుతున్న కలహాలను చూస్తుంటే ఔను కదా! అంతే కదా! అని అనిపిస్తుంది. మనకు మొదటి ప్రపంచ యుద్ధం వచ్చింది.దానితో మనమేం నేర్చుకున్నాం. రెండవ ప్రపంచయుద్ధం వచ్చింది. మనమేం నేర్చుకున్నాం. ఇప్పుడు మూడో ప్రపంచయుద్ధం దాదాపు మొదలైంది. దానివలన మనమేం నేర్చుకుంటున్నాం? తెలంగాణ అస్తిత్వ పోరాటం వచ్చింది, దానితో మనం ఏం నేర్చుకున్నాం? ఇదీ అంతే కావచ్చునను భయాందోళన ఈనాటి తెలంగాణా వారి



అలజడికి, అప్రస్తుత, అసభ్య పదజాల వాడుకకు కారణం కాదని నిస్సందేహంగా అనగలమా?పవన్ కళ్యాణ్ జనసేన యను ఒక పార్టీని స్థాపించారు. ఆ పార్టీని తెలంగాణాలో కూడా పెట్టదలచుకున్నారు. దానికి అభ్యంతరమెందుకు? ఆయన హైదరాబాదులో ఒక సభ జరపాలనిఅనుకున్నారు. దానికి అనుమతి నిరాకరణ ఎందుకు? ఆ పార్టీ కాక ఇంకా ఎన్నో పార్టీలు హైదరాబాదులో లేవా? ఇంకా వస్తూనే ఉన్నాయి కదా? ఆయా పార్టీలు వారివారి సభలు సమావే శాలు జరుపుకోవడం లేదా? అసలు కారణం అది కాదు. అసలు కారణం ఆనాటి ఆంధ్రాప్రాంతపు అధిపత్యం తిరిగి మరొకసారి తెలంగాణాకి వస్తుందేమోనని, ఇది తెలంగాణా వారి విశ్వాసానికి చెందింది. ఎవరెన్ని అన్నా ఆ విశ్వాసం ఇంత త్వరగా పోదు, పోజాలదు. ఇది పవన్ కళ్యాణ్ అర్థం చేసుకొని ఇంత తొందరగా ఇచట వారి పార్టీకి చెందిన సన్నాహాలు ప్రారంభించకపోతే బాగుండేదేమో? కాస్త రాజకీయ వాతావరణం చల్లబడ్డాక మరికొంతకాలం ఓపిక పట్టి, ఈలోపల అచటి ఇచటి మేధావులతో సంప్రదించి కొన్ని సమిష్టి సభలు, సదస్సులు నిర్వహించి అనుకూల మైన వాతావరణాన్ని సృష్టించి ఇప్పుడు చేయదలచుకున్న వన్నీ అప్పుడు చేస్తే బాగుండేదేమో? కాస్త తొందరపాటు జరిగిందని అనిపిస్తోంది. ఒకనాటి హైదరాబాదు రాష్ట్రంలో 'ముల్కీరూల్స్' యనునవి ఉండేవి. వాటిద్వారా హైదరా బాదు రాష్ట్రంలోని విద్యావసతులు, ఉద్యోగాలు, భూమి పుత్రులు మున్నగునవి మొదట హైదరాబాదు వారికే చెందాలి అనే నిబంధన ఉండేది. వాటిని తూ.చ తప్పక అమలు చేసినన్ని రోజులు ఏ గొడవలూ రాలేదు. ఎపుడైతే వాటిని అమలు చేయలేదో, అమలు చేయుటకు ఎన్నో అవ రోధాలు కల్పించి, వాటిని ఇతర ప్రాంతాల వారు కాజేయు టకు వీలు కల్పించారో అప్పుడు వచ్చింది ప్రత్యేక తెలంగాణ పోరాటం, దీని గురించి'గిర్గలాని కమీషన్' సవివరంగా పేర్కొంది. అప్పటికీ ఇప్పటికీ అసలు గొడవంతా విద్యావస రాల కొరకు, ఉద్యోగాల కొరకు, భూములు, నీళ్ల వగైరాల కొరకే కదా? అలాంటప్పుడు ఆనాటి 'ముల్కీ రూల్స్' లాంటివి ఈనాడు కూడా తెలంగాణా వారికొరకు పెట్టుకో వచ్చు కదా! అలాంటి ముల్కీరూల్స్ లాంటివి కాశ్మీర్లో కూడా అమలులో ఉన్నాయి కదా. అప్పుడు ఈ గొడవంతా ఉండదు కదా! సోనియాగాంధీకి ఒకప్పుడు ప్రధానమంత్రి అయ్యే అవకాశం ఉండింది. ఆమెను అలా కానివ్వకుండా సుబ్రహ్మణ్యస్వామి రాష్ట్రపతి దగ్గరకు వెళ్ళి ఈమె ఇటాలి యన్ దేశ పౌరసత్వం కలది, ఆ దేశ రాజ్యాంగంలో ఆ దేశపౌరులు కానివారు ఆ దేశానికి రావచ్చు. ఏ కార్యకలా పాలనైనా చేసుకోవచ్చు. కాని అత్యంత ప్రముఖమైన ప్రధానమంత్రిత్వాన్ని మాత్రం ఆ దేశ పౌరుడికే ఉంటుంది' యని రాసి ఉంది. అలాగే ఇక్కడ కూడా ఇక్కడి ప్రధాన మంత్రిత్వం ఇక్కడి వారికే దక్కాలి కాని మరొకరికి కాదు యని వాదించి ఆమెను ప్రధానమంత్రి కాకుండా చేశారు. అలాంటి నిబంధనను మనం కూడా 'ముల్కీరూల్స్' పెట్టుకోవడానికి ఉదాహరణగా తీసుకోవచ్చు. తెలంగాణావారి హక్కులను ఇతరులపాలు కాకుండా చేయడానికి. ఎవరైనా ఎక్కడివారైనా ఇక్కడికి రావచ్చు, ఏమైనా చేసుకోవచ్చు కాని ఇచటి రాజకీయ పరమైన ఉన్నత పదవులు అంటే, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రిలాంటివి ఇక్కడి వారికే, లేక ఇక్కడ చిరకాలంగా నివసిస్తున్నా వారికే దక్కాలి అనే నిబంధనను చేసుకోవచ్చు. అప్పుడు తెలంగాణలోని విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు, భూమి వనరులు మున్నగువాటికిచెందిన యాజమాన్యతలు పూర్వం నుండి ఇచటే పుట్టి పెరిగిన వారికి లేక చాన్నాళ్ల నుండి ఇచ్చట స్థిరపడ్డవారికి మాత్రమే లభించేటట్లు చేయవచ్చు. ఆర్థిక స్థోమతే కదా అన్ని స్థోమ తల కంటే మిన్న. అలాంటి ఆర్థిక స్థోమత తగ్గుతుందేమో నని తెలంగాణా ప్రాంతం వారికున్న భయాందోళనలు, సందేహాలు సహజమే కదా! ఇప్పుడు గొడవంతా వస్తున్నది ఆ భయాందోళనల, సందేహాల వలననే కదా? తెలంగాణా వారి భయాందోళనలను, సందేహాలను నివారించాలంటే పవన్ కళ్యాణ్ వీటిని పట్టించుకోవలసుంటుంది. సిద్ధమేనా మరి! పవన్ కళ్యాణ్ కాస్తాగి వీటిగురించి సావధానంగా ఆలోచించి ముందడుగు వేయగలరా మరి? •

(రచయిత: సీనియర్ స్వాతంత్ర్య సమరయోధులు)

# అమెరికా, ఇజ్రాయెల్ సంబంధాల్లో కొత్త అధ్యాయం

సీహెచ్ వి ప్రభాకర్ రావు

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా కాంగ్రెస్ సభ్యుడు మార్లిన్ స్టుట్మనక్కు పంపిన లేఖ అమెరికా-ఇజ్రాయెల్ సంబంధాలపై ఒక కొత్త చర్చకు తెర తీసింది. ఆ లేఖలో నెతన్యాహు అమెరికా ఇజ్రాయిల్ రక్షణ సహకారాన్ని 'సహాయం నుండి భాగస్వామ్యం వైపు' మార్చాలి అని పేర్కొనడం, అమెరికా రాజకీయ, రక్షణ, ఇంటెలిజెన్స్ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చలకు దారితీసింది. అమెరికా మీడియా నివేదికల ప్రకారం, నెతన్యాహు 'ఇజ్రాయెల్ ఇక భాగస్వామి కావాలి' అని స్పష్టంగా చెప్పి నట్లు తెలుస్తోంది. దశాబ్దాలుగా అమెరికా ప్రతి సంవత్స రం ఇజ్రాయెల్‌కు సుమారు 3.8 బిలియన్ డాలర్ల సైనిక సహాయం అందిస్తోంది. కానీ ఇప్పుడు ప్రతిపాదన ఏమి టంటే, ఆ సహాయాన్ని క్రమంగా తగ్గించి, దాని స్థానంలో సంయుక్త రక్షణ ఉత్పత్తి, సంయుక్త పరిశోధన, సైబర్ భద్రత, కృత్రిమ మేధస్సు, క్షిపణి రక్షణ వ్యవస్థలు, డ్రోన్ సాంకేతికతలలో ఉమ్మడి పెట్టుబడులు పెట్టే భాగస్వామ్య నమూనాను రూపొందించడం. ఈ మార్పు పైకి చూస్తే అమెరికా, ఇజ్రాయెల్ సంబంధాలను మరింత బలోపేతం చేసే చర్యలా కనిపిస్తుంది. అయితే లోతుగా పరిశీలిస్తే ఇది కేవలం ఆర్థిక సహాయం తగ్గింపు కాదు. ఇదిశక్తి సంబం ధాల పునర్వ్యవస్థీకరణ. గతంలో అమెరికా నాయకత్వం వహించే సంబంధం ఉండగా, ఇప్పుడు ఇజ్రాయెల్ సమాన భాగస్వామిగా గుర్తింపు కోరుతోంది.అమెరికా భద్రతా వ్యవ స్థలో కొందరు అధికారులు ఈమార్పును జాగ్రత్తగా గమని స్తున్నారు.కారణం సైనిక సహాయంకంటే సాంకేతికభాగస్వా మ్యం మరింత లోతైనది. ఒకసారిరెండు దేశాల రక్షణ పరి శ్రమలు,ఏఐ, వ్యవస్థలు,సైబర్ నెట్వర్క్స్, క్షిపణి రక్షణ వ్యవస్థలు పరస్పరం అనుసంధానమైతే, సమాచారం ప్రవా హం కూడా విస్తృతమవుతుంది.అప్పుడు ప్రశ్నకేవలం సహా కారం గురించే కాదు,సున్నితమైన సాంకేతికతపై ఎవరి ప్రభావం ఎంత అన్నది కూడా కీలకమవుతుంది. చరిత్రలో అమెరికా, ఇజ్రాయెల్ మధ్య సంపూర్ణ విశ్వాసం మాత్రమే ఉండలేదు.మిత్రదేశాల మధ్యకూడా గూఢచర్య ఆరోపణలు, ఇంటెలిజెన్స్ వివాదాలు చోటుచేసు కున్నాయి. అందువల్ల అమెరికా కౌంటర్ ఇంటెలిజెన్స్ వర్గాల్లో కొందరు 'భాగస్వా మ్యం ఎంత వరకు?' అనే ప్రశ్నను లేవనెత్తడం సహజమే. నెతన్యాహు ప్రతిపాదనను మరో కోణంలోచూస్తే,ఇది ఇజ్రా యెల్ వ్యూహాత్మక ఆత్మవిశ్వాసానికి సంకేతం, గతంలో సహాయం పొందిన దేశం ఇప్పుడు 'మేము నిలబడగలుగు తాం, కానీ భాగస్వామ్యంగా ముందుకు వెళ్తాం' అని చెబు తోంది. ఇదిఅమెరికా సహాయంపై ఆధారపడే మోడల్ నుండి, అమెరికా సాంకేతిక రక్షణవ్యవస్థలో కీలక భాగస్వా మిగా మారే ప్రయత్నం. ఇక్కడ అమెరికా రాజకీయాల్లో మరో అంశం కూడా ఉంది. గత కొన్నేళ్లుగా అమెరికాలో విదేశీ సహాయంపై విమర్శలు పెరుగుతున్నాయి. అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బుఎందుకు విదేశాలకు వెళ్తోందనే ప్రశ్న రిపబ్లికన్ వర్గాల్లో బలపడుతోంది. ఈ నేపథ్యంలో 'సహాయం నుండి భాగస్వామ్యం వైపు' మోడల్ రాజకీ యంగా కూడా ఆకర్షణీయంగా మారింది. ఎందుకంటే ఇది సహాయం కొనసాగించడం కాదువాణిజ్యం, ఉమ్మడి పెట్టు బడులు,ఉమ్మడి ఉత్పత్తి అనే కొత్తభాషనుఉపయోగిస్తోంది. అమెరికాకు ఇది ఒక అవకాశం. అత్యాధునిక సాంకేతిక రంగాల్లో విశ్వసనీయ భాగస్వామ్యాన్ని మరింతగా ఉపయో గించుకోవడం. ప్రపంచ అగ్రరాజ్యంగా తన వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని,సాంకేతిక ఆధిపత్యాన్ని,ఇంటెలిజెన్స్ భద్రత ను కాపాడుకుంటూనే ఆభాగస్వామ్యాన్ని నిర్వహించడం. రాబోయేదశాబ్దంలో అమెరికా ఇజ్రాయెల్ సంబంధాల భవి ష్యత్తు ఈ సమతుల్యతపైనే ఆధారపడి ఉండవచ్చు. •

# భూ ఆక్రమణదారులపై హైడ్రా కొరడా!

ఆర్.భాస్కర్ రెడ్డి

ఒక బృహత్తర లక్ష్యంతో భావితరాల ఉపయోగార్థం ముఖ్యంగా హైదరాబాద్ ప్రజల సంరక్షణార్థం కొరకు ఆస్తుల రక్షణ ,పర్యవేక్షణ విపత్తుల నిర్వహణ పకడ్బందీగా అమలు చేసే ఉద్దేశంతో హైడ్రాను ఏర్పాటు చేసి త్వరిత గతిన ఆక్రమణలు తొలగించి ప్రభుత్వం హైడ్రా ద్వారా భూములను స్వాధీనం చేసుకుంటుంది .ఇది అన్ని వర్గాలు స్వాగతించవలసిన విషయం. కానీ ఎన్నో విమర్శలు, మరెన్నో విన్నపాల మధ్య దాదాపు ఎనభై ఆరు వేల కోట్ల రూపాయల విలువైన ,రెండు వేల తొంబై మూడు ఎకరాల భూములను స్వాధీనం చేసుకుంది. ఇందులో చెరువులు, కుంటలు, సరస్సులు,నాలాలు, ప్రభుత్వ భూములు,ప్రజల పార్కులు ఉన్నాయి. ఈ ఆక్రమణ నిర్మాణాలను గమనిస్తే ఎక్కువగా రాజకీయ నాయకులు చేసినవి లేదా వారి అధి నాయకులు చేసినవే ఎక్కువగాఉన్నాయని స్పష్టమవుతుంది. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలను నమ్మించి వారి ద్వారా సొమ్ముచేసుకున్న భూములు కనబడుతున్నాయి. విచిత్రంగా అన్ని రాజకీయ పార్టీల నుండి, అన్ని రకాల వర్గాల ప్రజల నుండి, మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా తీసుకునే చర్యలను స్వాగతిస్తున్నారు ఇది హర్షించదగిన సందర్భం. గతంలోనే తెలంగాణ హైకోర్టు మూసీ నది నాలాల వెంట దాదాపు 30 వేల నిర్మాణాలు వెలిశాయని వాటిని తొలగించి అక్కడ నివసించే ప్రజలకు పునరావాస చర్యలు తీసుకోవాలని ,అప్పుడే వరదలు తగ్గుముఖం పడ తాయని, నాళాలు సురక్షితంగా ఉంచాలని ప్రభుత్వానికి సూచించింది. కానీ ఇప్పటివరకు ఏ ప్రభుత్వం వాటిపై సరైన దృష్టి పెట్టిన దాఖలు లేవు. వర్షాకాలం వచ్చిందంటే హైదరాబాదు నగర జీవనం అష్ట కష్టాలు పడుతూ జీవిం చాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రోడ్లన్నీ జలాశయాలను తలపిస్తూ విపరీతమైన ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. భారీ వర్షాలు పడిన సందర్భంలో ఎప్పుడూ ,ఎక్కడ, ఏ ప్రమాదం సంభవిస్తుందో అనే సందేహం, భయం ఉత్పన్న మవుతుంది. వీటన్నింటి అనర్థాలకు నాళాలు, చెరువులు, కుంటలు కబ్జా చేసిన పుణ్యఫలమే అని అందరికీ తెలుసు. ఈ మధ్యకాలంలో నాలాలలో పాఠశాల విద్యార్థులు పడి చనిపోయిన ఉదంతాలు చాలా జరిగాయి. కానీ ఏడు దశాబ్దాలుగా సినిమా సన్నివేశాల లాగా చూస్తూ ఉన్న ప్రభుత్వ పాలన శాఖలు కబ్జా కోరల నుండి రక్షణ కల్పిం చకపోగా, ఆక్రమణదారులకు రక్షణగా నిలిచి పర్యవేక్షణ చేశాయి. కానీ ఈ మధ్యే తెలంగాణ ప్రభుత్వం మూసి నాల అభివృద్ధి కార్యక్రమం పేరుతో మూసి నది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి పథకాన్ని రూపొందించిం ది. ఆక్రమణలు,కబ్జాలే కాక అనేక సమస్యలకు నిలయంగా మారిన కూడా హైదరాబాద్ ఒక విశ్వనగరంగావర్ధిల్లుతుంది. అనేక రకాల మతాల, కులాల, ప్రాంతాల, భాషల,వివిధ



దేశాల ప్రజలు కలిసిమెలిసి బ్రతుకుతూ బహుళ సంస్కృ తిని ఏర్పరిచినారు. హైదరాబాద్ నగరానికి అనేక పేర్లు ఉన్నాయి. కానీ చెరువుల నగరం,తోటల నగరం అనే పేరు కూడా ఉండేదని చారిత్రకంగా అవగతం అవుతుంది. ఎన్వి రాన్మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అధ్యయనం ప్రకారం, హైదరాబాద్ నగరంలో సుమారు 140 పెద్ద చిన్న సరస్సులు ఉన్నాయి. మరో 834 నీటి ట్యాంకులు 25ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. కానీ హుడా సరస్సుల పరిరక్షణ ప్రణాళిక, క్రింద 2018 మే నాటికి కేవలం 169 సరస్సుల రికార్డులను మాత్రమే నిర్వహిస్తుంది. అనగా నగరంలోని నీటి వనరులు, ఇతర నీటి వనరుల ఉపరితల వైశాల్యం తగ్గుతూ వస్తుంది.అలాగే నగరంలో రియల్ ఎస్టేట్ లేదా పట్టణీకరణ వేగవంతమైన వృద్ధి వలన వేలాది ట్యాంకులు అంతరించిపోయాయి. ఉదాహరణకు అఫ్జల్ సాగర్, కుంట భవాని దాస్ ,మాసబ్ ట్యాంక్ ,మీరు జుమ్లా ట్యాంక్,నల్లకుంట ,నవాబ్ సాహెబ్ కుంట, సోమాజిగూడ ట్యాంక్, తీగలకుంట కను మరుగ య్యాయి. 1990లో హుస్సేన్ సాగర్ చెరువు 1375 ఎకరాలుగా ఉండేది. ఆక్రమణకు గురై ఈ ప్రాంతంప్రస్తుతం 825 ఎకరాలకు మాత్రమే పరిమితమై ఉంది. అలాగే నగరంలో 1973 నుండి 1996 కాలంలో పట్టణ ఆక్రమణ కాలుష్యం కారణంగా హైదరాబాద్ పది హెక్టార్ల కంటే ఎక్కువ పరిమాణంలో ఉన్న 18 నీటి వనరులను పది హెక్టార్ల కంటే తక్కువ పరిమాణంలో ఉన్న 80 చిన్న నీటి వనరులను కోల్పోయింది. అలాగే కేంద్ర జలవనరుల శాఖ సర్వే ప్రకారం,చిన్న నీటి వనరుల ఆక్రమణలలో దేశంలో నాలుగో స్థానంలో తెలంగాణ రాష్ట్రం ఉంది. బ్రాండ్ హైద రాబాద్ పేరును నిలబట్టుకోవడానికి కావలసిన మౌలిక సదు పాయాలను కల్పిస్తూ, ప్రభుత్వ భూమి ఆక్రమణలకు తావు లేకుండా చేసి ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించేలా, పరిశ్ర మలను నెలకొల్పేలా, ప్రజాపాలన అందించేలా, ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనంగా నిర్ణయాలు తీసుకోవా లి. వీటిని నెరవేర్చడానికి హైడ్రా తోడ్పాటు అందిస్తుందని ఆశలు చిగురిస్తున్నాయి. కానీ ఇది వానాకాలం వరకే పరి మితం కాకుండా, రాజకీయ కోణంలో చూడకుండా, 365 రోజులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. అలాగే హైడ్రా ను తెలంగాణ మొత్తంపరిరక్షించే విధంగా చట్టంలో మార్పు తీసుకు రావాలి. గ్రామీణ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు జరుగుతున్న భూ కబ్జాలను గుర్తించి పేద వారికి న్యాయం చేయాలి. ఏడు దశాబ్దాలుగా ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించడానికి ఒక మంత్రివర్గ ఉప సంఘం నియమించి కబ్జాదారుల నుండి విడిపించుకోవాలి. అలాగే ఆస్తుల సంరక్షణకే పరిమితం కాకుండా విపత్తుల నిర్వహణ బాధ్యత కూడా హైడ్రా పై ఉన్నందున నగరంలో అనుమతుల్లేని నిర్మాణాల పైన ఉక్కుపాదం మోపాలి. ము ఖ్యంగా గత దశాబ్దకాలంగా వెల్లివిరిసిన అక్రమ నిర్మాణా లను వెంటనే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలి. అనుమతి లేని నిర్మాణాల వలన ఆ నిర్మాణాల సమయంలో అగ్ని ప్రమాదాలు తావు లేకుండా చేయాల్సిన అత్యవసర మార్గా లను ఏర్పాటు చేయని కారణంగా అనేకమంది అమాయ కులు ప్రాణాలు పోయిన సందర్భాలు ఈ మధ్యకాలంలో చాలా బయటపడినాయి. గత ప్రభుత్వం ప్రారంభించిన స్ట్రాటజిక్ నాలా డెవలప్మెంట్‌ను ముందుకు తీసుకెళ్తూ, మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టును తక్షణమేప్రారంభించి, హైదరాబాదును అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించే నగరంగా, పర్యావరణహితంగా, సమగ్ర, సుస్థిర, సమ్మిళిత అభివృద్ధి జరిగేలా అన్నిరకాల చర్యలు తీసుకుం టూ,అభివృద్ధి వేగం పెంచితేనే ప్రభుత్వం చెప్పిన ప్రజా పాలనకు అర్థం చేకూరుతుంది. •

# ప్రజావాక్కు

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరీక్షలనిర్వహణ పేపర్ల మూ ల్యాంకనం సరిగాజరగడం లేదనేది చాలా కాలంగా విని పిస్తున్నవిమర్శ.ప్రతిష్టాత్మకసంస్థల్లో చేరడానికి నిర్వహిం చే ఎంట్రన్స్ టెస్టులు ఉద్యోగాల కోసం అభ్యర్థులకు నిర్వ హించే టెస్టులు కూడా సరిగా ప్రూఫ్ రీడింగ్ చేయడం లేదు.గ్రమెటికల్‌మిస్టేక్స్ ఉంటున్నాయి.ప్రింటింగ్ మిస్టేక్స్ కూడా ఉంటున్నాయి.యాడ్స్ స్కోర్‌ఇవ్వడంలేదు. తప్పు లు ఏమైనాఉంటే అప్పీల్ చేయండిఅని అడుగుతున్నారు. ఎక్కువమంది అప్పీల్ చేయడానికి ఫీజు కట్టడానికి భయ పడి అప్పీల్ చేయడం లేదు. తద్వారా తప్పులు తడకల తో కూడినకే పేపర్ ఆధారంగానే మార్కులు ఇస్తున్నారు. ఇటీవల ఆంధ్ర యూనివర్సిటీ వారు నిర్వహించిన ఏపీ సెట్ 2025 లో పేపర్ వన్‌లో ఎనిమిది బిట్లు తప్పుగా ఇచ్చారు. వాటికిపదహారుమార్కులు. మాస్టర్‌కీలో ఆ తప్పు లు ఆధారంగానే ఆన్సర్లుఉన్నవి. ఇలాంటి పరీక్షలు నిర్వ హించే టప్పుడు అభ్యర్థుల నుండి ఎలాంటి విమర్శలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

పజాస్వామ్య వ్యవస్థలో ఓటరు తీర్పు అత్యంత పవి త్రమైనది. ప్రజలు ఒకసిద్ధాంతాన్ని నమ్మి తమ ప్రతినిధు లను ఎన్నుకుంటారు. అయితే ఇటీవల రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న ఫిరాయింపులు ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రలోభాలకు గురై పక్షాలుమార్చడం ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలి పెట్టు. ఈచట్టంలోని లొసుగులను వాడు కుని ప్రతినిధులు స్వార్థ ప్రయోజనాల కోసం పక్షాలు మారుతున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరో పక్షంలోకి వెళ్లడం ఓటర్లను మోసం చేయడమే. ఫిరాయింపులకు పాల్పడినప్పుడు సభ్యత్వం తక్షణమే రద్దు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## కర్షకులు అంటే విలువలేదా

నేటి భారతంలో అధిక పనుల పేరిట ఆదివారం కూడా ఆకలి మంటల కోసంఅహర్నిశలు కృషి చేస్తూ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రైవేట్ ఆఫీసులు,ఆసుపత్రుల బంధిఖానలో తీవ్రఅనారోగ్యానికి గురవుతున్న కార్మికులు ఎక్కువమందేఉన్నారు.జరఆరోగ్యం గురించిన్ను నమ్ము కున్న కుటుంబం గురించి ఆలోచించి ముందుకు సాగు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## డబుల్ బెడ్‌రూమ్స్ ఇళ్లు ఇవ్వాలి

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డబుల్ బెడ్ రూమ్లు ను వెంటనే ఇవ్వవలెను. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లు ఇప్పుడున్న ప్రభుత్వం లబ్ధిదారులకు కేటా యించాల్సినవి కేటాయిస్తే తమకేమీనష్టం వాటిల్తుందో అర్థం కావటం లేదు. ప్రజలను ఒక రకమైన ఆందోళనకు గురి చేస్తున్నారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూంలో నిర్మించి ఇంతవరకు ఇవ్వకుండా జాప్యం చేయుచున్నారు. గ్యారెంటీ వారంటీ అనుకుంటూ ఓట్లు దండుకోవటం తప్ప ప్రజలకు మేలు చేకూర్చే,బాగోగులు చూసేపథకాలను ప్రణాళిక తీసుకు వచ్చి ప్రజలకులబ్ధిదారులకు న్యాయం చేయాలి.గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలలో తీర్మానంచేసి లబ్దిదారులను ఎంపిక చేసినారు.ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఆ లబ్దిదారులను కాకుండా వేరే లబ్దిదారులను చాటు మార్గంగా ఎంపిక చేస్తు న్నారా?తమకు నచ్చిన వారినినకిలీల ఎంపిక చేసివారికి కేటా యించేవిధంగాఉందని ప్రజలుఅనుమానంతో భావిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్‌రూమ్స్ కేటాయించాలి.

- సింగు. లక్ష్మీనారాయణ, కరీంనగర్

## గ్రామాలలో జంతు బలి నిషేధించాలి?

గ్రామాలలో ఇండ్లవీధులలో జంతు బలిని నిషేధించాలి. వర్షా కాలంలో జంతువులను వధించడం వలన జంతువు కళేబ రాలు, వ్యర్థ పదార్థాలను,రక్తం,మాంసం, ఎముకలు, కసరు, వంటి పదార్థాలు మురుగు వాసనతో అంటూ రోగాలు వస్తు న్నాయి. జంతువులు బలిచేసే వారు ఆర్థికంగా లాభం పడు తున్నారు. కానీ చుట్టూ ప్రక్కల ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారు. కనుక తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య, హెల్త్ డిపార్ట్మెంట్, స్థానిక గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో జంతు బలినిషేధం చేయాలి. వారికీ నోటీసు ఇవ్వాలి. జరిమానావిధించాలి. కేసులు నమో దుచేయాలి.ఆరోగ్యమేమహాభాగ్యం కనుకశుభ్రత పాటించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## నిధులను విడుదల చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ రీయంబర్స్‌మెంట్ బకాయి నిధులను సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఫీజ్‌లు చెల్లించాలని విద్యార్థులపై వత్తిడి చెయడం వల్ల ఫీజ్‌లు చెల్లించే ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉంది. ప్రభుత్వంఫీజ్ బకాయి నిధులను విడుదల చేసి నిరుపేదలు ఉన్నత విద్యనభ్యసించేలా సహకరించాలి.

-బి. కృష్ణ యాదవ్, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# చైనా, భారత్, పాక్ వద్ద మరిన్ని అణ్వాయుధాలు

## 'సిప్రి' నివేదికలో వెల్లడి

**న్యూఢిల్లీ, జూన్ 8:** 2025లో భారత్, పాకిస్థాన్ దేశాలు కొత్త తరహా అణ్వాయుధ డెలివరీ వ్యవస్థలను అభివృద్ధి చేసినట్లు ఓ నివేదిక ద్వారా తెలిసింది. బాలిస్టిక్ క్షిపణులకు వార్‌హెడ్స్‌ను అమర్చే సామర్థ్యాన్ని కూడా ఆ దేశాలు పెంచుకున్నట్లు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఐపిఆర్ఐ) తన నివేదికలో పేర్కొన్నది. భారత్, చైనా దేశాలు తమ వద్ద ఉన్న అణ్వస్త్రాల సంఖ్యను పెంచుకున్నట్లు ఆ నివేదికలో చెప్పారు. దీంతోపాటు వార్‌హెడ్స్ ఉన్న అణ్వాయుధాలను వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. జనవరి 2026 నాటికి భారత్ వద్ద సుమారు 190 న్యూక్లియర్ వెపన్స్ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గత యేడాదితో పోలిస్తే సంఖ్య స్వల్పంగా పెరిగింది. ఇక చైనా వదనద నిల్వల్లో 620 వార్‌హెడ్స్ ఉన్నాయి. గత యేడాది ఆ దేశం వద్ద 600 మాత్రమే ఉండే అని స్టాక్‌హోమ్ రీసర్చ్ సంస్థ తెలిపింది. భారత్ తన యుద్ధ విమానాలు, నేల నుంచి ప్రయోగించే క్షిపణులు, అణ్వాయుధ సామర్థ్యం కలిగిన జలంతార్గామిలకు న్యూక్లియర్ వెపన్స్‌ను అమర్చినట్లు కూడా ఆ రిపోర్టులో పేర్కొన్నారు. ఇంకా అదనపు క్షిపణుల కోసం మరి కొన్ని వార్‌హెడ్స్‌ను కూడా తయారుచేస్తున్నట్లు సిప్రి తన నివిదేకలో చెప్పింది. ఆ వార్‌హెడ్స్ ఉన్న క్షిపణులను కంటెయినర్లకు తరలిస్తున్నట్లు కూడా రిపోర్టులో చెప్పారు. స్టాక్‌హోమ్ సంస్థ అంచనాల ప్రకారం.. 2026 జనవరి నాటికే స్వల్ప సంఖ్యలో ఉన్న వార్‌హెడ్స్‌ను ఇండియా తన జలాంతర్గాములకు తరలించినట్లు తెలుస్తోంది.




# ఇక 2 నెలలకోసారి 'ఇండియా కూటమి' భేటీ

## కూటమి నుంచి వైదొలగినట్లు ఆప్, డిఎంకె ప్రకటన

## 23 పార్టీల ప్రతినిధులు హాజరు

## తదుపరి సమావేశం హైదరాబాద్‌లో నిర్వహణ

**న్యూఢిల్లీ, జూన్ 8:** 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఇండియా కూటమి పక్షాల నేతలు సమావేశమయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి 23 పార్టీలకు సంబంధించి 27 మంది ప్రతినిధులు హాజరయ్యారు. డిఎంకె, ఆప్ పార్టీలు ఇండియా కూటమి సమావేశానికి దూరంగా ఉన్నాయి. రాజ్యసభ సభ్యుడు, మాజీ కాంగ్రెస్ పార్టీ నేత కపిల్ సిబల్ కూడా హాజరయ్యారు. శివసేన (యుబిటి) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే వర్చువల్‌గా ఇండియా కూటమి సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహించగా, ఆ పార్టీ తరఫున అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, కెసి వేణుగోపాల్ హాజరయ్యారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, టిఎంసి అధినేత్రి మమతాబెనర్జీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా, పిడిపి అధ్యక్షుడు మొహబూబా ముఫ్తి, జెఎంఎం పార్టీ తరఫున సర్ఫరాజ్ అహ్మద్, ఎన్‌సిపి (ఎస్‌పి) సుప్రియా సూలే, సిపిఎం తరఫున జాన్ బ్రిట్టాస్, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సిపిఐ ఎంఎల్ సీనియర్ నాయకుడు దీపాంకర్ భట్టాచార్య, ఆర్‌ఎస్‌పి నేత ఎన్‌కె ప్రేమచంద్రన్, ఐయుఎంఎల్ నేత సాధిఖ్ థంగల్, విసికె నేత తిరుమవలవన్, ఎండిఎంకె అధ్యక్షుడు డి.వైకో, కేరళ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.జార్జ్, కేరళ కాంగ్రెస్ (ఎం) నేత జోస్ కె మణి, ఆర్‌ఎల్‌పి హనుమాన్ బెనివాల్, లోక్ దల్ నేత సునీల్ సింగ్, ఫార్వార్డ్ బ్లాక్ కార్యదర్శి జి.దేవరాజన్, శెట్కారి కమ్‌గర్ పకాష్ నేత జయంత్ పాటిల్ ఇండియా కూటమి సమావేశానికి హాజరయ్యారు. ప్రస్తుతంలో దేశంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, ఎన్‌డియే ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించారు. ప్రధానంగా ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని ఆయా పార్టీలను నిర్వీర్యం చేసే చర్యలను ఇండియా కూటమి తీవ్రంగా ఖండించింది. అంతకుముందు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తన ప్రారంభోపన్యాసంలో, ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో అసమర్థత, లోపభూయిష్టమైన విదేశాంగ విధానం కారణంగా దేశాన్ని ప్రమాదకరమైన స్థితిలోకి నెట్టినందుకు కేంద్రంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల కోట్లాది మంది ఓటు హక్కును కోల్పోతున్నారని ఖర్గే ఆరోపించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో బలహీన వర్గాలపై అఘాయిత్యాలు అడ్డూఅదుపు లేకుండా సాగుతున్నాయని మండిపడ్డారు. అంతేకాదు రాజ్యాంగంపై నిరంతరం దాడి జరుగుతోందని ఆరోపించారు. ప్రతిపక్షాలు ఐక్యంగా ఉంటే ఎన్‌డియే ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకోవచ్చన్నారు. తాజాగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లులను ఓడించామని గుర్తు చేశారు. ఈ విషయంలో మన సంఘీభావం, ఐక్యతను ప్రదర్శించామన్నారు. ఇప్పుడు ఆ భావనను మరింత బలపరచాలన్నారు. మోడీ ప్రభుత్వం పాలన కారణంగా దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించేందుకు ఇండియా కూటమిని ముందకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తద్వారా రాజకీయ, ఆర్థిక, సమాజిక విదేశంగా విధానాలకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కోవచ్చన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో ఎదురైన భారీ పరాజయం నేపథ్యంలో జరిగిన ఈ సమావేశంలో, కూటమిని బలోపేతం చేసే మార్గాలపై కూడా చర్చించారు. ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ప్రతి రెండు నెలలకోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. తదుపరి సమావేశం ఆగస్టులో హైదరాబాద్‌లో జరగనుంది. అంతేకాకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పుడు, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో ప్రతి ఉదయం ఒక సమన్వయ సమావేశం జరుగుతుంది. అక్కడ, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై అచంచలమైన దృష్టితో, ఐక్యంగా కేంద్రాన్ని ఎదుర్కోవడంపై ఇండియా బ్లాక్ చర్చించాలని తీర్మానించింది.

తమిళనాడులో టివికె నేతృత్వంలోని జోసెఫ్ విజయ్ సంకీర్ణ ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యంగా ఉన్నప్పటికీ, ఇండియా కూటమి సమావేశానికి టివికెను ఆహ్వానించలేదు. దీంతో ఆ పార్టీ తరఫున ఇండియా కూటమి భేటీకి ఎవరూ హాజరుకాలేదు.

మరోవైపు నిన్నటి వరకు ఇండియా కూటమిలో క్రియాశీలకంగా ఉన్న డిఎంకె, ఇటీవల తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమి నుంచి డిఎంకె వైదొలగింది. ఈ మేరకు డిఎంకె ప్రకటన విడుదల చేసింది. అటు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఇండియా కూటమిలో తాము లేమని స్పష్టంగా వెల్లడించింది. దీంతో ఇండియా కూటమి సమావేశానికి డిఎంకె, ఆప్‌లు దూరంగా ఉన్నాయి.





# సిఎం విజయ్ సర్కార్‌పై డిఎంకె స్టాలిన్ ధ్వజం

**చెన్నై,జూన్ 8:** తమిళనాడులో కొత్తగా కొలువుదీరిన టీవీకే ప్రభుత్వంపై డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని ఈ ప్రభుత్వం మూడు నెలల కన్నా ఎక్కువ కాలం మనుగడ సాగించలేదని ఆయన జోస్యం చెప్పారు. రాష్ట్రంలో గత 60 ఏళ్లలో డీఎంకే, అన్నాడీఎంకేయేతర పార్టీ అధికారంలోకి రావడం ఇదే తొలిసారి. మే నెలలో విజయ్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. మాజీ వీసీకే ఎమ్మెల్యే పనైయూర్ బాబు, ఆయన మద్దతుదారులు డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం గురించి తాను ఎక్కువగా చెప్పనవసరం లేదన్నారు.



## బెంగాల్ 'పుష్ప' జహంగీర్‌ఖాన్ అరెస్టు

కోల్‌కత్తా, జూన్ 8: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ సుదీర్ఘ పాలనకు తెరపడి, కొత్త ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే ఒక సంచలన అరెస్ట్ నమోదైంది. పశ్చిమ బెంగాల్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ జరిపిన మెరుపు దాడిలో తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత, మాజీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ భారత్‌నేపాల్ సరిహద్దుల్లో అరెస్టయ్యారు. కలకత్తా హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ లేదా రక్షణ పొడిగించేందుకు నిరాకరించడంతో ఎస్టీఎఫ్ ఈ చర్య తీసుకుంది. మే 4న ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆయనపై ఐదు కొత్త పోలీస్ కేసులు నమోదయ్యాయని కోర్టు ఈ సందర్భంగా గుర్తుచేసింది. మమతా బెనర్జీ మేనల్లుడు, డైమండ్ హార్బర్ ఎంపీ అభిషేక్ బెనర్జీకి జహంగీర్ ఖాన్ అత్యంత ఆప్తుడు. డైమండ్ హార్బర్ పరిధిలోని ఫాల్తా నియోజకవర్గంలో జహంగీర్ ఖాన్ వర్గీయులు భయాందోళనలు సృష్టిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి.



# లాస్‌ఏంజిల్స్ మేయర్ రేసులో దూసుకెళ్తున్న నిత్యారామన్

**లాస్ ఏంజిల్స్, జూన్ 8:** అమెరికాలో భారతీయ సంతతి మహిళ నిత్యారామన్.. లాస్‌ఏంజిల్స్ మేయర్ ఎన్నిక రేసులో దూసుకెళ్తున్నారు. నవంబరులో జరిగే ఆ ఎన్నికల గురించి అప్పుడే యుద్ధం మొదలైంది. ఓ మీడియా సంస్థ నివేదిక ప్రకారం.. నిత్యారామన్ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. లాస్ ఏంజిల్స్ కౌంటీలో ఉన్న సుమారు 48 వేల ఓట్లలో ఆమె ఆదివారం నాటికి 40 శాతం ఓట్లను గెలుచుకున్నట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి ప్రాట్ కన్నా 10 వేల అధిక ఓట్లను ఆమె కైవసం చేసుకున్నట్లు ఓ రిపోర్టు ద్వారా తెలిసింది. కేరన్ బ్రాస్, స్పెన్సర్ ప్రాట్‌పై జూన్ 2న జరిగిన ప్రైమరీలో అత్యధిక ఓట్లను సాధించింది. దీంతో నిత్యారామన్ ఓట్ షేర్‌లో 5 పాయింట్లతో ముందున్నారు. రిపబ్లికన్ పార్టీ తరఫున ప్రాట్ పోటీ చేస్తుండగా, నిత్యారామన్ మాత్రం ప్రోగ్రెసివ్ అభ్యర్థిగా పోటీ పడుతున్నారు.

# అయోధ్యలో కరుడు గట్టిన క్రిమినల్ ఎన్‌కౌంటర్

**అయోధ్య,జూన్ 8:** ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన క్రిమినల్ హతమయ్యాడు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. అయోధ్యలో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో భాను ప్రతాప్ సింగ్ అలియాస్ బబ్లూ హతమయ్యాడు. ఉత్తర ప్రదేశ్ పోలీసులు, స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) సిబ్బంది కలిసి ఆపరేషన్ నిర్వహించారు. హతుడు భాను ప్రతాప్ సింగ్‌పై అనేక జిల్లాల్లో 40 వరకు కేసులున్నాయి. అతడిపై అనేక చోట్లా రూ2 లక్షల వరకు రివార్డ్ కూడా ఉంది. గోరక్‌పూర్ పరిదిలోని బిక్నిపూర్ గ్రామానికి చెందిన బబ్లూ అనేక నేరాలకు పాల్పడ్డాడు. అతడిపై యూపీలోని అనేక జిల్లాల్లో చాలా కేసులు నమోదయ్యాయి. కొంతకాలంగా అతడు పరారీలో ఉన్నాడు. అతడి గురించి ఇటీవల ఎస్టీఎఫ్ అధికారులకు సమాచారం అందింది.

# బలమైన గాలులకు ఎయిర్‌పోర్టులో దెబ్బతిన్న విమానాలు

**న్యూఢిల్లీ, జూన్ 8:** బలమైన గాలి వానకు ఎయిర్‌పోర్ట్‌లోని గ్రౌండ్ పరికరాలు వేగంగా కదిలాయి. పార్క్ చేసిన విమానాలను అవి ఢీ కొట్టాయి. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియాకు చెందిన మూడు విమానాలు దెబ్బ తిన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం సాయంత్రం బలమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ 2 వద్ద ఉన్న ఎయిర్ ఇండియాకు చెందిన ఇంజినీరింగ్ పరికరం, ఇండిగోకు చెందిన గ్రౌండ్ సపోర్ట్ ల్యాడర్ బలమైన గాలులకు కదిలి ముందుకు దూసుకెళ్లాయి.

## మాజీ సిఎం కుమార్తెపై ఇడి విచారణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్!

## వీణావిజయన్‌పై బిగుస్తున్న రూ.2.78 కోట్ల ఉచ్చు

**తిరువనంతపురం, జూన్ 8:** కేరళ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ వ్యవహారంలో మాజీసీఎం పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌కు గట్టి షాక్ తగిలింది. ఈ సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జరుపుతున్న మనీ లాండరింగ్ దర్యాప్తును సవాల్ చేస్తూ కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ దాఖలు చేసిన అప్పీల్‌ను కేరళ హైకోర్టు కొట్టివేసింది.

ఈడీ దర్యాప్తు యథావిధిగా కొనసాగవచ్చని స్పష్టం చేసింది. వీణా విజయన్‌కు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ అనేది స్కూల్, కాలేజీ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ తయారు చేసే ఒక చిన్న సంస్థ.

# ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం.. నలుగురు మృతి

## 200 మందికి గాయాలు, సునామీ హెచ్చరికలు జారీ



**మనీలా, జూన్ 8:** ఫిలిప్పీన్స్‌లో సోమవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. ఉదయం 7.37 గంటల సమయంలో 7.8 తీవ్రతతో దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఈ భారీ భూకంపం వచ్చింది. దీని ప్రభావంతో నలుగురు మరణించారు. 200 మందికిపైగా గాయపడ్డారు. ఫిలిప్పీన్స్ భూకంపాలు రావడం సాధారణమే. అయితే, వాటి తీవ్రత చాలా తక్కువగా ఉంటుంది. కానీ, ఈసారి భూకంపం మాత్రం ఈ యేడాదిలోనే చాలా పెద్దది. ఈ భూకంప కేంద్రం ఫిలిప్పీన్స్, నైరుతి జనరల్ శాంటోస్ నగరానికి దక్షిణాన ఉన్న మిండానో ప్రాంతంలో కేంద్రీకృతమైందని అంతర్జాతీయ మీడియా తెలిపింది. భూకంప ప్రభావంతో సునామీకి కూడా అవకాశం ఉందని అధికారులు తెలిపారు. భూకంపం తీవ్రతతో చాలా భవనాలు, రహదారులు, వంతెనలు ధ్వంసమయ్యాయి. కొన్ని స్వల్పంగా ధ్వంసమైతే, ఇంకొన్ని పూర్తిగా ధ్వంసమయ్యాయి. రవాణా, జనజీవనం స్తంభించింది. ఫిలిప్పీన్స్‌తోపాటు ఇండోనేసియా, మలేసియాకు కూడా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఆయా దేశాల్లోని తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు వెళ్లాల్సిందిగా ప్రభుత్వాలు సూచించాయి. కూలిన శిథిలాల కింద ఎంతమంది ఉన్నారనే విషయంపై ఇంకా అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత లేదు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. జనరల్ శాంటోస్ నగరంలోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేశారు. దీంతో పలు విమానాలు రద్దయ్యాయి. భూకంపం కారణంగా జనరల్ శాంటోస్ నగరంలో స్కూళ్లలోని విద్యార్థులను ఉన్నట్లుండి తరలిస్తున్న క్రమంలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. అనేక ప్రాంతాలకు సునామీ హెచ్చరికల నేపథ్యంలో అక్కడి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సుల్తాన్ కుదారత్, సారంగాణి వంటి ప్రాంతాల్లో మానిటరింగ్ సెంటర్లలో సునామీ పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# మైనర్ బాలికపై సామూహిక లైంగిక దాడి

**కోల్‌కత్తా,జూన్ 8:** నగరంలోని దుర్గాపూర్ సిటీ సెంటర్ పరిధిలో ఎనిమిదో తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలికపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనలో పోలీసులు స్పందించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన ఇద్దరు ప్రధాన నిందితులతో పాటు వారికి సహకరించిన ఒక మహిళను, నిబంధనలకు విరుద్ధంగా గదిని కేటాయించిన హోటల్ మేనేజర్‌ను కలిపి మొత్తం నలుగురిని అసంసోల్‌దుర్గాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. రెండురోజులక్రితం మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో బాధితురాలి కుటుంబానికి తెలిసిన సిమ్రాన్ తమాంగ్ అనే మహిళ బాలికను మాయమాటలతో నమ్మించి ఇంటి నుంచి బయటకు తీసుకువచ్చింది. ఆ తర్వాత నిందితులు బాలికను కారులో ఎక్కించుకుని, అందులోనే బలవంతంగా కూల్ డ్రింక్‌లో మత్తుమందు, మద్యం కలిపి తాగించారు. బాలిక స్పృహ కోల్పోగానే కవిగురు ప్రాంతంలోని ఒక హోటల్‌కు తీసుకెళ్లి రాజ్ మల్లిక్, షేక్ అజారుద్దీన్‌తోపాటు మరికొందరు ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్టు బాధిత బాలిక తండ్రి ఆరోపించారు. ఈ ఘాతుకం తర్వాత రాత్రి 10:30 గంటల సమయంలో నిందితులు బాలికను బైపాస్ రోడ్డు పక్కన పడేసి పారిపోయారు. తీవ్ర అస్వస్థతతో రోడ్డుపై పడి ఉన్న బాలికను ఒక ఈ రిక్షా డ్రైవర్ గుర్తించి, మానవత్వంతో ఆమెను సురక్షితంగా ఇంటికి చేర్చాడు.

## ఇరాన్ నుంచి వచ్చేయండి! - అక్కడి భారతీయులకు కేంద్రం సూచన

**న్యూఢిల్లీ,జూన్ 8:** పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలని, ఇప్పటికే అక్కడ ఉన్నవారు వెంటనే దేశం విడిచి వచ్చేయాలని తన పౌరులకు నేడు మరోసారి సూచించింది. ఈ మేరకు టెహరాన్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రాంతంలోని తాజా పరిణామాల దృష్ట్యా ఇరాన్‌కు ఎలాంటి ప్రయాణాలు చేయవద్దని మా పాత సలహాను పునరుద్ఘాటిస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు కూడా అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా దేశం విడిచి వెళ్లాలని సూచిస్తున్నామని ఎంబసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఇటీవల ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు పెరిగాయి.

ఇరాన్‌లోని మహ్షహర్ ప్రాంతంలో ఉన్న పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటించింది. మరోవైపు, సోమవారం ఉదయం ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులన్నింటినీ విజయవంతంగా అడ్డుకున్నామని ఐడీఎఫ్ తెలిపింది. ఈ దాడుల నేపథ్యంలోనే భారత్ ఈ ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. ఇజ్రాయెల్ గనక దక్షిణ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ఇజ్రాయెల్, దాని మద్దతుదారులపై వినాశకరమైన దాడులు తప్పవని ఇరాన్ కమాండర్ అలీ అబ్దుల్లాహీ హెచ్చరించారు.

# నార్వే చెస్ ఛాంపియన్ ప్రజ్ఞానందకు సిఎం విజయ్ ప్రోత్సాహకం

## రూ.50 లక్షల నగదు బహుమతి అందచేత



**చెన్నై,జూన్ 8:** నార్వే చెస్ టోర్నమెంట్‌లో చారిత్రక విజయం సాధించిన యువ చెస్ సంచలనం, గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందను తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు రూ. 50 లక్షల నగదు పురస్కారాన్ని అందజేశారు. ప్రజ్ఞానందతో సీఎం విజయ్ కాసేపు సరదాగా చెస్ ఆడి ఆయన్ను ఉత్సాహపరిచారు. ఈ ఆసక్తికర ఘటన అక్కడున్న వారిని ఆకట్టుకుంది. ఓస్లోలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో టైటిల్ గెలిచిన మొట్టమొదటి భారతీయుడిగా ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. టోర్నీలో భాగంగా ఆయన ప్రపంచ నంబర్ 1, సొంతగడ్డ ఆటగాడైన మాగ్నస్ కార్ల్‌సెన్‌పై క్లాసికల్ ఫార్మాట్‌లో రెండుసార్లు గెలిచి అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచ ఛాంపియన్ డి. గుకేశ్‌పై కూడా కీలక విజయం నమోదు చేసి తన సత్తా చాటాడు. అంతర్జాతీయ వేదికపై దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన ప్రజ్ఞానంద మేధస్సును, సంయమనాన్ని సీఎం విజయ్ ప్రత్యేకంగా అభినందించారు. తమిళనాడు క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ తరఫున రూ. 50 లక్షల చెక్కుతో పాటు జ్ఞాపికను సీఎం విజయ్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆధవ్ అర్జున, క్రీడాభివృద్ధి సంస్థ సభ్య కార్యదర్శి జె. మేఘనాథ రెడ్డి, ప్రజ్ఞానంద తల్లిదండ్రులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జూన్ 1న విడుదలైన ర్యాంకింగ్స్‌లో 16వ స్థానంలో ఉన్న ప్రజ్ఞానంద, నార్వే చెస్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. టోర్నీలో ఆరో రౌండ్ ముగిసేసరికి చివరి స్థానంలో నిలిచి, అనూహ్యంగా పుంజుకున్నాడు. వరుసగా నాలుగు గేమ్‌లలో గెలిచి టైటిల్ రేసులోకి దూసుకొచ్చాడు. చివరి రౌండ్‌లో విన్సెంట్ కీమర్‌పై గెలిచి మొత్తం 18 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. 2021లో కార్ల్‌సెన్ తర్వాత ఒకే ఈవెంట్‌లో వరుసగా నాలుగు గేమ్‌లు గెలవడం ఇదే తొలిసారి.

# హర్మూజ్‌ను తెరుస్తాం.. కానీ ఫీజు తప్పదు!

## నిబంధనలు యధాతథంగా అమలు చేస్తామన్న ఇరాన్

**టెహ్రాన్,జూన్ 8:** అంతర్జాతీయంగా ముడిచమురు, సహజ వాయువు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి భవిష్యత్తుపై ఇరాన్ కీలక ప్రకటన చేసింది. కొన్ని నెలలుగా కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతల కారణంగా పాక్షికంగా మూతబడిన ఈ జలసంధిని అంతర్జాతీయ నౌకల రాకపోకల కోసం తెరిచే ఉంచుతామని, అయితే కొత్త నిబంధనలు వర్తిస్తాయని ఇరాన్ స్పష్టం చేసింది. రష్యాలోని ఇరాన్ రాయబారి కాజెం జలాలీ సోమవారం రష్యా వార్తాపత్రిక ఇజ్వెస్టియాతో మాట్లాడుతూ ఇరాన్, ఒమన్ దేశాలు సంయుక్తంగా రూపొందించే సరికొత్త ఫ్రేమ్‌వర్క్ ఆధారంగానే ఈ జలసంధిలో రవాణా సాగుతుందని వెల్లడించారు. ఈ కొత్త నిబంధనలలో భాగంగా హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే వాణిజ్య నౌకలపై ట్రాన్సిట్ ఫీజు విధించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో ఐదో వంతు ఈ సముద్ర మార్గం నుంచే వెళ్తుంది. మార్చి 2026 లో ఇరాన్ ఈ జలసంధిని మూసివేయడంతో గ్లోబల్ ఎనర్జీ మార్కెట్ తీవ్రంగా దెబ్బతింది. ఇప్పుడు దీనిని పూర్తిగా పునరుద్ధరించడానికి సిద్ధమవుతున్నప్పటికీ ఇరాన్, ఒమన్ దేశాలు అక్కడ అందించే రక్షణ, నిఘా, సెర్చ్ అండ్ రెస్క్యూ (సహాయక చర్యల) సేవలకు గానూ ఈ ఫీజులను వసూలు చేయనున్నట్లు రాయబారి పేర్కొన్నారు. ఇరాన్ ప్రతిపాదిస్తున్న ఈ రవాణా రుసుములపై అంతర్జాతీయంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ సముద్ర చట్టాల ప్రకారం హర్మూజ్ జలసంధిలో ఎలాంటి ఆంక్షలు లేకుండా ఉచితంగా నౌకలు ప్రయాణించే హక్కు ఉందని అమెరికా వాదిస్తోంది. ఇరాన్‌కు ఎలాంటి ఫీజులు చెల్లించవద్దని, ఈ వసూళ్ల దందాలో భాగస్వామి కావద్దని ఒమన్‌ను కూడా అమెరికా హెచ్చరించింది. యుద్ధ భయాలు, బీమా ప్రీమియంలు పెరిగిపోవడం, ప్రయాణంలో ఆలస్యం కావడం కంటే ఇరాన్‌కు కొంత ఫీజు చెల్లించి సురక్షితంగా వెళ్లడమే మేలని కొన్ని అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు భావిస్తున్నాయి. ఈ ఫీజులు నౌక పరిమాణం, మోసుకెళ్లే సరుకును బట్టి ఒక్కో నౌకకు గరిష్టంగా 2 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 16 కోట్లు) వరకు ఉండే అవకాశం ఉంది. రష్యా వంటి మిత్రదేశాలకు మాత్రం ఇరాన్ ఇప్పటికే ఈ ఫీజుల నుంచి మినహాయింపు ఇచ్చింది. ఏప్రిల్‌లో అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత ఈ సముద్ర మార్గాన్ని శాశ్వతంగా పునరుద్ధరించేందుకు ఇరాన్‌ఒమన్ సంయుక్త కమిటీ చర్చలు జరుపుతోంది. ఈ ప్రకటన గ్లోబల్ మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చినప్పటికీ కొత్తగా విధించే ఫీజుల భారం చివరకు వినియోగదారులపైనే పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా.

# ఇక కాల్పులు ఆపండి..ఇజ్రాయెల్‌కు ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్,జూన్ 8:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్రమయిన తరుణంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో చర్చలు ముగించాలనే తన నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. ఈ శాంతి ప్రక్రియలో తనదే తుది నిర్ణయమని ట్రంప్ స్పష్టం చేశారు. ఇక్కడ అన్ని నిర్ణయాలు నేనే తీసుకుంటాను. నెతన్యాహు కాదు. భవిష్యత్తులో అమెరికాఇరాన్ మధ్య కుదిరే ఒప్పందాన్ని ఆయన అంగీకరించి తీరాల్సిందే అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ సరిహద్దులను లక్ష్యంగా చేసుకుని ఆదివారం రాత్రి ఇరాన్ భారీగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన విషయం తెలిసిందే. అంతకుముందు లెబనాన్ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ ఇజ్రాయెల్ దళాలు బీరుట్ శివార్లలో దాడులు చేశాయి. దీనికి ప్రతికారంగానే ఇరాన్ క్షిపణులతో విరుచుకు పడింది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఇజ్రాయెల్ ఆర్మీ సమర్థించుకుంది. ఇరాన్‌పై ఎదురుదాడి చేయొద్దని నెతన్యాహును ట్రంప్ కోరనున్నట్లు సమాచారం. ఇలాంటి సైనిక చర్యల వల్ల ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు దెబ్బతింటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌ను ఉద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ మీరు క్షిపణులు ప్రయోగించారు. ఇక చాలు. ఇప్పుడైనా చర్చలకు వచ్చి ఒప్పందం చేసుకోండి అని పిలుపునిచ్చారు. అలాగే బీరుట్‌పై ఇజ్రాయెల్ చేసిన ముందస్తు దాడులపై కూడా ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకవేళ దౌత్యపరమైన చర్చలు విఫలమైతేపరిణామాలుంటాయని ట్రంప్ హెచ్చరించారు. చర్చలు ఫలించకపోతే ఇరాన్‌పై కమాండో దాడులు చేసే ఆలోచన కూడా ఉందన్నారు. మేం ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నాం. ఇరాన్ వినకపోతే వారిపై బాంబులతో విరుచుకుపడతాం అని ఎన్‌బీసీ ట్రంప్ వ్యాఖ్యానించారు.

# ఆగస్టునుంచి కొత్త ప్యాసింజర్ రిజర్వేషన్ వ్యవస్థ

**న్యూఢిల్లీ,జూన్ 8:** టికెట్ బుకింగ్ విధానంలో గత కొన్ని దశాబ్దాలుగా ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టేందుకు రైల్వేశాఖ సిద్ధమైంది. ఆగస్టు నుంచి సరికొత్త ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. దాదాపు 1986 నుంచి వాడుకలో ఉన్న పాత సాంకేతిక విధానాన్ని ఈ సరికొత్త వ్యవస్థతో పూర్తిగా మార్చేయనుంది. ఈ సరికొత్త అప్‌గ్రేడ్ వల్ల ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సామర్థ్యం నిమిషాల వ్యవధిలోనే లక్షలాది టికెట్లను ఎలాంటి సర్వర్ సమస్యలు లేకుండా బుక్ చేసుకోవచ్చు. ఈ కొత్త సిస్టమ్‌కు మారే ప్రక్రియపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీలోని రైల్ భవన్‌లో ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సాంకేతిక మార్పుల సమయంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగరాదని అధికారులను ఆదేశించారు. రైల్వే శాఖ 2002 సంవత్సరంలో ఇంటర్నెట్ ఆధారిత టికెట్ బుకింగ్‌ను ప్రారంభించింది.

అప్పటి నుంచి కౌంటర్ల కంటే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేవారి సంఖ్య పెరుగుతూనే వస్తోంది. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న మొత్తం రైల్వే టికెట్లలో దాదాపు 88 శాతం బుకింగ్స్ కేవలం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే జరుగుతున్నాయి. ఈ భారీ డిమాండ్‌కు అనుగుణంగానే పాత వ్యవస్థను అధునాతన సాంకేతికతతో రైల్వే మారుస్తోంది. రైల్వే శాఖ డిజిటల్ విప్లవంలో భాగంగా గతేడాది జులైలో ప్రారంభించిన రైల్ వన్ యాప్ సరికొత్త రికార్డు సృష్టించింది. కేవలం ఏడాది లోపే ఈ యాప్ 3.5 కోట్ల డౌన్‌లోడ్లను దాటేసింది. ఈ ఒక్క యాప్ ద్వారానే టికెట్ బుకింగ్, క్యాన్సిలేషన్, రైలు లైవ్ స్టేటస్, ప్లాట్‌ఫామ్ సమాచారం, ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. ప్రస్తుతం ఈ యాప్ ద్వారా రోజూ సుమారు 9.29 లక్షల టికెట్లు బుక్ అవుతున్నాయని రైల్వే శాఖ వెల్లడించింది. కొత్త సిస్టమ్‌తో పాటు ఈ ఏడాది ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వెయిటింగ్ లిస్ట్ టూల్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతోంది. మనం బుక్ చేసుకున్న వెయిటింగ్ లిస్ట్ టికెట్ కన్ఫర్మ్ అవుతుందా లేదా అనే అవకాశాలను ఈ టూల్ ముందుగానే అంచనా వేస్తుంది. గతంలో 53 శాతంగా ఉన్న ఖచ్చితత్వం ఇప్పుడు ఏకంగా 94 శాతానికి పెరిగింది.



## స్టీరింగ్ రాడ్ విరిగి పొలాల్లోకి ఆర్టీసి బస్సు

● 15 మంది ప్రయాణికులు క్షేమం

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. అయితే బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులు ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గన్నవరం డిపోకు చెందిన 220 నంబర్ ఆర్టీసీ బస్సు తెన్నేరు నుంచి గన్నవరం వైపు వెళ్తుండగా, తెన్నేరు-మంతెన మధ్య మార్గంలో ఒక్కసారిగా స్టీరింగ్ రాడ్ విరిగి పోయింది. దీంతో బస్సు నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, తోటి ప్రయాణికులు సహాయక చర్యలు చేపట్టి బస్సులో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 15 మంది ప్రయాణికులు ఉన్నప్పటికీ ఎవరికీ గాయాలు కాకపోవడం విశేషం.

## ఎన్ఐఏ కస్టడీకి ఉగ్రవాద సానుభూతిపరులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కలకలం రేపిన ఉగ్రవాద సానుభూతిపరులను జాతీయ దర్యాప్తు సంస్థ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కస్టడీలోకి తీసుకుంది. కోర్టు అనుమతితో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి తీసుకువచ్చిన ఈ నిందితులను. ఐదు రోజుల పాటు జాంపేట మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎన్ఐఏ అధికారులు విచారించనున్నారు. గత మార్చిలో విజయవాడలో ముగ్గురు పట్టుబడగా, వారిచ్చిన సమాచారంతో దేశవ్యాప్తంగా ఏపీ, తెలంగాణ సహా 8రాష్ట్రాల్లో మొత్తం 13మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరంతా ఐసిస్, అల్‌ఖైదా వంటి ఉగ్రవాద సంస్థల భావజాలానికి ఆకర్షితులైనట్లు అధికారులు గుర్తించారు. దేశంలో ఏమైనా పేలుళ్లకు వీరు కుట్ర పన్నారా? అన్న కోణంలో నిందితుల కాల్ డేటా, సోషల్ మీడియా ఖాతాల ఆధారంగా ప్రత్యేక ప్రశ్నావళి ద్వారా ఎన్ఐఏ అధికారులు ప్రస్తుతం ఆరా తీస్తున్నారు. ఈ విచారణ సందర్భంగా జాంపేటలో అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# తోతాపురికి మద్దతు ధర కల్పించాలి

● కేజీకి రూ.15 చెల్లించాలని మామిడి రైతులు డిమాండ్ ● కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా



తోతాపురి మామిడి కేజీకి రూ.15 చెల్లించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న మామిడి రైతు సంఘాల నాయకులు

**చిత్తూరు, జూన్ 8 ప్రభాతవార్త:** ఈ మామిడి సీజన్‌లో తోతాపురి మామిడికి కేజీకి రూ.15 చెల్లించాలని మామిడి రైతులు డిమాండ్ చేశారు. మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట పలు రైతు సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి మామిడి రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ తోతాపురి మామిడి ధరలు గత వారం రోజులుగా భారీగా పతనం అయ్యాయని, ధరలు పతనం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి సీజన్ ప్రారంభం అయినప్పటికీ జిల్లాలోని పలు గుజ్జు పరిశ్రమలు రైతుల నుండి మామిడిని సేకరించడం లేదని, జిల్లాలో ప్రస్తుతం 2 గుజ్జు పరిశ్రమలు మాత్రమే రైతుల నుండి మామిడిని తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నాయన్నారు. జిల్లాని అన్ని గుజ్జు పరిశ్రమలు రైతుల నుండి మామిడి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పల్ప్ ఫ్యాక్టరీ ప్రస్తుతం తోతాపురి మామిడి కేజీని రూ.4 నుండి రూ.5కు మాత్రమే కొనుగోలు చేస్తున్నాయని, ఈ మామిడిని ఫ్యాక్టరీలకు విక్రయించడానికి రైతులు రోజుల తరబడి ఫ్యాక్టరీల ఎదుట పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొందని ధ్వజమెత్తారు. 2026 సంవత్సరం మామిడి సీజన్ ప్రారంభం అయినప్పటికీ మామిడి రైతు సంఘాల ప్రతినిధులు, మామిడి రైతులతో చర్చలు నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. జిల్లాలోని మామిడి రైతులు, సంఘాల ప్రతినిధులతో చర్యలు ఎనిర్వహించి పెట్టుబడి ఖర్చులను నిర్ణయించి ప్రతి ఏడాది వరుస నష్టాలతో కుదేలవుతున్న మామిడి రైతులకు ఈ ఏడాది అయినా తోతాపురి మామిడి పెట్టుబడి ఖర్చు కేజీ రూ.18గా నిర్ణయించి ఈ మేరకు రైతులకు ధర చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని గుజ్జు పరిశ్రమలను ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది తోతాపురి మామిడి కేజీకి ప్రభుత్వం పెట్టుబడి ఖర్చు రూ.7 నిర్ణయించిందని, గత ఏడాది తోతాపురి మామిడి కేజీకి ఈ ప్రభుత్వమే రూ.12 నిర్ణయించి చెల్లించేలా చర్యలు తీసుకుందన్నారు.

ఈ ఏడాది తోతాపురి మామిడికి ప్రభుత్వం నిర్ణయించిన కేజీ రూ.7ను సైతం ఎక్కడా చెల్లిచడం లేదని రైతు నాయకులు ఆరోపించారు. ప్రతి గుజ్జు ఫ్యాక్టరీ వద్ద మామిడి ధరల బోర్డును ఏర్పాటు చేయాలని, జిల్లా స్థాయి అధికారులతో పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే పలుమార్లు డిమాండ్ చేసినా ఫలితం లేదని సత్వరం ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

జిల్లాలో జూన్ నెల ప్రారంభమైన కొన్ని గుజ్జు పరిశ్రమలు ఇప్పటికీ రైతుల నుండి మామిడి కొనుగోలు చేయడం లేదని కలెక్టర్ సత్వరం అలాంటి ఫ్యాక్టరీలతో చర్చించి మామిడి కొనుగోలుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే జిల్లాలో ఉపాధి హామీ పథకంను మామిడి పంటకు అనుసంధానం చేస్తే రైతుకు కొంత మేరకు న్యాయం జరుగుతుందని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మామిడి పంటను సైతం బీమా పథకంలో చేర్చించి బీమా వర్తింపుకు చర్యలు తీసుకోవాలని, రైతులకు డిజిటల్ మార్కెట్లు ఏర్పాటు చేయాలని, మామిడి రైతుకు 50 శాతం సబ్సిడీతో ఎరువులు, పురుగుల మందులు, పనిముట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో మామిడి సంఘాల నాయకులు మునీశ్వర్‌రెడ్డి, ఉమాపతి, హేమలత, సంజీవరెడ్డి, బెల్లంకొండ శ్రీనివాసులు, ఉమాపతి నాయుడు, చెంగ్రాయరెడ్డి, త్యాగరాజులురెడ్డి, మోహన్ రెడ్డి, జయదేవయ్య, పెద్ద సంఖ్యలో మామిడి రైతులు పాల్గొన్నారు.

ధర్నా అనంతరం మామిడి సంఘాల నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి తోతాపురి మామిడికి గిట్టుబాటు ధర చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని, ఇతర సమస్యను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మామిడి రైతుల సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని నాయకులకు హామీ ఇచ్చారు.

# కలెక్టరేట్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

● తన భూమిని ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేసినా రెవెన్యూ నిర్లక్ష్యం

**చిత్తూరు, జూన్ 8 ప్రభాతవార్త:** తన భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారని, తనకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా తనను అధికారులు నిర్లక్ష్యంగా చూస్తున్నారని క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులతో తనకు న్యాయం జరుగకపోవడం తో మీరే న్యాయం చేయాలని కోరుతూ ఓ రైతు సోమవారం కలెక్టరేట్ ఎదుట శరీరంపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. వి.కోట మండలంకు చెందిన రాఘవేంద్ర అనే రైతు తన భూమిని తన సోదరులు ఆక్రమించు కున్నారని, ఈ విషయంపై విచారించి తనకు న్యాయం చేయాలని పలుమార్లు రెవెన్యూ అధికారులను కలసి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో క్షేత్రస్థాయి అధికారులతో తనకు న్యాయం జరుగని భావించిన రాఘవేంద్ర సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఈ విషయంగా ఫిర్యాదు చేయడానికి వచ్చారు. రైతు రాఘవేంద్ర తనతో పాటు కిరోసిన్ తీసుకుని కలెక్టరేట్ ఎదుట శరీరంపై తెచ్చుకున్న కిరోసిన్‌ను పోసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడటంతో అక్కడే విధుల్లో వున్న పోలీసులు సత్వరం స్పందించి రాఘవేంద్ర ఆత్మహత్యాయత్నంను అడ్డుకున్నారు. ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన రాఘవేంద్రను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కలెక్టరేట్ ఎదుట రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ రైతు ఆత్మహత్యాయత్నంకు పాల్పడటం కలకలం రేపింది.

# విద్యుత్ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ సంస్థ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 60 వినతులు అందాయి. ఈ కార్యక్రమం ద్వారా పలువురు వినియోగదారులు విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912, 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఎస్‌పిడిసిఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్‌డి) కె.గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్‌ఏసి) కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, జె.రమణాదేవి, ఆర్.పద్మ, ఎం.మురళికుమార్, ఎన్.శోభా వాలెంటీనా, ఎం. ఉమాపతి, సిహెచ్ రామచంద్రరావు, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు సురేంద్రరావు, చక్రపాణి, జగదీష్, లత, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలు భ్రష్టు పట్టిపోయాయి

కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్



**శ్రీకాకుళం, జూన్ 8 ప్రభాతవార్త:** దేశ రాజకీయాలు, రాష్ట్ర రాజకీయాలు భ్రష్టు పట్టిపోయాయని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, బిజెపి పాలనలో రూపాయి విలువ క్షీణించింది. ఆక్వాతో సహా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు ఆగిపోయింది. మోడీ, బిజెపి పాలనలో గొప్ప ఆర్థిక సంక్షోభం దేశంలో నెలకొంది. పివి నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు, బంగారం ఎగుమతులు చేసి, విదేశీ మారకద్రవ్యం తెచ్చాము. ప్రతి ఇంట్లో ఆర్థిక సంక్షోభం మొదలైంది. గ్రామాల్లో ప్రతి ఇంట్లో రూ.200లకు మించి డబ్బు లేదు. ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం ఉన్నది. మోడీ, చంద్రబాబు, జగన్ ముగ్గురు ఫెయిల్ అయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేసే నర్సులకు మూడు నెలలుగా జీతాలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదు. ఆరు లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. 8 సంవత్సరాలుగా పీఆర్సీ ప్రకటించలేదు. నాలుగు డిఎలు పెండింగ్‌లో వుంది. ప్రభుత్వ ఉద్యోగులు అప్పుల్లో ఉన్నారు. ఇంటి అద్దెలు కట్టుకోలేకపోతున్నారు. పిల్లలను చదివించలేకపోతున్నారు. మూడు రూపాయల వడ్డీలకు తెచ్చి, కష్టాలు పడుతున్నారు. వారం లోపు పిఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తిరుపతి విమానాశ్రయాన్ని అద్వానీకి అమ్మాలని అనుకుంటున్నారు. తిరుపతి విమానాశ్రయం వైబులిటీ తగ్గించేదానికి, చిన్న విమానాలు ఇస్తున్నారు. ఢిల్లీ, ముంబై వంటి నగరాల నుంచి విమానాలు తిరుపతికి రావడం లేదు. ఒక్క అంతర్జాతీయ విమాన సర్వీస్ కూడా నడపడం లేదు. తిరుపతి విమానాశ్రయం ప్రైవేటీకరణ చేస్తే, చంద్రబాబు, రామ్మోహన్ నాయుడు ఇరువురూ నష్టపోతారని చింతామోహన్ హెచ్చరించారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. వ్యతిరేకిస్తున్నాం అని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి నరసింహమూర్తి, షణ్ముఖరావు, మామిడి సత్యనారాయణ పాల్గొన్నారు.



# అమరావతిలో రూ.200 కోట్లతో ఆప్కాబ్ ఐకానిక్ భవనం

**విజయవాడ జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో రూ.200 కోట్లతో ఆప్కాబ్ ఐకానిక్ భవనం రూపుదిద్దుకుంటోంది. ఇందులో భవన నిర్మాణానికి రూ.87 కోట్లు, ఇంటీరియర్ ఇతర సౌకర్యాలకు రూ.113 కోట్లను వెచ్చించనున్నారు. భవన నిర్మాణం ఇప్పటికే మొదలైంది. ఆప్కాబ్ భవన నిర్మాణానికి లింగాయపాలెంలో 0.495 ఎకరాల స్థలాన్ని సీఆర్‌డీఏ కేటాయించింది. జీ+17 అంతస్తులతో దీన్ని నిర్మిస్తున్నారు. చివరి అంతస్తులో హెలిప్యాడ్ ఉంటుంది. ఆప్కాబ్ పాలనా కార్యాలయం, ఐటీ విభాగాలు, ఛైర్మన్, ఎండీ ఛాంబర్ సహా వివిధ విభాగాలు ఉంటాయి. మొత్తం 2.09 లక్షల చదరపు అడుగుల్లో భవనం నిర్మిస్తారు. ఆప్కాబ్ అనే అక్షరాలు ప్రతిబింబించేలా ప్లాన్ డిజైన్ చేశారు. నిర్మాణ బాధ్యతల్ని ఏపీఐఐసీకి అప్పగించారు. ఐఐటీ హైదరాబాద్‌తో పాటు విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నుంచి సాంకేతిక సహకారం తీసుకుంటున్నారు.

# పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు బెదిరింపులు

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కుటుంబానికి బెదిరింపులు వస్తున్నాయి. ఈ మేరకు పెనమలూరు పోలీసు స్టేషన్‌లో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఫిర్యాదు చేశారు. తన కుటుంబాన్ని చంపేస్తానని మాలంపాటి భాస్కర్‌రెడ్డి బెదిరించాడని ఎమ్మెల్యే ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ఫిర్యాదుతో మాలంపాటి భాస్కర్‌రెడ్డిపై కేసు పోలీసులు నమోదు చేశారు. సామాజిక మాధ్యమాల్లో సిఎం చంద్రబాబు, లోకేశ్‌పై దుష్ప్రచారం చేశారని గతంలోనే భాస్కర్‌రెడ్డిపై కేసు నమోదు చేసారు. ఈ క్రమంలో మాలంపాటి వివిధ రీతుల్లో బోడే ప్రసాద్‌ను ఆయన కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నది అభియోగం. ఈ అంశంపై కేసును నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ప్రస్తుతం మాలంపాటి భాస్కర్‌రెడ్డి యుకెలో ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాల ద్వారా పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

### ఆర్టీసీ బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్న

# ముగ్గురు మహిళా నిందితుల అరెస్టు

● 32 గ్రాముల డైమండ్ గోల్డ్ నెక్లెస్ స్వాధీనం




**పాకాల, జూన్ 8 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా పాకాల మండల పరిధిలో ఇటీవల కాలంలో ఆర్టీసీ బస్సులలో ప్రయాణికుల బ్యాగులు, హ్యాండ్ బ్యాగుల నుండి బంగారు ఆభరణాలు అపహరిస్తున్న ముఠాలపై జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పాకాల పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తును పాకాల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి. చిన్న గోవిందు పర్యవేక్షణలో ఎస్ఐ తరుణ్, డబ్ల్యూఎస్ఐ నాగ మంజుల ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం చేపట్టింది. దర్యాప్తులో భాగంగా నిందితుల కదలికలను గుర్తించిన ప్రత్యేక బృందం ఈ నెల 7వ తేదీన సాయంత్రం శంఖంపల్లి ఫ్లైఓవర్ క్రింద ముగ్గురు మహిళా నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసింది. అరెస్టు చేయబడిన నిందితులు జి. దివ్య (31), బి. రాధిక (38), బి. మేరీ (33)గా గుర్తించబడ్డారు. వీరంతా చిత్తూరు జిల్లా పరిధికి చెందినవారని పోలీసులు తెలిపారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించడంతో, వారి వద్ద నుండి కేసుకు సంబంధించిన సుమారు 32 గ్రాముల బరువున్న డైమండ్ గోల్డ్ నెక్లెస్ చైన్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆభరణం విలువ సుమారు రూ.3.5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అనంతరం నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు. మహిళా ప్రయాణికులే లక్ష్యం ప్రాథమిక విచారణలో నిందితులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలను లక్ష్యంగా చేసుకొని, రద్దీని ఆసరాగా తీసుకుని వారి బ్యాగుల్లోని విలువైన బంగారు ఆభరణాలను అపహరిస్తూ వచ్చినట్లు వెల్లడైంది. కేసును అత్యంత త్వరితగతిన ఛేదించి, నిందితులను అరెస్టు చేయడంతో పాటు దొంగిలించిన ఆభరణాన్ని రికవరీ చేసిన ఎస్ఐ తరుణ్, డబ్ల్యూఎస్ఐ నాగ మంజుల, ప్రత్యేక పోలీసు బృందాన్ని తిరుపతి జిల్లా ఎస్పీ అభినందించారు.

# తల్లి ఆశలన్నీ ఆవిరి

● విద్యుత్ తీగ తొక్కిబాలుడు మృతి, వింజమూరులో విషాదం

**వింజమూరు (నెల్లూరు), జూన్ 8 ప్రభాతవార్త:** కన్న కొడుకు ఎదిగొచ్చి ఆసరాగా నిలుస్తాడనుకున్న తల్లి ఆశలు క్షణాల్లో ఆవిరయ్యాయి. వింజమూరు పట్టణంలోని చల్లా వారి వీధిలో సోమవారం చోటుచేసుకున్న విద్యుదాఘాత ఘటన అందరి హృదయాలను ద్రవింపజేసింది. చల్లా వారి వీధిలో నివాసం ఉంటున్న పేర్నేటి రాజా మమత దంపతుల కుమారుడు మహిదర్‌రెడ్డి (13), 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం వారి ఇంటి పక్కనే పాత బిల్డింగును కూల్చివేస్తుండగా కుతూహలంతో హేమంత్ అక్కడికి వెళ్లి చూస్తున్నాడు. ఆ సమయంలో డ్రిల్లింగ్ మిషన్‌కు సరఫరా అవుతున్న కరెంటు తీగ నేలపై ఉంది. చెప్పులు లేకుండా వెళ్లిన హేమంత్ పొరపాటున ఆ తీగను తొక్కడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అమ్మా అంటూ కింద పడిపోయాడు. అక్కడ పనిచేస్తున్న కూలీలు వెంటనే మహిధర్ రెడ్డిని వింజమూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే బాలుడు ప్రాణాలు విడిచినట్లు వైద్యులు నిర్ధారించారు. కొడుకు మృతదేహాన్ని చూసి తల్లి మమత గుండెలవిసేలా రోధించింది.

మహిధర్‌రెడ్డి తండ్రి కొన్నేళ్ల క్రితమే ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తల్లి మమత కూలి పనులు చేస్తూ ఇద్దరు బిడ్డలను సాకుతోంది. రెక్కలు ముక్కలు చేసుకుని ఇద్దరినీ చదివిస్తున్నా, పెద్దవాడే నా ఆసరా అనుకున్నా, ఇప్పుడు వాడూ లేకుండా పోయాడు అంటూ ఆ తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే చూపరుల హృదయాలు బరువెక్కాయి. మహిధర్ మృతితో చల్లా వారి వీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఉమా మహేశ్వర తెలిపారు.

## బాలల కథల పోటీలకు ఆహ్వానం

ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఒంగోలు నగరంలోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో 2026 డిసెంబర్ 5, 6 తేదీలలో జరగనున్న నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు బాలలు సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో బాలబాలికల కోసం తెలుగు కథల రచనా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ ప్రకటించారు.తెలుగు భాషా సాహిత్యాల పట్ల చిన్నారుల్లో ఆసక్తి పెంపొందించడం, సృజనాత్మక రచనా నైపుణ్యాలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలు రెండు విభాగాలలో నిర్వహించబడతాయి. మొదటి విభాగం 6 నుండి 10 సంవత్సరాల లోపు పిల్లలకు, రెండవ విభాగం 11 నుండి 16 సంవత్సరాల లోపు పిల్లలకు ఉద్దేశించారు. కథలు పంపడానికి 31 జూలై చివరి తేదీగా ఉంది. 10 ఆగస్టు 2026. ఫలితాలు విడుదల చేస్తారు. ప్రథమ బహుమతిగా రూ.3,116/ ద్వితీయ బహుమతిగా రూ.2,116/ తృతీయ బహుమతి 1,116/ మూడు ప్రోత్సాహక బహుమతులు - రూ.516/ చొప్పున ఇస్తారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రం, పతకం ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై అందజేయబడతాయి. సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 99497 35253 తెలుగు భాషను ప్రేమించే చిన్నారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా బాలల ప్రపంచ తెలుగు మహా సభల కార్యక్రమాల అంతర్జాతీయ, జాతీయ సమన్వయకర్తలు రాధికా మంగిపూడి, కొల్లి రమావతి కోరారు.

### విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో మృతులకు

## కోటి పరిహారం చెల్లించాలి

● సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ స్టీల్‌ప్లాంట్ ఘోర ప్రమాదంలో మరణించిన 9 మంది కార్మికులకు సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. ఊహించని ఈ ప్రమాదంలో 9 మంది మరణించారు. అనేకమంది తీవ్రంగా గాయపడటం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మరణించిన మృతుల కుటుంబాలకు ప్రగాడ సానుభూతిని ప్రకటించింది. మరణించిన వారి కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసింది. గాయపడిన ప్రతి ఒక్కరికి రూ.50 లక్షలు ప్రకటించాలని, తక్షణం మెరుగైన వైద్య సహాయం అందించాలని కోరింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని ప్రయివేటీకరిచేందుకు ఉద్దేశపూర్వకంగానే నిరక్ష్యం వహించడం వల్లనే ఈ ప్లాంటు పూర్తిగా దెబ్బతింటున్నదని పేర్కొంది. అందువల్ల ఈ మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపింది. కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి దీనిపై ప్రజలకు పూర్తి వివరణ ఇవ్వాలని కోరింది. తక్షణమే ఈ ప్రమాద కారణాలపై విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ ప్యాకేజీ ప్రకటిస్తున్నామని, ఆధునికరిస్తున్నామని చేసిన ప్రకటనలు ఆర్భాటానికేనని తెలిపోయిందని పేర్కొంది.

# మల్లవరపు ప్రకాష్ మృతికి సిఎం చంద్రబాబు సంతాపం

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖకు చెందిన క్రైస్తవ మత బోధకులు, విశ్రాంత ఆర్చ్ బిషప్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్ మృతి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. డాక్టర్ మల్లవరపు ప్రకాష్ సమాజానికి చేసిన సేవలు ఎనలేనివని సిఎం వ్యాఖ్యానించారు. కడప, విజయవాడ, విశాఖపట్నంలో బిషప్‌గా సుదీర్ఘకాలం పాటు ఆయన అందించిన సేవలు ఎనలేనివని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని సిఎం పేర్కొన్నారు. ప్రకాష్ కుటుంబ సభ్యులకు, క్రైస్తవ మత పెద్దలకు వారి అనుచరులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**మంత్రి నారా లోకేష్ తీవ్ర సంతాపం:** విశాఖపట్నం విశ్రాంత ఆర్చ్ బిషప్, మోస్ట్ రెవ. డాక్టర్ ప్రకాష్ మల్లవరపు మృతికి ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ తీవ్ర సంతాపం ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో తెలిపారు. పరలోకపు తండ్రి పిలుపు పొంది ఉన్నారు. వారు భౌతికంగా మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. విద్యాధికులైన విశ్రాంత ఆర్చ్ బిషప్ ఆధ్యాత్మిక సేవకు తన జీవితాన్ని అంకితం చేశారు. విజయవాడ బిషప్‌గా, కడప బిషప్‌గా, ఏలూరు డయాసిస్ అపోస్టోలిక్ అడ్మినిస్ట్రేటర్‌గా, విశాఖపట్నం మెట్రోపాలిటన్ ఆర్చ్ బిషప్‌గా, శ్రీకాకుళం అపోస్టోలిక్ అడ్మినిస్ట్రేటర్‌గా ఎనలేని సేవలు అందించారు. ఆదర్శవంతమైన జీవనశైలి, వినయం, ప్రేమతో పేదల సేవలో తరించిన విశ్రాంత ఆర్చ్ బిషప్ ప్రకాష్ మల్లవరపు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, నివాళి అర్పిస్తున్నానని మంత్రి పేర్కొన్నారు.

### పద్మావతి వర్సిటీ అధ్యాపక నియామకాల

# దరఖాస్తుల గడువు పొడిగింపు

**తిరుపతి, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళ విశ్వవిద్యాలయం తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో అధ్యాపక నియామకాలకు సంబంధించి దర ఖాస్తు ప్రక్రియకు మరో వారంరోజులు గడువు పొడిగించారు. దరఖాస్తులను పూర్తి చేయడానికి మరింత సమయం కల్పించాలని అభ్యర్థుల నుండి వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకొని, కొనసాగు తున్న ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్ -2026 ప్రక్రియకు సంబంధించిన గడువులను మరో వారం రోజుల పాటు పొడిగించాలని నిర్ణయిం చారు. దీననుసరించి, ఎపి కామన్ రిక్రూట్ మెంట్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు సమ ర్పణ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపుకు తుది గడువు ను ఈనెల 15వ తేదీ వరకు పొడిగించారు. దరఖాస్తు హార్డ్ కాపీతో పాటు అవసరమైన అన్ని పత్రాలను రిజిస్టర్డ్ పోస్టు / స్పీడ్ పోస్టు / కొరియర్ ద్వారా పంపించడానికి ఉన్న చివరి తేదీ జూన్ 22 వరకు పొడిగించారు. ప్రాథమిక పరిశీలన అనంతరం అర్హులు అనర్హుల జాబితాను ఈనెల 29 వరకు సవరించారు. అలాగే ప్రాథమిక అర్హతలపై అభ్యంతరాలను స్వీకరించడానికి జులై 6వరకు గడువిచ్చారు. తుది అర్హుల జాబితాను జులై 7న ప్రకటిస్తారు. ఇప్పటివరకు కామన్ రిక్రూట్‌మెంట్ పోర్టల్ ద్వారా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయని అభ్యర్థులు ఈనెల 15వతేదీ లోపు తప్పనిసరిగా పూర్తి చేయవలెనని విశ్వవిద్యాలయం కోరింది. దరఖాస్తు హార్డ్ కాపీతో పాటు అవసరమైన అన్ని ధ్రువపత్రాలు అనుబంధ పత్రాలు జూన్ 22వ తేదీ లోపు రిజిస్ట్రార్, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతికి రిజిస్టర్డ్ పోస్టు/ స్పీడ్ పోస్టు / కొరియర్ ద్వారా చేరాలి. ప్రస్తుత నియామక ప్రక్రియకు సంబంధించిన తదుపరి సమాచారం, మార్గదర్శకాలు నవీకరణల కోసం అభ్యర్థులు ఎపి కామన్ రిక్రూట్‌మెంట్ పోర్టల్‌ను క్రమం తప్పకుండా పరిశీలించవలసిందిగా సూచించారు.

# పాత సింగరాయకొండ బావిలో లభ్యమైన మృతదేహం

## హైదరాబాద్ బిటెక్ విద్యార్థి రాహుల్‌గా గుర్తింపు

## ర్యాగింగ్ అనుమానాలు.. రాహుల్ మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు



మృతుడి స్నేహితులను ప్రశ్నిస్తున్న పోలీస్ అధికారి

**సింగరాయకొండ,జూన్ 8, ప్రభాతవార్త** మండలంలోని పాత సింగరాయకొండ గ్రామంలో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి చెందిన పూలతోటలోని వాడుకలో లేని బావిలో ఇటీవల లభ్యమైన గుర్తుతెలియని యువకుడి మృతదేహం కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో అదృశ్యమైన బీటెక్ విద్యార్థి రాహుల్‌గా మృతుడిని కుటుంబ సభ్యులు గుర్తించినప్పటికీ, డీఎన్ఏ పరీక్షల అనంతరమే పూర్తి నిర్ధారణకు వచ్చే అవకాశముందని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన రాహుల్ హైదరాబాద్‌లోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మే 27న ఇంటికి వెళ్తున్ననని చెప్పి స్నేహితుడు బైక్ మీద కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు నాలుగు రోజులైన ఇంటికి రాకపోతే అంత గాలించి ఎక్కడ ఆచూకీ కనపడక పోవడంతో మే 31 కాచిగూడ పోలీస్ స్టేషన్ లో తండ్రి రాజేష్ పిర్యాదు చేయడం తో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దీనితో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రైల్వే స్టేషన్ లో శబరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించినట్లు సీసీటీవీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. ఇదిలా ఉండగా, మే 30న సింగరాయకొండలోని స్వామివారి తోట బావిలో అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతదేహం లభించింది. మృతుడి వద్ద ఉన్న ఎర్రటి టీషర్ట్, మెడలోని ఆంజనేయస్వామి లాకెట్ తదితర ఆధారాలను పోలీసులు సోషల్ మీడియా, పత్రికల ద్వారా ప్రచారం చేశారు. ఈ సమాచారం రాహుల్ కుటుంబ సభ్యులకు చేరడంతో వారు సింగరాయకొండకు వచ్చి ఆధారాలను పరిశీలించి మృతుడిని తమ కుమారుడిగా గుర్తించారు. సోమవారం తెలంగాణ, సింగరాయకొండ పోలీసులు కుటుంబ సభ్యులతో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహం లభ్యమైన బావితో పాటు ఖననం చేసిన ప్రదేశాన్ని కూడా వారికి చూపించారు. రాహుల్ తండ్రి అంకం రాజేష్ మాట్లాడుతూ, తన కుమారుడు హాస్టల్ నుంచి అదృశ్యమైన తర్వాత మిస్సింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు. వందల కిలోమీటర్ల దూరంలోని సింగరాయకొండకు రాహుల్ ఎలా చేరుకున్నాడనే విషయంపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. ఇది ఆత్మహత్యా, హత్యా అన్నది తేల్చాలని, కాలేజీలో ర్యాగింగ్‌కు సంబంధించిన అంశాలపై కూడా సమగ్ర విచారణ జరపాలని పోలీసులను కోరారు. సీఐ శ్రీహరి మాట్లాడుతూ, మే 30న బావిలో గుర్తించిన మృతదేహాన్ని యువనేస్తం ఫౌండేషన్ సభ్యుల సహకారంతో బయటకు తీసి పోస్టుమార్టం, ఫోరెన్సిక్ అనంతరం ఖననం చేసినట్లు తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల ఆధారంగా ప్రచారం చేయడంతో కుటుంబ సభ్యులు స్పందించారని చెప్పారు. మృతదేహం వద్ద లభించిన టీషర్ట్, లాకెట్ తదితర వస్తువులను కుటుంబ సభ్యులకు చూపించగా, వారు రాహుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. అయితే పూర్తి నిర్ధారణ కోసం కుటుంబ సభ్యుల డీఎన్ఏ నమూనాలను సేకరించి పరీక్షలు



ఎంపి సానా సతీష్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్నఆలయ సిబ్బంది

# ఇంద్రకీలాద్రిపై వైభవంగా యోగాంధ్ర

**ఇంద్రకీలాద్రి, జూన్ 8, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రం లోని ముఖ్య దేవాలయాల్లో ఖాళీగా ఉన్న వేదపారాయణదారులు, అర్చకులు, పరిచారకులు, భజంత్రీలు, వంట స్వాములు తదితర ధార్మిక పోస్టుల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి, అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి, పరిశీలన అనంతరం హాల్ టిక్కెట్లు జారీ చేసి మొదటగా వేదపారాయణదారులుకు పరీక్ష నిర్వహిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ అన్నారు. వేదపారాయణదారుల పోస్ట్ లకు సంబందించిన మౌఖిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మాడపాటి అతిధి గృహంలో దేవదాయ కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి రాష్ట్రంలో అన్ని ఆలయాలలో ఖాళీగా ఉన్న వైదిక సిబ్బంది పోస్టులు అన్నీ భర్తీ చేయాలని ఆదేశించిన మేరకు వైదిక సిబ్బంది ఖాళీల వివరాలన్ని సేకరించి, భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించగా, ప్రభుత్వం సెంట్రలైజెడ్ పరీక్షలు నిర్వహించి, పూర్తి పారదర్శకత్వంతో ప్రతిభకే పట్టం కట్టే విధంగా నియామకాలు జరుపాలని ఆదేశించిందని రామచంద్ర మోహన్ పేర్కొన్నారు. 342 ధార్మిక పోస్టులకు గానూ రాష్ట్రవ్యాప్తంగా 5వేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, శ్రీకాకుళం నుండి కృష్ణా జిల్లా గల మల్టీజోన్1 వేదపారాయణదారుల అభ్యర్థులకు విజయవాడ మాడపాటి అతిధి గృహంలో వేరే జోన్ కు చెందిన పండితులు అర్హత పరీక్ష జరుపుతుండగా, వేరే జోన్ కు చెందిన ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షణ చేస్తున్నారని, గుంటూరు నుండి రాయలసీమ వరకు గల మల్టీ జోన్ 2 అభ్యర్థులకు ఇదే విధంగా సీతానగరంలో పూర్తి పారదర్శకంగా ఈనెల 16 వరకు మౌఖిక పరీక్షలు జరుగుతాయని రామచంద్ర మోహన్ వివరించారు. ఈ మౌఖిక పరీక్షల్లో పారదర్శకత వహించి, ప్రతిభావంతులకే పట్టం కట్టెందుకు పరీక్షల నిర్వహణ అంతా వీడియో లైవ్ రికార్డింగ్ చేస్తున్నామని, వేదపారాయణదారు పోస్టుల భర్తీలో విద్యార్హతలు, వేదార్హతలు, అనుభవం, మౌఖిక పరీక్షలలో ప్రదర్శించిన ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయించి, మెరిట్ జాబితా రూపకల్పన జరుగుతుందని, మూడు ఇంటర్వ్యూ బోర్డులు ఏర్పాటు చేసామని, ఏ అభ్యర్థి ఏ ఇంటర్వ్యూ బోర్డుకు వెళ్తారో ఆఖరు నిమిషం వరకు అభ్యర్థికి తెలియదని కమిషనర్ వెల్లడించారు. వేదపారాయణదారు పోస్టుల ఎంపిక ప్రక్రియ పూర్తయిన అనంతరం అర్చకులు, పరిచారకులు, భజంత్రీలు తదితర పోస్టుల భర్తీని దశలవారీగా పూర్తి చేస్తామని రామచంద్ర మోహన్ పేర్కొన్నారు.

- దుర్గమ్మవారి సేవలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి :

రాజ్యసభ సభ్యులు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ గారు

రెండోసారి రాజ్యసభకు ఎంపికైన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ సోమవారం దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆయనకు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు మరియు చిత్రపటాన్ని ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్ బహుకరించారు.

- నిత్యాన్నదాన పథకానికి విరాళాలు:

దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి తాడేపల్లికి చెందిన ఐ అండ్ పి ఆర్ ఉద్యోగి వేమూరి ప్రసాద్, వెంకటలక్ష్మి దంపతులు వారి పదవీ విరమణ సందర్భంగా పార్టీ అల్లుడు కృష్ణ కుమార్తె సాయి సింధూర పేర్ల మీద నిత్య అన్నదాన పథకమునకు రూ.1.01,116లు మరియు ఎండాడ, విశాఖపట్నం వాస్తవ్యులు కె త్రినాధ రెడ్డి ఝాన్సీ రాణి దంపతులు రూ.1,01,116లు మరియు భీమునిపట్నం విశాఖపట్నం వాస్తవ్యులు ఎం మాల్యాద్రి వెంగమ్మ దంపతులు రూ.1,01,116లువిరాళమును అందించారు. దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

- ఉత్సాహంగా యోగాంధ్ర :

ఇంద్రకీలాద్రిపై ఉత్సాహంగా యోగాంధ్ర కార్యక్రమం రెండవ రోజు సోమవారం కొనసాగింది. గర్రె రాజేష్ రెండవ రోజు శిక్షణలో భాగంగా మానసిక ఒత్తిడిని తగ్గించే ప్రత్యేక ఆసనాలు మరియు శ్వాస ప్రక్రియకు (ప్రాణాయామం) సంబంధించిన విధివిధానాలను ప్రాక్టికల్‌గా వివరించారు. జూన్ 21వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం ఇంద్రకీలాద్రిపై ఈ ఉచిత యోగా శిక్షణ నిరంతరాయంగా కొనసాగుతుందని, భక్తులు, విజయవాడ నగర వాసులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇఓ తెలిపారు.

# బీహార్ రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణమే సహాయ చర్యలు

## : మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త - వైద్యం** బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా యాత్రికులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని, బాధితులకు సత్వర సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరు సంతపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గయా నుంచి వారణాసికి వెళ్తున్న యాత్రికుల బస్సు ఔరంగాబాద్ సమీపంలో లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో సంగం, ఆత్మకూరు, దుత్తలూరు ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రయాణిస్తున్నారని, ఉదయం 5 గంటల సమయంలో సమాచారం అందిందని చెప్పారు. బస్సులో మొత్తం 45 మంది ప్రయాణిస్తున్నారని, వారిలో ఇద్దరు డ్రైవర్లు, ఒక వంటమనిషి, 42 మంది యాత్రికులు ఉన్నట్లు తెలిపారు. ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, 15 మంది గాయపడ్డారని వెల్లడించారు. మృతి చెందిన వారిలో టూర్ అటెండెంట్, వంటమనిషి, ఒక మహిళా యాత్రికురాలు ఉన్నారని చెప్పారు. సమాచారం అందిన వెంటనే జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి కార్యాలయం, ఢిల్లీలోని ఆంధ్రభవన్ కమిషనర్‌కు సమాచారం ఇచ్చి సహాయక చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘటనపై వెంటనే స్పందించి బాధితులకు అత్యవసర సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారని వెల్లడించారు. గయా నుంచి నెల్లూరు జిల్లాకు రోడ్డు మార్గంలో రావడానికి 38 గంటలకు పైగా సమయం పడుతుందని, ఈ నేపథ్యంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల మృతదేహాలను సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గయా నుంచి రేణిగుంట విమానాశ్రయానికి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. అక్కడి నుంచి జిల్లా అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక వాహనాల ద్వారా వారి స్వగ్రామాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రమాదంలో గాయపడిన 15 మంది యాత్రికులకు గయాలోని మెడికల్ కాలేజీలో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. క్షతగాత్రులను కూడా ప్రత్యేక విమానంలో చెన్నైకి తీసుకువచ్చి, అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా అధికారుల సహకారంతో నెల్లూరు జిల్లాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి బీహార్ అధికారులతో సమన్వయం కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. ఢిల్లీలోని ఆంధ్రభవన్ కమిషనర్ ఆర్యా శ్రీకాంత్ బీహార్ ప్రభుత్వ అధికారులతో, సీఎంవో అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని చెప్పారు. బీహార్‌లో పనిచేస్తున్న సీనియర్ తెలుగు ఐఏఎస్ అధికారి డా. రాజేందర్ కుమార్, ఐపీఎస్ అధికారి వివేక్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని మంత్రి వెల్లడించారు ఈ ప్రమాదంలో మొత్తం ముగ్గురు భక్తులు మృతి



చెందడం అత్యంత బాధాకరమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని సంగం, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు నుంచి ఈనెల 1న ప్రైవేట్ బస్సు లో గయా, వారణాసి యాత్రకు వెళ్లిన భక్తులు ప్రమాదానికి గురికావడం తీవ్ర విచారం కలిగించిందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి అవసరమైన వైద్య సహాయం అందేలా అధికారులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని తెలిపారు.



# మనం శత్రువులం కాదు..మిత్రులం.!

## భారత్‌కు చైనా స్నేహహస్తం

**బీజింగ్,జూన్ 8:** భారత్ పట్ల చైనా తన వైఖరిని మార్చుకుంటోంది. ఇప్పుడు మనం మిత్రులం అంటూ స్నేహహస్తం అందిస్తోంది. భారత్, చైనాలు ప్రత్యర్థులు లేదా వ్యతిరేక శక్తులు కాదని, ఒకరి అభివృద్ధికి మరొకరు ముప్పుగా కాకుండా అవకాశాలుగా నిలిచే సహాయకారి భాగస్వాములు అని చైనా చెప్పింది. సోమవారం చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, చైనాలతో రష్యాకు ఉన్న సంబంధాలను ప్రస్తావిస్తూ ఇటీవల పుతిన్ చేసిన వ్యాఖ్యల తర్వాత డ్రాగన్ కంట్రీ నుంచి ఈ కామెంట్స్ వచ్చాయి. భారత్, చైనాలు సహకార భాగస్వాముల్లు అభివర్ణించిన లిన్ జియాన్, ప్రస్తుతం రెండు దేశాల సరిహద్దుల్లో సాధారణ స్థితి ఉందని చెప్పారు. ఇరు దేశాల మధ్య సమాచార మార్గాలు సజావుగా ఉన్నట్లు తెలిపారు. రెండు దేశాల మధ్య సానుకూల సంబంధాలు రెండు దేశాలకే కాకుండా మొత్తం ఆ ప్రాంతానికి చాలా ముఖ్యమైనవి అని అన్నారు. ఇరు పక్షాల సంబంధాలు వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో చూడాలని ఆయన తెలిపారు. చర్చలు, సంప్రదింపుల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలని చైనా చెప్పింది. రష్యా, భారత్, చైనా సంబంధాల గురించి మాట్లాడుతూ మూడు వర్థమాన దేశాలని, ఈ దేశాల మైత్రి ప్రపంచ శాంతి, స్థిరత్వానికి ప్రయోజనకరమని అన్నారు. దీనికి ముందు రష్యా అధ్యక్షుడు భారత్‌చైనా సంబంధాల గురించి మాట్లాడుతూ రెండు దేశాల మధ్య సంబంధాలు చాలా సున్నితమైనవిగా,

బహుపాక్షికమైనవిగా అభివర్ణించారు. రెండు దేశాల మధ్య మూడో పక్షం జోక్యం చేసుకోవడం తగదని ఆయన అన్నారు. రష్యాకు రెండు దేశాలు మిత్రలే అని చెప్పారు. సరిహద్దు వివాదం వంటి సున్నితమైన అంశాలతో సహా పరస్పర ఆసక్తి ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించడానికి మోడీ, జిన్ పింగ్ కృషి చేస్తున్నట్లు చెప్పారు.

# అక్రమంగా తెల్లరాయి రవాణా

## - గ్రామస్తుల ఫిర్యాదుతో లారీ సీజ్ చేసిన పోలీసులు

**వింజమూరు (నెల్లూరు), జూన్ 8, ప్రభాతవార్త :** వింజమూరు మండల పరిధిలోని జనార్ధనపురంలో అక్రమంగా తీసిన తెల్లరాయి తరలిస్తున్న లారీని స్థానిక గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా తెల్లరాయిని తరలిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వింజమూరు ఎస్ఐ ఉమామహేశ్వరరావు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని లోడుతో ఉన్న లారీని డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న లారీని వింజమూరులోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలో భద్రపరిచారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. గతంలో కూడా జనార్ధనపురం నుంచి అనధికారికంగా తెల్లరాయిని తరలించేందుకు ప్రయత్నించారని గ్రామస్తులు తెలిపారు. అప్పట్లో పోలీసు అధికారులు స్పందించి, గనుల శాఖ అనుమతి లేకుండా రాయిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో అతడు తరలింపు ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

అయితే ఇటీవల గ్రామస్తుల కళ్లుగప్పి ఒక లోడు తెల్లరాయిని అక్రమంగా తరలించాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. మిగిలిన మరో లోడు రాయిని సోమవారం తరలించేందుకు యత్నించగా అప్రమత్తమైన గ్రామస్తులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ తెల్లరాయి తవ్వకాలు పై గనుల శాఖ అధికారులకు సమాచారం అందించమన్నారు. సహజ వనరులను

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

# ఢిల్లీలో తగ్గిపోతున్న పచ్చదనం

## కాలుష్యంతో ప్రమాదాలు - హైకోర్టు అసహనం

**న్యూఢిల్లీ,జూన్ 8:** దేశ రాజధాని నగరం ఢిల్లీలో పచ్చని ప్రదేశాలు వేగంగా తగ్గిపోతున్నాయని ఢిల్లీ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా న్యూ ఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ పరిధిలో మిగిలి ఉన్న కొద్దిపాటి గ్రీన్ స్పేస్‌లను కూడా స్వాధీనం చేసుకుంటే, భవిష్యత్తులో ప్రజలు ఊపిరాడక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. ఢిల్లీలోని జిమ్ఖానా క్లబ్, పోలో గ్రౌండ్ సహా పలు ఆస్తులను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అంశంపై దాఖలైన పిటిషన్‌ను విచారిస్తున్న సందర్భంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. పోలో అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా, ఇప్పటికే ఢిల్లీలో పచ్చదనం గణనీయంగా తగ్గిపోతున్న పరిస్థితిని కోర్టు ప్రస్తావించింది. ముఖ్యంగా ఎన్‌డీఎంసీ పరిధిలో ఉన్న కొద్దిపాటి పచ్చని ప్రదేశాలు నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించే ఊపిరితిత్తుల్లా పనిచేస్తున్నాయని పేర్కొంది. అలాంటి ప్రాంతాలను కూడా ఇతర అవసరాల కోసం వినియోగిస్తే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి కోర్టు కీలక ప్రశ్నలు సంధించింది. స్వాధీనం చేసుకోబోయే భూములపై ఎత్తైన భవనాలు లేదా ఇతర భారీ నిర్మాణాలు చేపట్టే ఆలోచన ఉందా అని ప్రశ్నించింది. పచ్చని ప్రదేశాలు తగ్గిపోతే నగరంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని, ప్రజల జీవన ప్రమాణాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని కోర్టు పేర్కొంది. ఎన్‌డీఎంసీ పరిధిలో ప్రజలు ఊపిరి పీల్చుకునేందుకు మిగిలి ఉన్న కొద్దిపాటి స్థలాలు కూడా కనుమరుగైతే, భవిష్యత్తులో అందరం ఊపిరాడక ఇబ్బంది పడాల్సి వస్తుంది. దేవుడే అందర్నీ కాపాడాలంటూ ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది.

# 10 నుంచి భవన నిర్మాణ కార్మికుల బంద్

- సెంట్రింగ్ కాంట్రాక్టర్ల అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి
- భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభ
- మద్దతు తెలిపిన హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ధర్నాచౌక్, జూన్ 8, ప్రభాతవార్త:** ఈనెల 10 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు బంద్ పాటిస్తున్నట్లు భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం నేతలు స్పష్టం చేశారు. సోమవారం సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, తాపీ మేస్త్రీలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభ పేరుతో ధర్నా నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సూర వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు సాయికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మురుగు యాదగిరి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చొక్కాపురం శ్రీరాములు, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఆదిరాల రవికుమార్ పాల్గొని తమ తాపీ మేస్త్రీల సమస్యలపై ప్రసంగించారు. ధర్నాకు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా ఉండి, తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. కార్మిక శాఖ నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలు కార్మికులందరికీ అందాలని తెలిపారు. బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ మాట్లాడుతూ సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, తాపీ మేస్త్రీలు అన్నదమ్ముల వంటి వారని, రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక శాఖామంత్రి వీరి మధ్య రాజీ కుదర్చాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలన్న మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులంతా ర్యాలీగా వెళ్లి అన్ని పోలీస్‌స్టేషన్లలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. తాపీ మేస్త్రీలపై సెంట్రింగ్ కాంట్రాక్టర్లు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, భేషరతుగా క్షమాపణలు చెప్పాలని కోరారు. కార్మిక సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన సంక్షేమ బోర్డు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, తాపీ మేస్త్రీల ధరలు పెరగాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించి, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షం పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంకు తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి భవన నిర్మాణ కార్మికులు వేలాదిగా తరలి వచ్చారు.

# కొత్త అణ్వాయుధ వ్యవస్థలు పెంచుకుంటున్న భారత్ పాక్‌దేశాలు

## స్టాక్‌హోం కేంద్రంగా ఉన్న సిప్రీ సర్వే నివేదికలో ప్రస్తావన

**న్యూఢిల్లీ, జూన్ 8:** భారత్, పాకిస్థాన్ దేశాలు కొత్త తరహా అణ్వాయుధ డెలివరీ వ్యవస్థలను అభివృద్ధి చేసినట్లు అంతర్జాతీయ సర్వేసంస్థలు చెపుతున్నాయి. బాలిస్టిక్ క్షిపణులకు వార్‌హెడ్స్‌ను అమర్చే సామర్థ్యాన్ని కూడా ఆ దేశాలు పెంచుకున్నట్లు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్స్‌టట్యూట్ సిప్రీ తన నివేదికలో ప్రస్తావించింది. భారత్, చైనా దేశాలు తమ వద్ద ఉన్న అణ్వస్త్రాలసంఖ్యను పెంచుకున్నట్లు ఆ నివేదికలో చెప్పారు. దీంతో పాటు వారహెడ్స్ ఉన్న అణ్వాయుధాలను వ్యవూహాత్మక ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. జనవరి 2026 నాటికి భారత్ వద్ద సుమారు 190 న్యూక్లియర్ వెపన్స్ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే సంఖ్య స్వల్పంగా పెరిగింది. ఇక చైనా వద్ద నిల్వల్లో 620 వార్‌హెడ్స్ ఉన్నాయి. గత ఏడాది ఆ దేశం వద్ద 600 మాత్రమే ఉండేవని స్టాక్‌హోమ్ రీసర్చ్ సంస్థ తెలిపింది. భారత్ తన యుద్ధ విమానాలు, నేల నుంచి ప్రయోగించే మిస్సైళ్లు, అణ్వాయుధ సామర్థం కలిగిన జలాంతర్గామిలకు న్యూక్లియర్ వెపన్స్‌ను అమర్చినట్లు కూడా ఆ రిపోర్టులో పేర్కొన్నారు. ఇంకా అదనపు మిస్సైళ్ల కోసం మరికొన్ని వార్‌హెడ్స్‌ను కూడా తయారు చేస్తున్నట్లు సిప్రి తన రిపోర్టులో చెప్పింది. ఆ వార్‌హెడ్స్ ఉన్న క్షిపణులను కంటైనర్లకు తరలిస్తున్నట్లు రిపోర్టులో చెప్పారు. సిప్రీ అంచనాల ప్రకారం ఈ ఏడాది జనవరి నాటికే స్వల్ప సంఖ్యలో ఉన్న వార్‌హెడ్స్‌ను ఇండియా తన జలాంతర్గాములకు తరలించినట్లు తెలుస్తోంది. చైనాపై ఫోకస్‌తో ఇండియాన సుదీర్ఘశ్రేణి ఆయుధ వ్యవస్థలను తయారు చేసుకుంటున్నట్లు రిపోర్టులో తెలిపారు. దీంతో పాటు పాకిస్థాన్‌తో ఉన్న శత్రుత్వాన్ని దృష్టిలో పెట్టుకుని కూడా ఇండియా తన ప్లానింగ్ చేస్తున్నట్లు సిప్రి నివేదికలో ఉటంకించింది. ఇక పాకిస్థాన్ అణ్వాయుధాల రిపోర్టును సిప్రి తెలియచేసింది. ఈ ఏడాది నాటికి పాకిస్థాన్ వద్ద 170 వార్‌హెడ్స్ ఉన్నట్లు రిపోర్టులో వెల్లడించారు. ల్యాండ్, ఎయిర్ సామర్థంలో బాగానే ఉన్నా సముద్ర సామర్థ్యాన్ని పాక్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నది. రాబోయే దశాబ్ధంలో తన అణ్వస్త్ర సామర్థ్యాన్ని పాక్ పెంచుకోనున్నదని రిపోర్టులో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 12,187 అణ్వాయుధాలు ఉన్నట్లు సిప్రీ వెల్లడించింది. మిలిటరీ వద్ద 9745 ఆయుధాలు ఉన్నాయని తేల్చింది. ఇక 4012 మాత్రం క్షిపణులు, ఎయిర్‌క్రాఫ్ట్ లో నిక్షిప్తంచేసారు. రష్యా, అమెరికా దేశాలు సుమారు 2200 ఆయుధాలను హై అలర్ట్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. భారత్, చైనా దేశాలు కూడా హై ఆపరేషనల్ అలర్ట్‌లో వార్‌హెడ్స్‌ను పెట్టినట్లు తెలుస్తోంది. చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, యూఎస్ దేశాల వద్ద ఎంఐఆర్వీ టెక్నాలజీ ఆయుధాలు ఉన్నాయి. ఇక ఇండియా, పాక్, ఉత్తర కొరియా ఆ టెక్నాలజీ కోసం ప్రయత్నిస్తున్నాయి. ఎంఐఆర్వీ టెక్నాలజీ అత్యంత శక్తివంతమైందని భావిస్తున్నారు. ఇండియా కూడా ఇటీవల అగ్ని5 మధ్యంతర క్షిపణి ద్వారా ఎంఐఆర్వీ టెక్నాలజీని పరీక్షించింది. మరోవైపు పాక్ మీడియం రేంజ్ క్షిపణులను డెవలప్ చేస్తున్నది.

# నిరుద్యోగ సమస్యలపైనే యువజన సమ్మేళనం

## 16, 17 తేదీల్లో కొత్తపేట బీజేఆర్ భవన్‌లో నిర్వహణ - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై జాన్‌వెస్లీ ధ్వజం

**చిక్కడపల్లి జూన్ 8 (ప్రభాతవార్త ) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విఫల విధివిధానాలు, నిరుద్యోగ సమస్యలపై చర్చించి యువతను చైతన్యపర్చేందుకు ఈ నెల 16, 17 తేదీల్లో నగరంలోని కొత్తపేటలోని బీజేఆర్ భవన్‌లో యువజన సమ్మేళనం నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రకటించారు. సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాజ్యసభ సభ్యులు ఏ.ఏ.రహీం హాజరవుతారని తెలిపారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ చేస్తామన్న కేంద్ర హామీ ఏమైందని జాన్‌వెస్లీ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 60 లక్షలు, ఒక్క రైల్వే శాఖలోనే 10 లక్షల ఖాళీలున్నా భర్తీ చేయడం లేదని, పైగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ ఉన్న ఉద్యోగాలను ఊడబీకుతున్నారని మండిపడ్డారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు లేకపోవడం వల్ల దళితులు, ఆదివాసీలు, బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇక రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామన్న హామీని బుట్టదాఖలు చేసిందని విమర్శించారు.

ఆట



# మూడు రోజుల్లోనే ఖేల్ ఖతమ్

## ఇన్నింగ్స్ 300 రన్స్‌తో ఘన విజయం *ఏకైక టెస్ట్ సిరీస్ భారత్ కైవసం

## స్పిన్‌కు అఫ్ఘానిస్థాన్ విలవిల*డెబ్యూ టెస్ట్‌లోనే మానవ్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్

**న్యూచండీఘర్, జూన్ 8:** ముల్లన్‌పూర్ స్టేడియంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్‌లో టీమిండియా అదరగొట్టింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో చెలరేగుతూ క్రికెట్ కూనను దెబ్బ తీసింది. ఏకంగా ఇన్నింగ్స్ 300పరుగుల తేడాతో ఘన విజయం అందుకుని చరిత్ర సృష్టించింది. టెస్ట్‌ల్లో భారత్‌కిదే అత్యంత భారీ విజయం. భారత్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌటై ఫాలోఆన్ ఆడింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ మరింత ఘోరంగా 112 పరుగులకే కుప్పకూలింది. ఈ ఏకైక టెస్ట్ మ్యాచ్ మూడు రోజుల్లోనే ముగిసింది. ఏకైక టెస్ట్ సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంది.

**మానవ్ స్పిన్ ఉచ్చుకు అఫ్ఘనిస్థాన్ విలవిల**

ఓవర్‌నైట్ స్కోరు అయిదు వికెట్ల నష్టానికి 113 పరుగులతో మూడో రోజు ఆటను కొనసాగించిన ఆఫ్ఘనిస్థాన్.. భారత బౌలర్ల ముందు క్రీజ్‌లో నిలవలేకపోయారు. టాప్ ఆర్డర్ లాగే మిడిల్ ఆర్డర్, లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. లంచ్‌కు ముందే ఆఫ్ఘన్ తొలి ఇన్నింగ్స్‌లో 152 రన్స్‌కు ఆలౌటైంది. అజ్మతుల్లా ఒమర్‌జాయ్‌ను ఆరంభంలోనే డకౌట్‌గా ప్రసిద్ధ్ కృష్ణ పెవిలియన్‌కు పంపాడు. డెబ్యూ బౌలర్ మానవ్ సుతార్ చక్కని స్పిన్‌తో షరఫుద్దీన్(11)ను ఔట్ చేశాడు. ఇక 43 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన రహత్ షా(135 బంతు ల్లో 60) అర్ధసెంచరీ పూర్తిచేశాడు. చివరకు అతన్ని మానవ్ సుతార్ క్లీన్ బౌల్డ్ చేశాడు. అదే ఊపులో సలీమ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని ఎల్బీగా ఔట్ చేశాడు. రహ్మాద్‌ను వాష్టింగ్టన్ సుందర్ అవుట్ చేయడంతో ఆఫ్ఘన్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది. భారత స్పిన్నర్ సుతార్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసుకుని సత్తా చాటాడు. ప్రసిధ్ కృష్ణ మూడు వికెట్లు పడగొట్టాడు.

**ఫాలోఆన్‌లోనే చతికిల**

తొలి ఇన్నింగ్స్‌లో 412 పరుగులు వెనకబడ్డ ఆఫ్ఘనిస్తాన్‌ను టీమిండియా ఫాలోఆన్ ఆడించింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో ఆఫ్ఘనీలు మరీ దారుణంగా చేతులెత్తేశారు. తొలి వికెట్ కు 42 పరుగులు జోడించాక పతకం మొదలైంది. మహ్మద్ సిరాజ్... ఓపెనర్ మాలిక్(8)ను ఔట్ చేసి ఆఫ్ఘన్ వికెట్ల పతనానికి నాంది పలికాడు. ముగింపు బాధ్యత స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్ తీసుకున్నారు. వీరి స్పిన్ బంతులను ఆడలేక ఆఫ్ఘన్ బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఓపెనర్ అటల్ (42), గుర్బాజ్ (24) మాత్రమే కాస్త క్రీజ్‌లో నిలిచారు. స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై భారత స్పిన్నర్లు సత్తా చాటారు. ఆఫ్ఘనిస్తాన్ రెండో ఇన్నింగ్స్‌ను కేవలం 35.3 ఓవర్లలో 112 రన్స్ చేసి ఆలౌట్ చేశారు. మూడో రోజు ఆటలో వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ కీలక పాత్ర పోషించారు. రెండో ఇన్నింగ్స్‌లో సుందర్ 4, కుల్దీప్ మూడు వికెట్లు తీసుకున్నారు. మూడోరోజుఆటలో ఏకంగా 14వికెట్లు పడ్డాయి. డెబ్యూ టెస్ట్‌లోనే ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచి మానవ్ సుతార్ అరుదైన ఘనత అందుకున్నాడు.

**స్కోర్ బోర్డు**

**భారత్ తొలి ఇన్నింగ్స్: 564/8** (శుభ్‌మన్ గిల్ 126, కేఎల్ రాహుల్ 100); **ఆఫ్ఘనిస్థాన్ తొలి ఇన్నింగ్స్: 152 ఆలౌట్(58.4 ఓవర్లలో)** (రషమత్ షా 60, మానవ్ సుథార్ 6/33); **ఆఫ్ఘని స్థాన్ రెండో ఇన్నింగ్స్(ఫాలోఆన్): 112 ఆలౌట్(35.5 ఓవర్లలో)** (అటల్ 42, వాషింగ్టన్ సుందర్ 4/36, కుల్‌దీప్ 3/30)

**ఫలితం:** భారత్ ఇన్నింగ్స్300రన్స్ విజయం

## 93 యేళ్లలో ఇదే ఫస్ట్

ఆఫ్ఘనిస్థాన్‌పై ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో నెగ్గిన గిల్ సేన అరుదైన ఘనతను ఖాతాలో వేసుకుంది. 93 ఏళ్ల కిందట మొదలైన భారత టెస్ట్ ప్రయాణంలో.. న్యూ చండీగర్ లోని ముల్లన్‌పూర్‌లో సాధించిన ఈ విజయం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. భారత్ చరిత్రలోనే ఇదే అత్యంత అతి పెద్ద విజయం. ఆఫ్ఘనిస్థాన్‌ను ఫాలోఆన్ ఆడించి మరీ ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఓడించి టీమిండియా ఈ నయా రికార్డును సెట్ చేసింది.

**టెస్ట్ క్రికెట్‌లో భారత్ టాప్-5 విజయాలు**

**2026:** ఆఫ్ఘనిస్థాన్‌పై ఇన్నింగ్స్ 300 రన్స్ విజయం
**2018:** వెస్టిండీస్‌పై ఇన్నింగ్స్ 272 రన్స్ గెలుపు
**2018:** ఆఫ్ఘనిస్థాన్‌పై ఇన్నింగ్స్ 262 రన్స్ విజయం
**2007:** బంగ్లాదేశ్‌పై ఇన్నింగ్స్ 239 రన్స్ గెలుపు
**2017:** శ్రీలంకపై ఇన్నింగ్స్ 239 రన్స్ విజయం

## భారత్, ఇంగ్లండ్ సిరీస్ వేళల్లో మార్పు

**లీడ్స్:** భారత్‌తో జరుగబోయే 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ వేళల్లో ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు మార్పులు చేసింది. బ్రాడ్‌కాస్టర్లతో చర్చల అనంతరం మ్యాచ్‌లను సాయంత్రం 5.30 గంటలకు (భారత కాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకు) ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం వెనుక ప్రధాన కారణం భారత ప్రేక్షకులే. భారత్‌లో క్రికెట్‌కు ఉన్న విపరీతమైన ఆదరణ దృష్ట్యా, మ్యాచ్‌లు మరింత ఎక్కువ మంది వీక్షి ంచేలా టైమింగ్ ను మార్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో బ్రిటన్‌కు చెందిన స్కై స్పోర్ట్స్, భారత్‌కు చెందిన సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లతో నిదితీ సంప్రదింపులు జరిపింది.

కాగా, జూలై 1 నుంచి 19 వరకు భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటనుంది. ఈ పర్యటనలో 5 టీ20లు, 3 వన్డేలు జరుగనున్నాయి. టీ20 సిరీస్ కోసం భారత జట్టును తాజాగా ప్రకటించారు. శ్రేయస్ అ య్యర్ సారథ్యంలో భారత జట్టు ఈ సిరీస్‌కు సిద్ధమవుతోంది. 15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ తొలిసారి సీనియర్ జట్టులో చోటు

## విండీస్‌పై వామప్ మ్యాచ్‌లో టీమిండియా మహిళల విక్టరీ

**కార్డిఫ్, జూన్ 8:** మహిళల టీ20 ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌లో టీమిండియా అదరగొట్టింది. వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 26 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత విమెన్ టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 179పరుగులు చేయగా.. విండీస్ 20 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 153రన్స్‌కే పరిమితమైంది. భారత ఇన్నింగ్స్‌లో భారతి ఫుల్మాలి (56 నాటౌట్) అర్ధ సెంచరీతో రాణించగా.. షఫాలీ వర్మ (29), స్మృతి మంధన (39), యస్తికా భాటియా (36) ఓ మోస్తరు స్కోర్లతో పర్వాలేదనిపించారు. మిగతా ప్లేయర్లు జెమీమా రోడ్రిగ్స్ (7), రిచా ఘోష్ డకౌట్, రాధా యాదవ్ (1), శ్రేయాంక పాటిల్ (2), క్రాంతి గౌడ్ (4)నిరాశ పరిచారు. విండీస్ బౌలర్లలో అఫీ ఫ్లెచర్ 4 వికెట్లతో సత్తా చాటగా.. కరిష్క రామ్హరాక్, ఆలియా అలెన్, డియాండ్రా డొట్టిన్ తలో వికెట్ తీశారు.

అనంతరం ఓ మోస్తరు లక్ష్య ఛేదనలో ఓపెనర్లు డొట్టిన్ (49), షెర్మైన్ క్యాంప్‌బెల్ (25) శుభారంభం అందించారు. అయితే రాణించిన శ్రేయాంక పాటిల్ నాలుగు వికెట్లు, రాధా యాదవ్ మూడు వికెట్లు తీసి కట్టడిచేశారు. దీంతో విండీస్‌కు ఓటమి తప్పలేదు. భారత్ జూన్ 10న ఇంగ్లండ్‌తో మరో వార్మప్ మ్యాచ్ ఆడనుంది.

## హెచ్‌సిఎ అధ్యక్షుడికి తెలంగాణ హైకోర్టు షాక్

**హైదరాబాద్, జూన్ 8(ప్రభాతవార్త క్రీడా ప్రతినిధి:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నిక చెల్లదని తెలంగాణ హైకోర్టు షాకింగ్ తీర్పు ఇచ్చింది. అతడిని వెంటనే బాధ్యతల నుంచి తొలగించాలని, స్పెషల్ ఏజీఎం నిర్వహించి కొత్త అధ్యక్షుడిని వెంటనే ఎన్నికోవాలని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. 2023 అక్టోబర్ 20న జరిగిన హెచ్‌సీఏ ఎన్నికల్లో అమర్‌నాథ్ ఒకే ఒక్క ఓటు తేడాతో జగన్ మోహన్ రావు చేతిలో ఓడిపోయారు. అయితే, జగన్‌మోహన్.. శ్రీ చక్ర క్లబ్ పేరుతో సమర్పించిన పత్రాలు నకిలీవని బీసీసీఐ అంబుడ్స్‌మన్‌కు అమర్‌నాథ్ ఫిర్యాదు చేశారు. అదేవిధంగా 2018లోనే అంబుడ్స్‌మన్ జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి.. గౌలీపురా పేరును శ్రీ చక్ర సీసీగా మార్చడం చట్టవిరుద్ధమని తీర్పునిచ్చారని కాబట్టి ఆ క్లబ్ ఉనికిలో లేదని అమర్‌నాథ్ వాదించారు. దీంతో హెచ్‌సీఏ కార్యకలాపాలు ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఓడిన అమర్‌నాథ్‌ను అధ్యక్షుడిగా ప్రకటిస్తూ జస్టిస్ కైత్ ప్రకటించారు. అయితే, తాజాగా అమర్‌నాథ్ ఎన్నిక చెల్లదంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించగా.. కేసులో ఇరు పక్షాల వాదనలను విన్న ధర్మాసనం ఆయన ఎన్నిక చెల్లదని తీర్పును వెలువరించింది.



## ఎర్రమట్టి చాంపియన్‌గా జ్వెరెవ్

## తొలి జర్మనీ ప్లేయర్‌గా ఘనత

**పారిస్:** ఎర్రమట్టి కోర్టులో కొత్త ఛాంపియన్ వచ్చాడు. రొలాండ్ గారోస్‌లో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌లో ఇటలీ ఆటగాడు ఫ్లావియో కొబోలీతో హోరాహోరీగా అయిదు సెట్లపోరులో మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్6-1, 4-6, 6-4, 6-7, 6-1 తేడాతో నెగ్గి పురుషుల సింగిల్స్ టైటిల్ అందుకున్నాడు. ఈ మ్యాచ్ 4 గంటల 16 నిమిషాలపాటు సాగింది. కొబోలి గట్టిపోటీనివ్వడంతో జ్వెరెవ్ గెలుపు కోసం చెమటోడ్చాడు. నాలుగుసార్లు ఫైనల్‌కు దూసుకొచ్చిన జ్వెరెవ్‌కు ఇదే తొలిగ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ టైటిల్. చివరి సెట్‌లో పాయింట్ సాధించి గెలుపొందడంతో జ్వెరెవ్.. రొలాండ్ గారోస్‌లో ఒక్కసారిగా తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. మట్టి నేలపై పడుకొని ఇన్నాళ్లు పడిన కష్టానికి కన్నీళ్లు కార్చాడు.

ఈ భావోద్వేగం వెనకాల చాలా కథే ఉంది. సుదీర్ఘకాలంగా వెంటాడుతున్న అనారోగ్య సమస్యపై 29 ఏళ్ల జ్వెరెవ్ నెగ్గాడు. నాలుగేళ్ల పసిప్రాయంలోనే టైప్ 1 దయాబెటిస్ బారిన పడిన జ్వెరెవ్.. 25 ఏళ్లుగా ఎన్నో కఠిన సవాళ్లు ఎదుర్కొన్నాడు. ఎంతోమంది నిరుత్సాహపరిచినా వెరవకుండా తల్లిదండ్రుల సాయంతో కఠోర పరిశ్రమ చేశాడు. అతడు ఎప్పుడు కోర్టులో అడుగుపెట్టినా.. ఇద్దరితో పోరాటం చేయాల్సి వచ్చేది. ఒకటి ప్రత్యర్థి కాగా, మరొకటి తన శరీరంతో. ఎందుకంటే గంటల తరబడి సాగే సుదీర్ఘ ర్యాలీల్లో ఆటగాళ్లు తీవ్రంగా అలసిపోవడం సహజం. అలాంటిది తను మధుమేహ బాధితుడు. ఆట మధ్యలో షుగర్ లెవెల్స్ పడిపోకుండా జాగ్రత్త వహించాలి. లేదంటే ఆరోగ్యం సహకరించక మ్యాచ్ మధ్యలోనే ఇంటికి వెళ్లే పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో ఏ ఆటగాడైనా అంతర్జాతీయ స్థాయిలో టెన్నిస్‌లో రాణించాలంటే అంత సులువు కాదు. అయినా ఏనాడు వెనక్కితగ్గని జ్వెరెవ్.. తన అత్యున్నత ఆటతో అదరగొట్టాడు. తన సమస్యను సమాజంతో పంచుకుంటే ఎవరేమనుకుంటారో అని తొలుత భావించిన జ్వెరెవ్.. చాన్నాళ్లపాటు ఈ విషయాన్ని గోప్యంగానే ఉంచాడు. అయితే తనలాంటి వాళ్లు చాలామంది ఉన్నారనే విషయం తెలుసుకున్న అతడు.. టైప్ 1 మధుమేహంతో బాధపడుతున్న చిన్నారులకు అవగాహన కల్పించడానికి హెల్త్‌కేర్ టెక్నాలజీలో గుర్తింపు పొందిన మెడ్‌ట్రోనిక్‌తో జట్టు కట్టాడు. ఈ సమస్యతో నిరాశలో కూరుకుపోయిన వారికి ఓ దిక్సూచిగా నిలిచేందుకు, వారిలో సంకల్ప బలం పెంచేందుకు ముందుకువచ్చాడు. తన సోదరుడితో కలిసి 2022లో అలెగ్జాండర్ జ్వెరెవ్ ఫౌండేషన్‌ను సైతం స్థాపించాడు. టైప్ 1 డయాబెటిస్‌తో బాధపడుతున్న చిన్నారులకు ఇన్సులిన్ ఇంజక్షన్లు, ఇతర మందులు అందిస్తున్నాడు.

ఇక ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ మ్యాచ్ మధ్యలో జ్వెరెవ్ విరామం తీసుకుని ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతోంది. టెన్నిస్‌లో తీవ్రపోటీ ఉన్నప్పటికీ ఏనాడు తన సమస్యను సాకుగా చూపి వెనక్కితగ్గని జ్వెరెవ్ ఎందరికో ఆదర్శంగా నిలిచాడు.




## ఎఐ రంగంలోకి రిలయన్స్ ఇన్‌ఫ్రా

**ముంబయి, జూన్ 8:** పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (ఆర్‌ఇన్ఫ్రా) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇతర కొత్త టెక్నాలజీల రంగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. తన వ్యాపార కార్యకలాపాల్లో టెక్నాలజీ ఆధారిత సేవలను భాగం చేసే వ్యూహంలో భాగంగా ఈ అడుగు వేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ మేరకు తమ అనుబంధ సంస్థల ద్వారా ఈ కొత్త వ్యాపారంలోకి ప్రవేశిస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్‌లో రిలయన్స్ ఇన్ఫ్రా పేర్కొంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ, సంబంధిత టెక్నాలజీ విభాగాల్లో పాలుపంచుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. రిలయన్స్ ఏఐ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ అపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ వన్ ప్రైవేట్ లిమిటెడ్ అని కొత్త పేర్లతో ఈసంస్థలు వస్తున్నాయి. రిలయన్స్ ఇన్ఫ్రా ఏఐ రంగ ప్రవేశ ప్రకటన మార్కెట్లో తక్షణమే సానుకూల ప్రభావం చూపింది. బీఎస్‌ఈలో కంపెనీ షేరు 5 శాతం పెరిగి రూ.86.17 వద్ద ఎగువ సర్క్యూట్‌ను తాకింది. గత ఏడాది కాలంలో సుమారు 80 శాతం నష్టపోయినప్పటికీ, గత నెల రోజుల్లో 20 శాతానికి పైగా లాభపడింది. ఆరు నెలల్లో 40 శాతం పతనం కాగా, గత ఐదేళ్లలో మాత్రం 3 శాతానికి పైగా లాభాలను అందించింది. కంపెనీ ఆర్థిక ఫలితాలను పరిశీలిస్తే, 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ. 918 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కార్యకలాపాల ద్వారా రూ. 4,001 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపింది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ. 2,900 కోట్ల లాభాన్ని, రూ. 20,440 కోట్ల రాబడులను నమోదు చేసింది.

## గ్లోబల్ తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్



**న్యూయార్క్, జూన్ 8:** టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా నిలిచే అవకాశం ఉంది. ఒక ట్రిలియన్ డాలర్ల సంపదను కలిగిన మొట్టమొదటి వ్యక్తిగా మస్క్ రికార్డు సృష్టించబోతున్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా ఉన్న మస్క్ సంపదలో అధిక భాగం టెస్లా కంపెనీ షేర్ల రూపంలో ఉంది. దీని విలువ సుమారు 273 బిలియన్ డాలర్లు. మరో సంస్థ స్పేస్‌ఎక్స్ త్వరలో స్టాక్ మార్కెట్‌లో అడుగుపెడితే (ఐపీఓ), ఆయన సంపదకు అదనంగా మరో 841 బిలియన్ డాలర్లు జతయ్యే అవకాశం ఉంది. అప్పుడు ఆయన నికర సంపద 1 ట్రిలియన్ డాలర్ల మార్కును సులభంగా దాటుతుంది. ఒక ట్రిలియన్ డాలర్లంటే భారత కరెన్సీలో సుమారు 95 లక్షల కోట్ల రూపాయలు. ఈ సంపద విలువ ప్రపంచంలోని చాలా దేశాల వార్షిక ఆర్థిక వ్యవస్థల (జీడీపీ) కంటే ఎక్కువ కావడం గమనార్హం. తైవాన్ ( 977 బిలియన్లు), ఐర్లాండ్ ( 779 బిలియన్లు), స్వీడన్ ( 760 బిలియన్లు), సింగపూర్ (660 బిలియన్లు) వంటి అభివృద్ధి చెందిన దేశాల జీడీపీ కంటే కూడా మస్క్ సంపదే ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ ఆర్థిక కేంద్రమైన మాన్‌హట్టన్ వార్షిక ఆర్థిక ఉత్పత్తి (1 ట్రిలియన్)తో ఇది సమానంగా ఉంది. మస్క్ తోటి టెక్ బిలియనీర్లతో పోల్చినప్పుడు ఈ సంపద స్థాయి తెలుస్తోంది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, ఒరాకిల్ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్, గూగుల్ సహ వ్యవస్థాపకులు లారీ పేజ్, సెర్గీ బ్రిన్ వంటి పలువురు అగ్రశ్రేణి కుబేరులందరి మొత్తం సంపద కలిపితే సుమారు1.09 ట్రిలియన్లు ఉంటుంది. వీరందరి సంపద కేవలం మస్క్ ఒక్కడి సంపద కంటే కొంచెమే ఎక్కువ. అమెరికాలోని ప్రధాన నగరమైన హ్యూస్టన్‌లోని నివాస, వాణిజ్య ఆస్తులన్నింటి మొత్తం విలువ (879 బిలియన్లు) కంటే కూడా మస్క్ సంపద ఎక్కువ.

### పశ్చిమాసియా వార్ ఉద్రిక్తతలతో..


## ఈక్విటీ సూచీలకు నష్టాలు



**ముంబయి, జూన్ 8:** దేశీయ ఈక్విటీసూచీలు వారం ప్రారంభంలో నష్టాలు చవిచూసాయి. ఆసియా మార్కెట్లలో భారీ ఎత్తున అమ్మకాలు కొనసాగడం, ముడిచమురు దరలు పెరుగుతుండటం, పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకోవడంతో మార్కెట్ల సూచీలు దెబ్బతిన్నాయి. అలాగే ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లు పెంచుతుందన్న వార్తలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మార్చింది. మెటల్, ఆటోమొబైల్ స్టాక్స్ ఎక్కువ దెబ్బతీసాయి. హెల్త్‌కేర్‌స్టాక్స్‌లో కూడా భారీ అమ్మకాలు కొనసాగాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 719.08 పాయింట్లు క్షీణించి 73,524.26 పాయింట్ల వద్ద ట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ 243.70 పాయింట్లు క్షీణించి 23,123 పాయింట్ల వద్ద ముగించింది. వరుసగా రెండు సెషన్లలోను సెన్సెక్స్ 1.13శాతం, నిఫ్టీ 1.38శాతం చొప్పున క్షీణించాయి. రిలయన్స్ 2.18శాతం, ఎల్‌అండ్‌టి 2.09 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.21శాతం చొప్పున నిఫ్టీలో ఎక్కువ నష్టం చవిచూసాయి. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్ సూచీ 1.70శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.88శాతం చొప్పున దిగజారాయి.

మార్కెట్ల పరంగా 1181 షేర్లు పెరిగితే 3192 షేర్లు క్షీణించాయి. 180 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఇక విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి 95.74గా కొనసాగింది. అంతకుముందురోజు 95.18కంటే స్వల్పంగా క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ ధరలు ఆగస్టు 6వ తేదీనాటి సెటిల్‌మెంట్లు 1.33శాతం క్షీణించి రూ.1,53,529కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఆగస్టు సెటిల్‌మెంట్ ధరలు3.92డాలర్లు పెరిగి 97.01కి చేరాయి. యూరోప్, ఆసియా షేర్లు కూడా దిగువ స్థాయిలో ట్రేడింగ్‌జరడంతో ఈ ప్రభావం భారత్ మార్కెట్లపై చూపించింది. వివిధ కంపెనీల పరంగా చూస్తే ఇఎంఎస్ 10.35శాతం పెరిగింది. హెచ్‌జి ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ 2.84శాతం, జీ ఎంటర్‌టైన్‌మెంట్ 1.05శాతం డౌన్ అయ్యాయి. క్యాపిట్ బ్రూవ రీస్ డిస్టిలరీస్ 4.96శాతం, లీ ట్రావెన్యూస్ టెక్నాలజీ ఇక్సిగో 2.49శాతం క్షీణించాయి.

సిగ్మా అడ్వాన్సుడ్ సిస్టమ్స్ 4.39శాతం, ఆదాని పోర్టులు సెజ్ 1.05శాతం, వారి రెన్యువబుల్ టెక్నాలజీస్ 2.36శాతం, లూపిన్ 0.58శాతంచొప్పున క్షీణించాయి.




### భారత్ డీమ్యాట్ రంగంలో 77శాతం ఖాతాలు నిర్వీర్యం

## అసలు ఖాతాలు ఐదు కోట్లే

**న్యూఢిల్లీ:** భారతదేశంలో రిటైల్ ఇన్వెస్టింగ్ విప్లవం భారీగా విస్తరించినట్లు కనిపిస్తున్నప్పటికీ, డీమ్యాట్ ఖాతాల వాస్తవ వినియోగం తక్కువగానే ఉంది. గత ఏడాది డిసెంబర్ నాటికి దేశంలో డీమ్యాట్ ఖాతాల సంఖ్య 21.6 కోట్లకు చేరగా, వాటిలో కేవలం 5 కోట్ల ఖాతాలే పనిచేస్తున్నట్లు తేలింది. మిగిలిన 16.6 కోట్ల ఖాతాలు నిర్వీర్యంగా లేదా క్రియాశీలత లేకుండా ఉన్నట్లు తెలుస్తోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2026 ఆర్థిక సంవత్సరంలో యాక్టివ్ ఇన్వెస్టర్ల సంఖ్య 7శాతం తగ్గి 4.58 కోట్లకు చేరింది. 2025లో ఈ సంఖ్య 4.92 కోట్లుగా ఉండగా, ఏడాదిలోనే దాదాపు 35 లక్షల యాక్టివ్ ఖాతాలు తగ్గిపోయాయి. ఈ తగ్గుదలలో 70 శాతం కంటే ఎక్కువ భాగం జీరోధా, ఏంజెల్ వన్, అప్స్టాక్స్ వంటి ప్రముఖ డిస్కౌంట్ బ్రోకర్ల ఖాతాదారుల నుంచే నమోదైంది. మార్కెట్ నిపుణులు దీనికి మూడు ప్రధాన కారణాలను గుర్తిస్తున్నారు. బుల్ మార్కెట్ సమయంలో అనేక మంది పెట్టుబడిదారులు కేవలం ఐపీఓలలో పాల్గొనడానికి మాత్రమే డీమ్యాట్ ఖాతాలు తెరిచారు. షేర్ల కేటాయింపు రాకపోవడం లేదా లిస్టింగ్ అనంతరం వెంటనే విక్రయించడం వల్ల ఆ ఖాతాలను తరువాత ఉపయోగించలేదు.

డిజిటల్ బ్రోకరేజ్ సేవలు, పేపర్‌లెస్ ప్రక్రియల కారణంగా ఒకే వ్యక్తి అనేక బ్రోకర్ల వద్ద డీమ్యాట్ ఖాతాలు తెరవడం సులభమైంది. వాటిలో ఒక ఖాతాను మాత్రమే వినియోగిస్తూ మిగిలిన ఖాతాలను నిర్వీర్యంగా వదిలేస్తున్నారు. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ఎఫ్‌అండ్‌వో విభాగంలో ఎక్కువ మంది రిటైల్ ట్రేడర్లు నష్టాలను ఎదుర్కొంటున్నట్లు నియంత్రణ సంస్థల అధ్యయనాలు వెల్లడించాయి. నప్రైవేట్ వెల్త్ వ్యవస్థాపకుడు హిమాన్షు పాండ్యా మాట్లాడుతూ, ఖాతాల సంఖ్య పెరగడం మాత్రమే నిజమైన మార్కెట్ భాగస్వామ్యానికి సూచిక కాదన్నారు.

దూకుడుగా ఖాతాలు తెరవడం ద్వారా మార్కెట్లో స్థిరమైన పెట్టుబడిదారులు పెరగరని ఆయన అభిప్రాయపడ్డారు. మనీలాండరింగ్, మోసపూరిత లావాదేవీలకు ఇటువంటి ఖాతాలు ఉపయోగపడే అవకాశం ఉందని హెచ్చరించారు. 21.6 కోట్ల డీమ్యాట్ ఖాతాల సంఖ్య కనిపిస్తున్నప్పటికీ, బహుళ ఖాతాల కారణంగా దేశంలో నిజమైన ప్రత్యేక పెట్టుబడిదారుల సంఖ్య 12 నుంచి 13 కోట్ల మధ్య మాత్రమే ఉండొచ్చనిఅంచనా. రిటైల్ పెట్టుబడిదారుల భాగస్వామ్యం పెరుగుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, యాక్టివ్ ఖాతాల తగ్గుదల భారత పెట్టుబడి సంస్కృతిలో ఉన్న వాస్తవ పరిస్థితిని బయటపెడుతోందని నిపుణులు పేర్కొంటున్నారు.

## వాటాల విక్రయానికి ఎన్‌ఎల్‌సీ ఓఎఫ్‌ఎస్?




**న్యూఢిల్లీ, జూన్ 8:** ప్రభుత్వరంగంలోని నైవేలి లిగ్నయిట్ కార్పొరేషన్ ఆఫర్‌ఫర్‌సేల్ ప్రకటించింది. మూడుశాతం ఈక్విటీ వాటాలను విక్రయించనున్నట్లు తెలిపింది. ఇన్వెస్టర్లు ప్రభుత్వరంగంలోని ఒక నవరత్న కంపెనీ షేర్లు కొనుగోలుకు ఇపుడు మంచి తరుణం వచ్చింది. ప్రభుత్వ పరిధిలోని పెట్టుబడుల ఉపసంహరణ పథకం పరిధిలో ఈ ఓఎఫ్‌ఎస్ ఉంటుందని కంపెనీ ప్రకటించింది. ఓఎఫ్‌ఎస్ ఇష్యూధర రూ.303గా ప్రకటించింది. నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు మంగళవారంనుంచే ప్రారంభిస్తారు. రిటైల్ ఇన్వెస్టర్లకు ఈనెల పదోతేదీనుంచి బిడ్లు తెరుస్తారు. ఇష్యూధర ప్రస్తుత మార్కెట్‌ధరకంటే 10శాతం డిస్కౌంట్‌కు లభిస్తున్నది. రెండుశాతం అధీకృత మూలధనంలో వాటాగా ఈ షేర్‌సేల్ ఉంటుంది. అదనంగా ఒకటిశాతం వాటా గ్రీన్‌షూ ఆప్షన్‌కింద అందుబాటులో ఉంచుతుంది. పవర్‌బిజినెస్‌లను పెంచుకోడం, సామర్థ్యం విస్తరణ వంటివదటికి ఈనిధులు వినియోగిస్తారు. ఇటీవలికాలంలో ఎన్‌ఎల్‌సీ మంచి పనితీరుచూపించింది. స్థిరంగా రిటర్నులు వస్తున్నాయి. వాటాదారులకు క్రమం తప్పకుండా డివిడెండ్లు ప్రకటిస్తోంది. ఇన్వెస్టర్ల స్పందనను ట్రేడర్లు నిశితంగా గమనిస్తున్నారు.

## రెండునెలల్లో 15% పెరిగిన ఎగుమతులు



**ముంబయి, జూన్ 8:** భారత వాణిజ్య ఎగుమతులు ఏప్రిల్ మేనెలల్లో 15శాతం పెరిగినట్లు కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటించింది. అదనంగా పెట్రోలియమేతర ఉత్పత్తుల ఎగుమతులు పటిష్టమైన వృద్ధిని నమోదుచేసాయి. 10నుంచి 11శాతం ఎగుమతులు పెరిగినట్లు కేంద్రం వెల్లడించింది. పశ్చిమాసియా సంక్షోభం పెరుగుతున్నప్పటికీ వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటున్నప్పటికీ భారత్‌నుంచి ఎగుమతులు మాత్రం పటిష్టంగా ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. 2027 ఆర్థికసంవత్సరం ప్రారంభంనుంచే పటిష్టంగా ఉన్నాయి. ఏటికేడాది 13.6శాతం వృద్ధినినమోదుచేస్తూ ఏప్రిల్ 2026లో 80.8 బిలియన్ డాలర్లు విలువైన ఎగుమతులు జరిగాయి. వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌మాట్లాడుతూ ప్రాంతీయ సవాళ్లు ఎన్ని ఎదురయినా ఎగుమతులకు విఘాతం కలగలేదని, విభిన్న మార్కెట్లకు ఎగుమతులుచేయడంవల్ల పటిష్టమైన వృద్ధిని సాధించామన్నారు. ఉత్పత్తుల ఎగుమతులు ఏప్రిల్‌లో 43.56 బిలియన్ డాలర్లకు చేరాయి. గత ఏడాది ఇదేనెలలో 38.28 బిలియన్ డాలర్లవరకూ మాత్రమే ఉన్నాయి. సేవలరంగ ఎగుమతులు 32.8 బిలియన్ డాలర్లనుంచి 37.2 బిలియన్ డాలర్లకు పెరిగాయి. దిగుమతులు కూడా పెరిగాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం మంగళవారం 09 జూన్ 2026 I

# సత్యదేవుని దర్శించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ లిసా గిల్



**అన్నవరం మే 8 (ప్రభాతవార్త)** అన్నవరం శ్రీ వీర వెంకట సత్య నారాయణ స్వామి వారి దర్శనార్థమై ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ లిసా గిల్ శ్రీ సత్య నారాయణస్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజ చేశారు. ముందుగా ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామివారిని దర్శనం అనంతరం పండితులు వేద ఆశీర్వచనం చేశారు. వీరికి అసిస్టెంట్ కమిషనర్ శ్రీమతి మంజులా దేవి, ఆలయ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాస్ స్వామివారి చిత్రపటం ప్రసాదము హైకోర్టు చీఫ్ జస్టిస్ లిసా గిల్ అందజేశారు. కార్యక్రమంలో పెద్దాపురం డిఎస్పి తిలక్ అన్నవరం హరిబాబు ఆలయ అధికారులు పాల్గొన్నారు.



## వాడపల్లి వెంకన్న కు అష్టోత్తర పూజాలు, నిత్యకళ్యాణం ..

### అశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులు.

### స్వామివారి నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116/-విరాళం...







**ఆత్రేయపురం, జూన్ 08 (ప్రభాత వార్త).** ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం వేలాది మంది భక్తులతో పోటెత్తింది .ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణంలలో పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు.ఉదయం స్వామివారికి మేలుకొలుపు, శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం, అష్టోత్తర, నిత్యకళ్యాణం,బాల భోగం, గోపూజ, నివేదన, తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు.అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఉప్పులగుప్తం మండలం, చల్లపల్లి చెందిన సుంకర సూర్యచంద్రరావు, వెంకటలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 1,00,116/- విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో శ్రీ స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, జూనియర్ అసిస్టెంట్ వై శ్రీనివాస్ లు శ్రీ స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, అందజేశారు. ప్రతిరోజు ఆలయానికి వివిధ జిల్లాల నుండి వచ్చే భక్తులు మన మిత్ర వాట్సాప్ నంబర్ ద్వారా శ్రీ స్వామి వారి సేవలు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఆశా వర్కర్ల నియామకాలలో డిఎంహెచ్ ఓ దుర్గారావు పై అవినీతి ఆరోపణలు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్8,ప్రభాతవార్త.** అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆశా వర్కర్ల నియామకాల ప్రక్రియపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలను విస్మరించి డిఎంహెచ్ఓ దుర్గారావు అవకతవకలతో ఉద్యోగాలు కేటాయించారని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. ఆశా వర్కర్ల నియామకాలలో అర్హతలను పక్కనపెట్టి గతంలో వాలంటీర్లుగా పనిచేసిన కొందరు వైసీపీ వాలంటీర్లకు ప్రాధాన్యం ఇచ్చారని వారు పేర్కొన్నారు. ఎస్సీ, బీసీ వర్గాలకు కేటాయించిన పోస్టులను కూడా ఇతరులకు అప్పగించారని ఆరోపించారు.ఇదిలా ఉండగా, గల్ఫ్ దేశమైన కువైట్‌లో నివసిస్తున్న కుంచె వెంకటలక్ష్మి అనే మహిళకు ఆశా వర్కర్ ఉద్యోగం కేటాయించారన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. స్థానికంగా అందుబాటులో ఉండి సేవలు అందించాల్సిన ఉద్యోగానికి విదేశాల్లో ఉన్న మహిళ కు ఎలా ఎంపిక చేశారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) దుర్గారావు నియామకాల ప్రక్రియలో అవినీతికి పాల్పడ్డారని, కొందరికి ఉద్యోగాలను అమ్మేశారని బాధితులు ఆరోపించారు. జిల్లాలోని కొందరు అధికారులు ఇప్పటికీ గత ప్రభుత్వ ప్రభావంలోనే వ్యవహరిస్తున్నా రని అసంతృప్త అభ్యర్థులు ఆరోపించారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కాగా, ఈ ఆరోపణలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల స్పందన ఇంకా అందాల్సి ఉంది. దీనిపై జిల్లా కలెక్టర్ ఏ విధంగా స్పందిస్తారో అని బాధితులు ఎదురు చూస్తున్నారు .

## భారతీయ సంస్కృతిలో అద్భుత వరం యోగ మంత్రి దుర్గేష్





**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 8( ప్రభాతవార్త)** భారతీయ సంస్కృతిలో అద్భుత వరం యోగా అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో నిర్వహించిన యోగాంధ్ర 2026 కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి జాయింట్ కలెక్టర్ వై మేఘస్వరూప్ నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యోగ కేవలం వ్యాయామం మాత్రమే కాదని అది సంపూర్ణ జీవన విధానం అని అన్నారు. నిత్యజీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వం మానసిక ప్రశాంతత క్రమశిక్షణ ఆత్మ విశ్వాసం పెంపొందుతాయి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఒత్తిడి ఆందోళనల నేపథ్యంలో యోగా అత్యంత ప్రభావంతమైన పరిష్కారాంగా గుర్తింపు పొందింది అన్నారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్ర 2026 కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఇతరులను జయించడం కంటే మనల్ని మనం జయించుకోవడం గొప్ప విజయం అని అందుకు యోగ ధ్యానం ఎంతో ఉపకరిస్తాయని తెలిపారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అద్భుతమైన బహుమతిగా పేర్కొన్నారు. తాను వారానికి రెండు రోజులు యోగా చేస్తున్నానని ఇకపై మరింత క్రమబద్ధంగా సాధన కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై మేఘ స్వరూప్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, సెంట్రల్ జైలు ఎస్పీ ఎస్ రాహుల్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే బొత్తుల బలరామకృష్ణ, సమన్వయ అధికారి డాక్టర్ విజయ్ కుమారి, జిల్లా అధికారులు, కారాగార శాఖ అధికారులు ,సిబ్బంది, ఖైదీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యోగాలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని మంత్రి అభినందించారు.



# చిన్నారి జ్ఞానేశ్వరి క్షేమమేనా...?

### మిస్టరీగా మారిన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం

### పాప ఆచూకీ కోసం నిర్విరామంగా శ్రమిస్తున్న పోలీసు బృందాలు

### రెండు రోజులు గడుస్తున్న పాప ఆచూకీ లభించకపోవడంతో రోధిస్తున్న కుటుంబ సభ్యులు

### పాప ఆచూకీ తెలిపిన వారికి లక్ష రూపాయలు రివార్డు ప్రకటించిన పోలీసులు






**తుని, జూన్ 8,( ప్రభాతవార్త )** తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారం గ్రామంలో అదృశ్యమైన మూడేళ్ల చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి ( జాను) క్షేమంగానే ఉందా? లేక ఆ చిన్నారికి ఏదైనా ప్రమాదం సంభవించిందా? తప్పిపోయిన చిన్నారి ఆ కొండ ప్రాంతంలో ఎక్కడికి వెళ్లింది? లేక ఆ చిన్నారిని ఎవరైనా కావాలనే తీసుకెళ్లిపోయారా?, మూడు రోజుల నుండి గాలిస్తున్న చిన్నారి క్షేమ సమాచారం సంబంధించి ఇప్పటికీ ఒక్క ఆధారం కూడా లభించకపోవడంతో అటు కుటుంబ సభ్యులను, ఇటు పోలీసు వర్గాలను కలవరపెడుతుంది. వేల మంది ప్రజలు చిన్నారి తల్లి జ్ఞానేశ్వరి క్షేమంగా తల్లి ఒడికి చేరాలని ప్రార్థనలు చేస్తున్నారు. తుని మండలం దొండవాక అగ్రహారంలో కొండను ఆనుకునిఉన్న పామాయిల్ తోట కాపలాదారుగా ఉంటూ అక్కడే నివాసం ఉంటున్న సుంకర గణేష్, భవాని దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి. శనివారం మధ్యాహ్నం తల్లిదండ్రులు వారి వారి పనుల్లో నిమగ్నమై ఉండగా తోటలో పెంపుడు కుక్క తో పాటు ఆడుకుంటూ చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమైంది. తప్పిపోయిన జ్ఞానేశ్వరి కోసం పోలీస్ బృందాలు, అటవీ శాఖ సిబ్బంది, ఎస్డిఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది పామాయిల్ తోటను, తోటను ఆనుకుని ఉన్న కొండ ప్రాంతాన్ని జల్లెడు పడుతున్నాయి. అణువణువు గాలిస్తూ పాప ఆచూకీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. డ్రోన్లు, డాగ్ స్క్వాడ్,తో పాటు అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి గాలిస్తున్నప్పటికీ ఆ చిన్నారి ఆచూకీ లభించకపోవడం కలవరపెడుతుంది. కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాలతో పెద్దాపురం ఎస్డిపిఓ తిలక్ నేతృత్వంలో తుని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. చెన్నకేశవరావు, రూరల్ ఎస్సై కృష్ణమాచారి సంఘటనా స్థలంలోనే ఉండి పది పోలీస్ బృందాలతో గాలింపు చర్యలు చేపడుతున్నారు. మండుటె ఎండను సైతం సైతం లెక్కచేయకుండా వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న కొండ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. అయినప్పటికీ చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కి సంబంధించి ఒక క్లూ కూడా లభించకపోవడంతో పోలీసు వర్గాలు సైతం విస్మయానికి గురవుతున్నాయి. చిన్నారి అదృశ్యం మిస్టరీని చే ధించేందుకు అంది వచ్చే ఏ ఒక్క క్లూ ని పోలీసులు వదలటం లేదు. పాప ఆచూకీ పై పక్కా సమాచారం అందించిన వ్యక్తులకు లక్ష రూపాయలు రివార్డ్ అందించడం జరుగుతుందని పోలీసులు ప్రకటించారు. ఏది ఏమైనా పోలీసులు, ఇతర శాఖల సిబ్బంది, గ్రామస్తుల శ్రమ ఫలించి చిన్నారి తల్లి జ్ఞానేశ్వరి క్షేమంగా అమ్మఒడికి చేరాలని కోరుకుందాం.

# వీఆర్వోల ఆందోళన



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్8,ప్రభాతవార్త.** కర్నూలు జిల్లాలో ఆత్మ హత్య చేసుకున్న గ్రేడ్ 2 వీఆర్వో గా పనిచేస్తున్న మహమ్మద్ హుస్సేన్ కుటుంబానికి న్యాయం చేయాలని,ఆయన ఆత్మహత్య కు కారకులైనటువంటి అధికారుల మీద చర్య తీసుకో వాలని డిమాండ్ చేస్తూ అమలాపురం మండలం తహసీల్దార్ కార్యాలయం గ్రామ రెవిన్యూ అదికారుల సంఘం ఆధ్వర్యంలో అందోళన చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం, అలాగే జిల్లాల్లో గల జిల్లా కలెక్టర్ లు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మరణించిన వీఆర్వో కుటుంబాని కి ప్రభుత్వం తరపున న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సాధనాల యల్లేశ్వర్రావు,ఆకుమర్తి వినోద్ కుమార్, పి.వెంకటేశ్వరరావు, గణేష్, ఏ. రాజేష్, ప్రకాష్, దొరబాబు,సత్యవతి, అమ్మాజీ గ్రామ రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# పైన శుభ్రం.. లోపల అపశుభ్రం!




**అడ్డతీగల, జూన్ 08, ప్రభాతవార్త** మండల కేంద్రంలో పురాతన మంచినీటి బావి నిన్నటి రోజున వార్త కథనానికి స్పందించిన అధికారులు అధికారుల తూతూమంత్రం చర్యలపై గ్రామస్తుల ఆగ్రహం. నిన్నటి వార్తా లో మంచినీటి బావి వాటర్ ట్యాంక్ దుస్థితి విషమం అనే కథనానికి అధికారులు స్పందించినప్పటికీ, క్షేత్రస్థాయిలో సమస్య మాత్రం అలాగే ఉండిపోయింది. స్థానిక మంచినీటి బావి చుట్టుపక్కల పేరుకుపోయిన మొక్కలను అధికారులు పైపైన శుభ్రం చేయించారు. అయితే, అసలు సమస్య అయిన బావి లోపలి భాగాన్ని మాత్రం పూర్తిగా వదిలేశారు. బావి లోపల బ్లీచింగ్ పౌడర్ గానీ, క్లోరిన్ గానీ చల్లి నీటిని శుద్ధి చేయకపోవడంతో లోపల నాచు, తుప్పులు అలాగే పేరుకుపోయి ఉన్నాయి. అధికారుల ఈ 'తూతూమంత్రం' పనులపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేవలం పైపైన రంగులు మార్చి, లోపల అపశుభ్రతను అలాగే వదిలేస్తే రోగాలు నయమవుతాయా? ఇలాంటి అరకొర పనుల వల్ల గ్రామంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది అని గ్రామస్తులు గుసగుసలాడుకుంటున్నారు. ఉపరితలాన్ని మాత్రమే కాకుండా, బావి లోపలి నీటిని కూడా శుద్ధి చేసి, ప్రజల ఆరోగ్యానికి ముప్పు లేకుండా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న ఐఎఎస్. ఏడి సర్వే, డి ఎస్ ఎస్ ఎల్ ఆర్ రొనంకి కూర్మనాధ్.



**ఆత్రేయపురం, జూన్ 08,(ప్రభాత వార్త).** ఏడువారాల వెంకన్న గా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని సోమవారం ఐఎఎస్. ఏడి సర్వే, డి ఎస్ ఎస్ ఎల్ ఆర్ రొనంకి కూర్మనాధ్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు జూనియర్ అసిస్టెంట్ వెంకటరాజు స్వామివారి చిత్రపటం , ప్రసాదాలను అందజేశారు. వారి వెంట తహశీల్దార్ ఆర్ డి. రామచంద్ర మూర్తి, సీనియర్ అసిస్టెంట్ ఎస్. వినాయకుడు, ఉన్నారు.

## ప్రాణాంతక క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడం అత్యంత కీలకం

### గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ గోపి శ్రీకాంత్




**కాకినాడ రూరల్, జూన్ 8 (ప్రభాతవార్త):** ఆధునిక జీవన శైలిలో ప్రజారోగ్యానికి తీవ్రసవాలుగా పరిణమిస్తున్న ప్రాణాంతక వ్యాధి క్యాన్సర్ బారిన పడిన వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుంది. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పొగాకు వినియోగం, మద్యపానం, స్థూలకాయం తదితర పర్యావరణ కారణాలే ఈ మహమ్మారి విస్తరణకు ప్రధాన హేతువులుగా ఉన్నాయని వైద్య నిపుణులు యశోద ఆసుపత్రి కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, హెపటాలజిస్ట్, అడ్వాన్స్ ఎండోస్కోపిస్ట్ డాక్టర్ గోపి శ్రీకాంత్ స్పష్టం చేశారు. సోమవారం ఒక ప్రైవేటు అతిథి భవనంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ప్రముఖ వైద్యులు గోపి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రాణాంతక మహమ్మారి క్యాన్సర్ వ్యాధి నుంచి రోగులను రక్షించి, వారి ఆయుర్దాయం పెంచాలంటే వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం అత్యంత కీలకమైన అంశం అని, ముఖ్యంగా వృద్ధులు తమ ఆరోగ్య విషయం భారతదేశ వ్యాప్తంగా, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జీర్ణాశయ (గ్యాస్ట్రో ఇంటెస్టినల్) క్యాన్సర్లు ప్రజారోగ్యానికి తీవ్ర సవాలుగా తయారయ్యాయి అన్నారు.ఇటీవల కాలంలో ఆహారనాళం, కడుపు, పెద్దపేగు, మలాశయం, కాలేయం, పిత్తాశయం, క్లోమగ్రంథి సంబంధిత క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుందని, మారుతున్న ఆధునిక జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పొగాకు వినియోగం, మద్యపానం, స్థూలకాయం తదితర పర్యావరణ కారణాలే ఈ మహమ్మారి విస్తరణకు ప్రధాన హేతువులుగా వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండా అకస్మాత్తుగా బరువు తగ్గడం, ఆకలి మందగించడం, నిరంతరంగా కడుపునొప్పి వేధించడం, నల్లటి రంగులో మలవిసర్జన జరగడం, మలంలో రక్తం పడటం, ఆహారం మింగడంలో ఇబ్బంది తలెత్తడం, తరచూ వాంతులు కావడం, కామెర్లు రావడం, కడుపులో గడ్డలు ఏర్పడటం లేదా రక్తహీనత వంటి ప్రమాదకర హెచ్చరిక లక్షణాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఇలాంటి అనారోగ్య సూచనలు కనిపించిన తక్షణమే వైద్య నిపుణులను సంప్రదించి అవసరమైన అన్ని రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను తొలి దశలోనే పసిగట్టగలిగితే ఎండోస్కోపీ, శస్త్రచికిత్స, కీమోథెరపీ, ఇమ్యూనోథెరపీ, రేడియేషన్ థెరపీ, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ వంటి అత్యాధునిక వైద్య విధానాల ద్వారా వ్యాధిని సమర్థవంతంగా నయం చేయవచ్చని భరోసా ఇచ్చారు. యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో గోదావరి ప్రాంతమైన దిండిలో జీఐపీఎస్ జీఐ ఆంకాలజీ నిరంతర వైద్య విద్యా (సీఎంఈ) కార్యక్రమాన్ని గతంలో నిర్వహించామన్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు మరింత చేరువగా ఆధునిక వైద్య సేవలను అందించే లక్ష్యంతో కాకినాడ నగరంలో ప్రతి నెలా రెండవ సోమవారం యశోద ఆసుపత్రి నిపుణులైన వైద్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యశోద హాస్పిటల్ ప్రతినిధులు జి సంతోష్ కుమార్, డీజీఎం ఎస్ వి వి రామకృష్ణ, ఏపీ మార్కెటింగ్ మేనేజర్ అభిరామ్ రెడ్డి పాల్గొన్నారు.

## రాజ్యసభ అభ్యర్థిగా సానా సతీష్ నామినేషన్ దాఖలు



**కాకినాడ రూరల్, జూన్ 08(ప్రభాతవార్త):** తెలుగు దేశం పార్టీ తరపున రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా సానా సతీష్ సోమవారం అమరావతి అసెంబ్లీ భవనంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్. వనితా రాణికి ఆయన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ నామినేషన్ ప్రక్రియలో ప్రతిపాదకులుగా చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), తంగిరాల సౌమ్య సంతకాలు చేశారు. రాజ్యసభ అభ్యర్థిగా సానా సతీష్ రెండు సెట్ల నామినేషన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎం. అఖిల్ కుమార్, పి. విజయ కుమారి తో పాటు కూటమి నేతలు శాసనసభ్యులు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), వరుపుల సత్యప్రభ, బండారు సత్యానందరావు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ నిరశన గళం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్8,ప్రభాతవార్త.** కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల నిర్వహణ – అభ్యర్థుల ఎంపికలో అనేక అవకతవకలు జరిగాయని వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కూటమి ప్రభుత్వంపై నిరశనను వ్యక్తం చేశారు.జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి డేవిడ్ అధ్యక్షతన నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో అమలాపురంలో ఈనిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ నియామక ప్రక్రియలో చోటుచేసుకున్న పరిణామాలు సాధారణ పరిపాలనా లోపాలు కావని ఒక పద్ధతి ప్రకారం అర్హులను పక్కనపెట్టి, అనర్హులకు కేటాయించేలా కుట్రలు జరిగాయని ఆరోపించారు.ఈ అక్రమాలకు నిరసనగా గౌరవప్రదంగా డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం నియామకాల్లో జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, మాజీ ఎంపీ చింతా అనురాధ, గన్నవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ,రామచంద్రాపురం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్,,మండలాల అధ్యక్షులు బద్రి బాబ్జి,గుత్తుల చిరంజీవి,రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి సరేళ్ళ రామకృష్ణ, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి ఉండ్రు బాబ్జి,దాసరి అరుణకుమారి డేవిడ్, తదితరులు పాల్గొన్నారు

# తారకరామ నగర్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు.

## -ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 8( ప్రభాతవార్త)** నగరంలోని తారకరామ నగర్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎమ్మెల్సీ సోము వీర్రాజు కూటమి నాయకులు నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా ను కలిసి నగరంలో అభివృద్ధి పనులు పెండింగ్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. గత కాలంగా తారకరామ నగర్ ప్రాంతంలో కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యపై విస్తృతంగా చర్చించారు. ఆయా ప్రాంతాల్లో నిర్మించాల్సిన మేజర్ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల మధ్య సమన్వయం అవసరం అని సూచించారు. ముఖ్యంగా నేషనల్ హైవే అథారిటీ, ఓ ఎన్ జి సి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పరస్పర సహకారంతో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని అభిప్రాయపడ్డారు. రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నగరంలో చేపట్టవలసిన మౌలిక వసతుల అభివృద్ధి పనులు వాటి ఆర్థిక ఆమోదాలు నిధుల కేటాయింపు ప్రగతిపై కమిషనర్ తో సమీక్షించారు. నగర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై సమన్వయంతో ముందుకు సాగాలని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా నాయకులు అధికారం కోరారు. ఈనెల 10వ తేదీన వీఆర్పురం ఇండోర్ స్టేడియం శంకుస్థాపన కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో వాటిపై ఏర్పాట్లపై చర్చించారు.

# మన్యం దేవకుమార్ సత్తిరాజు మృతి తీరని లోటు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



**అడ్డతీగల,జూన్ 08, ప్రభాతవార్త** ఏజెన్సీ ప్రాంతంలో మంచి క్రైస్తవ సేవకునిగా, ఉత్తమ ఉపాధ్యాయునిగా గుర్తింపు పొందిన మన్యం దేవకుమార్ సత్తిరాజు మృతి తీరని లోటని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్పర్సన్, స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు.అడ్డతీగల మండలం మల్లవరం మామిళ్ళ గ్రామానికి చెందిన పాస్టర్ మన్యం నిస్సీ కుమార్ తండ్రి అయిన దేవకుమార్ (80) వృద్ధాప్య సమస్యలతో సోమవారం ఉదయం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శిరీషాదేవి మల్లవరం మామిళ్ళ గ్రామానికి చేరుకుని, దేవకుమార్ భౌతికకాయానికి పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవకుమార్ ఏజెన్సీ ప్రాంతంలో అందించిన సేవలను ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. ఆయన ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారని, అలాగే క్రైస్తవ పరిచర్యలో ఆయన చేసిన సేవలు అమోఘమైనవని కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఎమ్మెల్యే శిరీషాదేవి కన్నీటి పర్యంతమయ్యారు. శోకసంద్రంలో ఉన్న ఆయన కుమారుడు పాస్టర్ నిస్సీ కుమార్, ఇమ్మాన్యుయేల్‌లను ఓదార్చి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దేవకుమార్ గారు ఏజెన్సీ ప్రజలకు చేసిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నానుమిరియాల శిరీషాదేవి, ఎమ్మెల్యే అన్నారు ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, క్రైస్తవ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొని మృతునికి నివాళులర్పించారు.

# పరిమితికి మించి.. ప్రమాదం పొంచి...



**యు.కొత్తపల్లి, జూన్ 8(ప్రభాతవార్త) :**'పరిమితికి మించి' ప్రయాణించే లోడు లారీలతో 'ప్రమాదం పొంచి' ఉందని మండలంలోని కొండెవరం, వాకతిప్ప, కొత్తపల్లి, ఉప్పాడ తదితర గ్రామాల ప్రజలు, స్థానికులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. కాకినాడ రూరల్ మండలం సూర్యారావు పేట నుంచి అన్నవరం వరకు నిర్మించే సాగరమాల రోడ్డు నిర్మాణం శరవేగంగా జరుగుతుంది. కొత్తపల్లి మండలంలో రోడ్డు నిర్మాణానికి మెటీరియల్ తరలించే లారీలు ఎత్తుకు మించి లోడుతో తరలిస్తున్నారు. దీంతో లారీల్లోని బూడిద గాలికి, స్థానికులు, ప్రయాణీకులు కళ్ళల్లో దుమ్ము పడుతుందని వాపోతున్నారు. లారీ వెనకే మరో లారీ రయ్.. రయ్.. మంటూ దూసుకెళ్లడంతో ఇబ్బందులు వర్ణనాతీతం. నిబంధనలు ప్రకారం లోడు తరలిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవంటున్నారు. అధిక పరిమాణంలో పరిమితికి మించి లోడు తరలించే లారీల పై నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.

# అంతర్వేది నరసింహుని ఆలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవము....



**సఖినేటిపల్లి జూన్ 8, ప్రభాత వార్త:**డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ ఆవరణలో మొదటి రోజు అంతర్జాతీయ యోగా దినోత్సవము ను వైభవంగా నిర్వహించినారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారము ది. 2026 జూన్ 8 నుండి 2026 జూన్ 21,వ తేది వరకు ప్రతీ రోజు ఉదయము గం.06-30 ని.ల నుండి గం.7.30 ని.ల వరకు యోగా కార్యక్రమము చేయిదరని అసిస్టెంట్ కమీషనర్ ఏం కే టి నాగవర ప్రసాదు తెలియజేశారు. కావున ఆసక్తి గల భక్తులు యోగలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ పరివేక్షకులు పి విజయ సారధి, ఎస్ ఏ సత్యకిరణ్, నరసింహ, ఆలయ అన్నదాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# వీడియో ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్లు ఆర్థిక సహాయం అందజేత...



**సఖినేటిపల్లి జూన్ 8, ప్రభాత వార్త:** అనారోగ్యంతో బాధపడుతున్న మలికిపురం మండల అసోసియేషన్ సభ్యుడు అనారోగ్యం తో బాధపడుచున్న ఉపేంద్ర కు రాజోలు మండలం ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ తరుపున 11 వేల రూ.లు, మలికిపురం మండల పోటోగ్రాఫర్స్ 17,500 రూ.లు, సఖినేటిపల్లి మండలం నుండి 6 వేలు రూ.లు, మొత్తం 34,500 రూ.ల ఆర్థిక సహాయంను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సి వి రావు, అధ్యక్షులు సాయి కృష్ణ, ప్రసాదు, శ్రీను, కార్యదర్శి నాగబాబు, రాయుడు ప్రసాద్, బాబు, మీనన్, కుమార్, రవితేజ, కేశవ, సతీష్ ప్రసాద్, పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలకు 'నవచేతన' యాప్‌పై అవగాహన

## -సీడీపీవో క్రాంతికుమారి పర్యవేక్షణలో శిక్షణ కార్యక్రమం



**అడ్డతీగల, జూన్ 08, ప్రభాతవార్త** అడ్డతీగల ఐసిడియస్ ప్రాజెక్ట్ పరిధిలో ఆరు సంవత్సరాల లోపు చిన్నారుల ఆరోగ్య వివరాలను స్క్రీనింగ్ చేసేందుకు ఏఐ సాంకేతికతతో రూపొందించిన నవచేతన యాప్‌పై సోమవారం అడ్డతీగల మండలం ఎల్లవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్ట్ సీడీపీవో క్రాంతికుమారి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు యాప్ వినియోగంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడియస్ సూపర్‌వైజర్లు సుందరి, బాపనమ్మ, స్వర్ణలత మాట్లాడుతూ.. చిన్నారుల్లో వచ్చే ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఈ నవచేతన యాప్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ యాప్ ద్వారా ముఖ్యంగా 4-ఇలుగా పిలిచే సమస్యలను ఆరోగ్య శాఖ సమన్వయంతో ఈసీడీ స్క్రీనింగ్ ప్రక్రియ ద్వారా గుర్తించవచ్చని వివరించారు. పుట్టుకతో వచ్చే లోపాలుస్పోషకాహార లోపాల అనారోగ్య సమస్యలు వ్యాధులు డెవలప్‌మెంట్ డిలేస్ ఎదుగుదల లోపాలుఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలిచిన్నారుల్లో 80 శాతం మెదడు ఎదుగుదల మొదటి 3 సంవత్సరాలలోనే, అలాగే 90 శాతం ఎదుగుదల 6 సంవత్సరాల వయస్సు లోపే జరుగుతుందని సూపర్‌వైజర్లు గుర్తుచేశారు. దీనికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూనే, నవచేతన యాప్ ద్వారా నిరంతరం స్క్రీనింగ్ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించారు. ఈ శిక్షణ పూర్తి కాగానే కార్యకర్తలందరూ తమ పరిధిలోని గ్రామాల్లో స్క్రీనింగ్‌పై హౌస్ విజిట్స్ ఇంటింటి సర్వే నిర్వహించాలని, తద్వారా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించాలి జిల్లా కలెక్టర్ కు వినతి.



**తాళ్లరేవు, జూన్ 8 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా, తాళ్ళరేవు మండలం, చొల్లంగి పేట గ్రామంలో సుమారు 25 సంవత్సరాలుగా 5 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకూ కొనసాగుతున్న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలను యధావిధిగా కొనసాగించాలని, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు యడ్ల కుటుంబరావు ఆధ్వర్యంలో గురుకులం జిల్లా కోఆర్డినేటర్ రాజకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ హరేం ధీర ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గురుకులం పాఠశాల పై ఆధారపడి విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థుల పరిస్థితిని జిల్లా కలెక్టర్కు కుటుంబరావు వివరించారు. ప్రతి ఏడాది ఈ పాఠశాలల్లో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 500 మంది పేద విద్యార్థినులు చదువుకుంటున్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడినవారు, తల్లి తండ్రుల ఆదరణ లేని చిన్నారులు ఎంతోమంది స్కూల్ మీద ఆధారపడి ఉన్నారన్నారు.అలాంటి స్కూల్ ను ప్రస్తుతం ప్రభుత్వం ఐఐటీ, నీట్ అకాడమీ అదే స్కూల్ లో ఏర్పాటు చేసే ఆలోచన చేస్తుందని తెలిసిందని, ఐఐటీ, నీట్ అకాడమీ ఏర్పాటు చేసే కారణంతో 5 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకూ చదువుతున్న విద్యార్థులకు,ఆయా తరగతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం ఐఐటీ, నీట్ అకాడమీ ఏర్పాటు చేసే ఉద్దేశం ఉంటే అదనంగా బిల్డింగులు నిర్మాణము చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం. డి . యు. డబల్ యు,ఎ. సభ్యులు,స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ రొక్కం సత్యనారాయణ మూర్తి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొల్లి పద్మరాజు , తాళ్లరేవు మాజీ ఎంపీ. టి. సి .సభ్యులు బొంతు వీర మోహన్ తదితరులు పాల్గొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు కుటుంబరావు విలేకరులకు తెలిపారు. చొల్లంగి పేట డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల లో 5 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకూ చదువుకునే విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా స్కూల్ నడుస్తుందని, ఎవరూ ఆందోళన చెంద వద్దని కలెక్టర్ తెలిపారన్నారు. ఈ సందర్భంగా సహకరించిన పెద్దలకు,నాయకులకు, ప్రజా సంఘాల నాయకులకు,విద్యార్థినుల తల్లి తండ్రులకు కుటుంబరావు కృతజ్ఞతలు తెలిపారు.

# ఫిర్యాదుదారులతో అధికారులు నేరుగా మాట్లాడాలి

## -పిజిఆర్ ఎస్ లో 45 అర్జీలు స్వీకరణ-నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 8( ప్రభాతవార్త)** ఫిర్యాదుదారులతో అధికారులు నేరుగా మాట్లాడాలని అప్పుడే సమస్యకు నాణ్యమైన పరిష్కారం లభిస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పి జి ఆర్ ఎస్ లో కమిషనర్ ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. మొత్తం పిజిఆర్ఎస్లో 45 అర్జీలు రాగా వీటిలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 17 ,రెవెన్యూకి మూడు, టౌన్ ప్లానింగ్ కి ఆరు, పబ్లిక్ హెల్త్ కి రెండు ,వార్డు సచివాలయులకు సంబంధించి 16 ,అకౌంట్స్ విభాగానికి సంబంధించి ఒకటి అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కోసం ఎంతో ఆశతో నగరపాలక కార్యాలయానికి వస్తారని వారి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర సమాచారంతో నిర్దేశించిన గడువులోగా పరిష్కరించేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ, సెక్రెటరీ శైలజ వల్లి ,ఎస్ ఈ రీటా, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ అబ్దుల్ మాలిక్ ,రెవిన్యూ అధికారి సిహెచ్ శ్రీనివాసరావు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కౌలు రైతు కార్డుల రెన్యువల్ నిలిపివేత

## -ప్రభుత్వ రుణాలు , సబ్సిడీలకు దూరమవుతున్న కౌలు రైతులు -2025లో జారీ చేసిన కార్డుల గడువు ముగింపు




**కాట్రేనికోన, జూన్ 8: (ప్రభాతవార్త)** మండలంలో కౌలు సాగు చేస్తున్న రైతులకు జారీ చేసిన కార్డులు - పంట సాగు హక్కు పత్రాలు రెన్యువల్ కాకపోవడంతో కౌలు రైతులుతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2025లో 11 నెలల కాలపరిమితో జారీ చేసిన ఈ కార్డుల గడువు ముగియడంతో కౌలు రైతులు రెన్యువల్ కోసం వీఆర్వో ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నారు. కానీ సర్వర్/టెక్నికల్ ఇషఉ్య ఉందని కాట్రేనికోన విఆర్వో 2 కుమార్ చెప్తున్నారని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఇబ్బందులు: కౌలు కార్డు లేకుండా బ్యాంకుల్లో పంట రుణాలు, విత్తనాలు, ఎరువులపై సబ్సిడీ, రైతు భరోసా లాంటి పథకాలకు అర్హత రావడం లేదు. వర్షాకాలం పంటకు సిద్ధమవుతున్న ఈ సమయంలో కార్డులు లేకపోవడంతో అప్పుల పాలవుతున్నామని కౌలు రైతులు వాపోతున్నారు. "11 నెలలకే కార్డు ఇచ్చి, రెన్యువల్ చేసే సిస్టం రెడీ చేయకుండా వదిలేశారు. ఇప్పుడు టెక్నికల్ ఇషఉ్య అంటున్నారు. మా బతుకులు ఏంటి?" అని ఓ కౌలు రైతు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఆర్వో వివరణ: ఈ విషయంపై వీఆర్వో కుమార్, వివరణ కోరగా రెన్యువల్ ప్రక్రియ నిలిచిపోయిందని, అన్నారు.

# సారాబట్టీపై దాడి. సారాతో మహిళ అరెస్టు

**రాజవొమ్మంగి, జూన్ 08, ప్రభాతవార్త** సింగంపల్లి గ్రామ శివారున సారా బట్టీపై సోమవారం ఉదయం దాడి చేసినట్లు రాజవొమ్మంగి ఎస్. ఐ. వెంకట్రావు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. బెల్లం ఊట ను ధ్వంసం చేసి ఐదు లీటర్ల నాటుసారాతో వట్టిగడ్డ గ్రామానికి చెందిన సింగంపల్లి ఎర్రయ్యమ్మను పట్టుకొన్నామన్నారు. సారా ను సీజ్ చేసామన్నారు. కేసు నమోదు చేసి మహిళను అరెస్టు చేసామన్నారు. సారా సమాచారం ఉంటే 9440900765 కు ఫోన్ చేసి తెలుపవచ్చునని అన్నారు. సమాచారం తెలిపే వారి వివరాలు గొప్యంగా ఉంచుతామని అన్నారు.

# దేవరపల్లిలో జనసేన నూతన గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**దేవరపల్లి, జూన్ 8(ప్రభాతవార్త):** దేవరపల్లి గ్రామ జనసేన పార్టీ కమిటీ రెండేళ్ల పదవీకాలం పూర్తికావడంతో నూతన గ్రామ కమిటీని జనసైనికులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జనసేన పార్టీ సమావేశంలో కమిటీ ఎన్నికలను పూర్తి చేశారు. సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, సభ్యత్వ విస్తరణ, రాబోయే స్థానిక ఎన్నికలు, గ్రామ స్థాయిలో పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యలపై పోరాటం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికుల సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొండపల్లి రమేష్ బాబు, ఉపాధ్యక్షుడిగా కొడమంచిలి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శులుగా తంగెళ్ల గంగాధర్, అడబాల మణికంఠ, ఉప కార్యదర్శిగా దుగ్గిన లీలాకృష్ణ గంగాధర్, కోశాధికారిగా ఆకుల వీర్రాజు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సిద్ధ తాతబ్బాయి, జుట్టా సాయి, మన్నిన సతీష్, జోగి నాగరాజు, దుర్గాప్రసాద్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన గ్రామ అధ్యక్షుడు కొండపల్లి రమేష్ బాబు మాట్లాడుతూ గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి నెలా కమిటీ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తరించి, జనసైనికుల మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల పక్షాన నిలిచి పనిచేస్తామని తెలిపారు. అదేవిధంగా కమిటీ కార్యకలాపాల నిర్వహణ కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. గ్రామంలోని ప్రతి జనసైనికుడికి పార్టీ సమాచారం వేగంగా చేరేలా సోషల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తామని . పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలందరూ ఐక్యంగా పనిచేసి పార్టీ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ జాబితాను మండల అధ్యక్షుడు కాట్నం గణేష్ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజుకు అందజేశారు. వారి ద్వారా జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షులకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు, నూతన కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి..

## -మాదక ద్రవ్యాలు,మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి..సిఐ భీమరాజు..



**అంబాజీపేట,జూన్ 8, (ప్రభాతవార్త):** రోడ్డు ప్రమాదాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల జోలికి వెళ్ళవద్దని పి.గన్నవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ రుద్రరాజు భీమరాజు సూచించారు. మండలంలోని ముక్కామల లాకుల వద్ద ఉపాధి హామీ హక్కుదారులకు, స్థానికులకు సిఐ భీమరాజు అవగాహనా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ల ఆదేశాలతో కొత్తపేట డివిజన్ డిఎస్పి సుంకర మురళి మోహన్ రావు నేతృత్వంలో రోడ్డు ప్రమాదాలు నివారణ,మాదక, మత్తు పదార్థాలకు దూరంగా ఉండుట, సైబర్ నేరాలు,శక్తి యాప్, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. గృహోపకరణ వస్తువులను రిపేరు చేస్తామని, బంగారం,వెండి ఆభరణాలకు మెరుగులు దిద్దుతామని వంటి పలు కారణాలతో నేరగాళ్లు ఇంటింటికి వచ్చి కుటుంబ సభ్యుల సంఖ్యను తెలుసుకుంటున్నారన్నారు. ఒంటరి మహిళలను గుర్తించి, వారి నుంచి నగదు,నగలు,విలువైన వస్తువులు కాజేస్తున్నారని తెలిపారు. అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నట్లు సైబర్ నేరగాళ్లు బ్యాంకు సిబ్బందిలా నటిస్తూ ఓటిపి నెంబర్ చెప్పాలని అడిగితే తొందరపడి చెప్పొద్దన్నారు. మండల ముఖ్య కూడలిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎవరైనా అనుమానితులు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అంబాజీపేట,ముక్కామల సెంటర్లలో రాత్రిపూట పోలీసులను నిలుపుతామన్నారు. పి.గన్నవరం సర్కిల్ పరిధిలోని అంబాజీపేట, అయినవిల్లి, పి.గన్నవరం, మామిడికుదురు మండలాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐ రుద్రరాజు భీమరాజు కోరారు. ఆయన వెంట అంబాజీపేట ఏఎస్ఐ కె.గోపి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ప్రపంచ తెలుగు మహాసభల్లో కొత్తపేట కవులకు సత్కారం



**కొత్తపేట,జూన్08,(ప్రభాతవార్త)** రాజమహేంద్రవరంలో గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ అధినేత కె వి వి సత్యనారాయణ రాజు అంతర్జాతీయ శ్రీ శ్రీ కళా వేదిక అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ కుమార్ సంయుక్త నిర్వహణలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు కొత్తపేట కళాసాహితి తరపున అద్దంకి బుద్ధ చంద్ర దేవ్ జినిపె భీమారావు ఖాజా మొహిద్దీన్ ముషిణి సురేష్ కోటిపల్లి రామకృష్ణ పోలిశెట్టి మాచర రావు కవితా పఠన విభాగానికి హాజరై తమ కవితలు వినిపించారు తెలుగు ప్రాచుర్యాన్ని ప్రాముఖ్యతను ఇనుమడింప చేసిన వారి కవితలకు మిర్చి నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు అంతరం పుస్తకావిష్కరణల విభాగంలో అద్దంకి బుద్ధ చంద్రదేవ్ రాసిన బుద్ధ శోధన జ్ఞాన సాధన దీర్ఘ కవిత పర్యావరణ పరిరక్షకులందరూ బౌద్ధులే పరిశోధనా వ్యాసం లేత హృదయాల్లో బుద్ధోదయం ఎలా సమాలోచన అన్న బహు విషయ గ్రంథాన్ని జిజియు అధినేత చైతన్య రాజు ఆవిష్కరించారు

# రాజ్యసభ అభ్యర్థులను సత్కరించిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, జూన్ 08,(ప్రభాతవార్త)** సోమవారం జరిగిన రాజ్యసభ నామినేషన్ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు ఈ సందర్భంగా టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు సానా సతీష్ భాష్యం రామకృష్ణ చింతకాయల విజయ్‌ల ను శాలువాతో సత్కరించి వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి చిత్రపటం ప్రసాదాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొని తన మద్దతు ప్రకటించారు.

# భూమి ఆరోగ్య పరిరక్షణతోనే రైతు అభివృద్ధి

## -జేగురుపాడులో 'ఖేత్ బచావో అభియాన్' అవగాహన కార్యక్రమం



**కడియం , జూన్ 8 (ప్రభాతవార్త)** కడియం మండలంలోని జేగురుపాడు గ్రామంలో "ఖేత్ బచావో అభియాన్" (భూమిని కాపాడుదాం -- రైతును బలోపేతం చేద్దాం) కార్యక్రమాన్ని సోమవారం మండల వ్యవసాయ అధికారి పి.వి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా సిఫారసు చేసిన మేరకే ఎరువులు వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చని రైతులకు వివరించారు. భూమి సారాన్ని కాపాడేందుకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. రాజమహేంద్రవరం సహాయ వ్యవసాయ సంచాలకులు కె. సూర్య రమేష్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు, జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని, పంట అవశేషాలను కాల్చివేయకుండా భూమిలో కలిపి దున్నాలని సూచించారు. అలాగే నీటి వనరులను పొదుపుగా వినియోగించడం ద్వారా స్థిరమైన వ్యవసాయం సాధ్యమవుతుందన్నారు. అనంతరం ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి, ఏ.పి.ఏ.ఐ.ఎం.ఎస్. యాప్ ద్వారా రైతులకు యూరియా, డి.ఏ.పి. ఎరువుల సరఫరా, అమ్మకాల విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రేమ్ చంద్, వేణుమాధవరావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు రాజా రమేష్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన రాజేష్



**మామిడికుదురు.జూన్ 08(ప్రభాతవార్త)** మామిడికుదురు మండలం, అప్పన్నపల్లి గ్రామంలో ఇటీవల వడదెబ్బకు గురై మృతి చెందిన ఆకుమర్తి వెంకటేశ్వరరావు కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి, పి.గన్నవరం నియోజకవర్గ ఇంచార్జి నేదునూరి రాజేష్ మాదిగ సోమవారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. భాధిత కుటుంబానికి సత్వరమే న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# ప్రతీ ఓటు క్షుణ్ణంగా పరిశీలించి లోపాలపై అధికారులకు పిర్యాదు చేయాలి .

## -ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి -రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్,ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



**రాజవొమ్మంగి, జూన్ 08, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం టిడిపి పార్టీ బూత్, క్లస్టర్ ఇంచార్జీలకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఏ. యం. సి చైర్మన్ లోతా లక్ష్మణరావు సౌజన్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ ప్రతీ ఓటు ను పరిశీలించి, లోపాలు ఉంటే వెంటనే అధికారులకు తెలుపాలన్నారు. బూత్ స్థాయి అధికారులు బి. యెల్. ఓ లు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా పరిశీలన చేశారా లేదా అనే విషయంపై అవగాహన ఉండాలన్నారు. ఓటరు జాబితా ప్రకారం ఓటరు ఆ గృహంలో ఉండే కూడా తొలగించినా, లేదా వేరే బూత్ లోకి మార్చినా వెంటనే సరిచేసుకోవాల్సిన అవశ్యకత పై అవగాహన చేశారు. అలాగే ఒకే ఓటరు పేరు రెండు లేదా మూడు చోట్ల ఉంటే వాటిని గుర్తించి వాస్తవంగా ఏ బూత్ లో ఉండాలో అక్కడే ఉంచి మిగిలిన అదనంగా ఉన్న వాటిని తొలగించే ప్రక్రియపై ఎలా ఉండాలో తెలియజేశారు. అలాగే 18 సం"లు దాటిన వారిని కొత్తగా ఓటరుగా నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నకిలీ ఓటర్లపై చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దానికి గాను క్లస్టర్ ఇంచార్జిలు, బూత్ ఇంచార్జీలు స్థానికంగా అవగాహన ఉన్న మన పార్టీ పెద్దలతో ఓటర్ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. దానిలో గుర్తించిన లోపాలను సంబంధిత అధికారులకు చెప్పి చేర్పులు మార్పులు చేయించాలన్నారు. దీనిలో అప్రమత్తంగా లేకపోతే ఓట్లు గల్లంతయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతీ క్లస్టర్, బూత్ ఇంచార్జీలు చాలా పకడ్బందీగా దీనిని నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏ. యం. సి.చైర్మన్ లోతా లక్ష్మణరావు, రాజవొమ్మంగి సొసైటీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జి ముప్పన కేశవ్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, తెదేపా నాయకులు గణజాల తాతారావ్, ఏ. యం. సి. డైరెక్టర్ గట్టి మాణిక్యం, బూత్ ఇంచార్జిలు నూకరాజు , ముర్ల వీరబాబు, చవల కుమార్, తేజ, చలుమర్తి బన్ను పాల్గొన్నారు.

# మంచానికే పరిమితమైన వికలాంగులకు పించను ఇప్పించండి

## (ప్రజావాణి కలెక్టర్ కు అర్జీ )



**రాజవొమ్మంగి, జూన్ 08, ప్రభాతవార్త** పోలవరం జిల్లాలో గల అన్నిమండలాల్లో మంచానికే పరిమితమైన దివ్యాంగులను సర్వేలో గుర్తించి వారికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వచ్చేలా సహకారం అందించాలని సోమవారం రంపచోడవరం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు రాజవొమ్మంగి మండల టిడిపి అధ్యక్షులు, ఏ. పి. ఐ. ఐ. సి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు అర్జీని ఇచ్చారు. గ్రామాల్లో సర్వే చేసి నివేదికను ఇవ్వాలని జిల్లా వైద్యాధికారిణి డా. సరితకు కలెక్టర్ ఆదేశించారు. మండలం లో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షణలో ఉపాధిహామీ పథక సహాకారంతో చేపట్టిన రహదారుల పనుల అసంపూర్తిగా ఆగిపోయాయని మరొక అర్జీని పెద్దిరాజు ఇచ్చారు. రాజవొమ్మంగి శాంటినగర్ నుండి వయ్యాడ, బొరుగుపల్లి రోడ్డు, కిమ్మలగెడ్డ..అమ్మిరేకుల రోడ్డు, ఆర్ అండ్. బి. రోడ్డు నుండి డి. మల్లవరంరోడ్డు, అనంతగిరి రోడ్లు అసంపూర్తిగా ఆపి వేశారని అన్నారు. రాజవొమ్మంగి శాంతినగర్ బ్రిడ్జి, ఎర్రంపాడు బ్రిడ్జి అవసరమని కోరారు. వర్షాకాలం వస్తే కనీసం బయటకు నిత్యావసర వస్తువులకు రాలేని పరిస్థితులను గిరిజనులు ఉంటున్నారని పెద్దిరాజు సమస్యను తెలిపారు.

# గాది మాణిక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



**యు.కొత్తపల్లి, జూన్ 8 (ప్రభాతవార్త) :** మండలంలోని కొండెవరం గ్రామానికి చెందిన గాది మాణిక్యం ఫౌండేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు గాది గంగబాబు ఆధ్వర్యంలో గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. వైఎస్ఆర్ సిపి తరపున అండగా ఉంటామన్నారు. పరామర్శించిన వారిలో వైఎస్ఆర్ సిపి మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మేడిశెట్టి శ్రీరాములు, వెంగళి సుబ్బారావు, ఇంటి బాబ్జి, గాది గోవిందు, గాది నూకరాజు, బోడపాటి రాజేష్, గొర్ల సూరిబాబు, గుత్తుర్తి గోవి[illegible] తదితరులు ఉన్నారు.

మరిన్ని వార్తలు 6లో

# పని భారం తగ్గించాలి..మండల వీఆర్వోల సంఘం డిమాండ్..



అంబాజీపేట,జూన్ 8, (ప్రభాతవార్త): రెవెన్యూ శాఖలో గ్రామ అధికారుల పైన తమపై మోపుతున్న పని భారాన్ని తగ్గించాలని మండల వీఆర్వోల సంఘం డిమాండ్ చేసింది. వివిధ సర్వేల పేరుతో వీఆర్వోలపై అధిక ఒత్తిడి పెట్టడంతో ఆందోళనకు గురై మృత్యువాత పడుతున్నామని మండల వీఆర్ఓల సంఘం అధ్యక్షుడు గిడ్డి వెంకటరమణ ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతి రెవెన్యూ అసోసియేషన్ జేఏసీ పిలుపు మేరకు అంబాజీపేట రెవెన్యూ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించిన వీఆర్వోలు సోమవారం నిరసన చేపట్టారు. పని ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డ కర్నూలు జిల్లా వెంకయ్యపల్లి వీఆర్ఓ మహమ్మద్ హుస్సేన్ మరణానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహమ్మద్ హుస్సేన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. వీఆర్ఓలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గుత్తుల నాగలక్ష్మి, ఇసుకపూడి వివి రమేష్, జి.కోమలి,సి. కనకమహాలక్ష్మి, సీత, వెంకటేశ్వరరావు, రమణ, బొంతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ నృసింహుని సేవలో హైకోర్ట్ జడ్జ్ లు..



సఖినేటిపల్లి జూన్ 8, ప్రభాత వార్త: డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,సఖినేటిపల్లి మండలం, అంతర్వేది గ్రామంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని పాట్నా హైకోర్ట్ జస్టిస్ ఎ అభిషేక్ రెడ్డి, త్రిపుర హైకోర్ట్ జస్టిస్ ఎస్.రామచంద్ర రావు కుటుంబ సమేతముగా దర్శించుకొన్నారు. వారికి ఆలయ అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికి, శ్రీ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించినారు. వేద పండితులచే వేదాశీర్వచనం అందించినారు. వారికి ప్రసాదం, చిత్రపటం ను ఆలయ అసిస్టెంట్ కమీషనర్ ఏం కె టి నాగరం ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమములో రెవెన్యూ, పోలీస్, కోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వీఆర్వో మృతి పై ఆత్రేయపురం రెవిన్యూ సిబ్బంది నిరసన.



ఆత్రేయపురం, జూన్ 08.(ప్రభాత వార్త). విధి నిర్వహణలో కర్నూలు నగరపాలక సంస్థ వీఆర్ఓ, మహమ్మద్ హుస్సేన్ పని ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న వీఆర్వో మృతిపై సోమవారం ఆత్రేయపురం రెవిన్యూ సిబ్బంది నిరసన తెలిపారు. కర్నూలు నగరపాలక సంస్థ వీఆర్ఓ మహమ్మద్ హుస్సేన్ పని ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. ఇది సర్కారు హత్య అని, రెవెన్యూ సిబ్బందిపై పని ఒత్తిడి తగ్గించాలని వీఆర్వో కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆత్రేయపురం మండల పరిధిలోని 17 గ్రామాల రెవెన్యూ సిబ్బంది మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. వీఆర్వో ఆత్మహత్యకు బాధ్యులైన వారిని పై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మండల అధ్యక్షుడు కొత్తిరి బాబు సెక్రటరీ సురేష్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో గ్రామ సర్వేయర్ హేమంత్, వీఆర్ఏ లోవరాజు మండల పరిధిలోని 17 గ్రామాలకు చెందిన వీఆర్వోలు గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

# పలువురికి జెడ్పిటిసి సాగర్ సహాయం.



తాళ్లరేవు, జూన్ 8 (ప్రభాతవార్త):తాళ్లరేవు మండలం ఉప్పంగల గ్రామంలో ఇటీవల అకాల మరణం చెందిన దడాల చంద్రరావ్ కుటుంబాన్ని జడ్పీటీసీ సాగర్ సోమవారం పరామర్శించారు. ఆమె కుమారుడు దడాల సుబ్రహ్మణ్యం కుటుంబానికి 25 కేజీల రైస్ ప్యాకెట్ అందజేశారు. అదే విధంగా రోడ్డు ప్రమాదంలో మరణించిన పులపకూర శ్రీను కుటుంబానికి 25 కేజీల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో ఉప్పంగల మాజీ సర్పంచ్ శాఖ శంకరుడు, వైకాపా నాయకులు చిట్టూరి చలపతి, స్థానికులు పాల్గొన్నారు.

# రైలు ప్రమాద మృతుని కుటుంబానికి అండగా జనసేన



యు.కొత్తపల్లి, జూన్ 8(ప్రభాతవార్త) మండలంలోని ఉప్పాడకు చెందిన తిరంశెట్టి సీమోను ఇటీవల రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు గుడివాడ సమీపంలో జారిపడి మృతి చెందడం తన కుటుంబానికి తీరని లోటని జనసేన పార్టీ మండల అధ్యక్షులు రావు అక్షయ్ సానుభూతిని వ్యక్తం చేశారు. సోమవారం ఉప్పాడలోని సీమోను కుటుంబ సభ్యులను జనసేన పార్టీ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆర్థిక సహాయం అందజేశారు. సీమోను జనసేన పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో బీమా ప్రయోజనాలు త్వరితగతిన అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొండెవరంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో ఉప్పాడ, పొన్నాడ, కొండెవరం గ్రామ జనసేన పార్టీ ఇంచార్జులు గంటా విజయ్ కుమార్, పల్లేటి బాపన్న దొర, మేడిశెట్టి మణికంఠ తదితరులు ఉన్నారు.

# సేవా భూషణ్ పురస్కారంతో డాక్టర్ దండు బోయిన సుజాతకు ఘన సత్కారం



కడియం జూన్ 8(ప్రభాతవార్త) రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా చైతన్య పౌరసత్వ పరిషత్ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రకాష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, యూనివర్సిటీ చైర్మన్ సత్యనారాయణ రాజు, ఆచార్య పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ మునుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అంకితమైన ఈ మహాసభల్లో సామాజిక, సాహిత్య, సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన డాక్టర్ దండు బోయిన సుజాతకు ప్రతిష్టాత్మక "సేవా భూషణ్" పురస్కారాన్ని ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు.ఆచార్య పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం స్వర్ణ పతక గ్రహీత అయిన డాక్టర్ సుజాత వివిధ రంగాల్లో అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందజేశారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు.డాక్టర్ సుజాతకు ఈ ప్రతిష్టాత్మక పురస్కారం లభించడం పట్ల బుర్రిలంక గ్రామ ప్రజలు, సాహితీ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి పత్రిక ఎడిటర్ పి కృష్ణ, కేతా శ్రీనివాసరావు, యూనివర్సిటీ ప్రతినిధులు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.

# వేసవి శిబిరంలో విద్యార్థులకు బహుమతులు



తాళ్లరేవు, జూన్ 8 (ప్రభాతవార్త): గ్రంథాలయ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న వేసవి శిబిరం ముగింపు సందర్భంగా ప్రతిభ చాటిన చిన్నారులకు ఎంపీడీఓ సత్యనారాయణ ఈఓపీఆర్డీ జె.వి.రమణ బహుమతులు అందజేశారు. ఆంధ్ర ప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉత్తర్వుల ప్రకారం ఏప్రిల్ 28 నుండి శాఖా గ్రంథాలయం కోరంగిలో వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తాళ్లరేవు మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ ,డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి, కోరంగి పంచాయతీ ప్రత్యేక అధికారి రమణ, కోరంగి పంచాయతీ సెక్రటరీ ప్రెసిడెంట్ కొప్పిశెట్టి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కనిశెట్టి శ్రీనివాస్, రిటైర్డ్ లైబ్రేరియన్ పైడి రాజు,గ్రామ పెద్దలు చంటి, రామకృష్ణ , తాతాజీ ,వాసు , చిన్నా , యశ్వంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

# భూమిని తొలగించి ఆదుకోండి మహాప్రభో..!

## -గ్రీవెన్స్ లో నిరుపేద కూలి ఆవేదన



గొల్లప్రోలు,జూన్ 8(ప్రభాత వార్త) తన పేరుపై రెవిన్యూ రికార్డుల్లో నమోదైన 18 ఎకరాల భూమిని తొలగించి ఆదుకోండి మహాప్రభో అంటూ ఒక నిరుపేద కూలి సోమవారం గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో అధికారుల ముందు మొరపెట్టుకున్నాడు.మండల పరిధి ఏకే మల్లవరం గ్రామానికి చెందిన అట్టడ వీర వెంకటరమణ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.వీర వెంకట రమణకు ఇద్దరు మగ పిల్లల సంతానం కాగా వీరు 4వ తరగతి,7వ తరగతి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు.వీరికి గత వైసిపి ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం మంజూరు కాగా,ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం పథకం వర్తించకపోవడంతో వీర వెంకటరమణ గ్రామంలో సచివాలయానికి వెళ్లి వాకాబు చేయగా తన పేరుపై గొల్లప్రోలులో 18 ఎకరాల భూమి ఉన్నట్లు రెవిన్యూ రికార్డులలో చూపిస్తుందని అందువల్ల తల్లికి వందనం పథకం వర్తించలేదని తెలిపారు.దీంతో ఆశ్చర్యానికి గురైన వీర వెంకట రమణ తాతల కాలం నాటి నుండి తమకు ఒక సెంటు భూమి కూడా లేదని రెక్కాడితే గాని డొక్కాడని తనకు ఒక్కసారిగా 18 ఎకరాలు భూమి ఎలా వచ్చిందని సచివాలయం సిబ్బందిని ప్రశ్నించగా తహసిల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అప్పటి నుండి నేటి వరకు తన పేరున నమోదైన 18 ఎకరాల భూమిని తొలగించాలని రెవిన్యూ అధికారులు,సచివాలయం చుట్టూ సంవత్సర కాలంగా తిరుగుతున్న ఫలితం కనిపించలేదని వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశాడు.తహసిల్దార్ కార్యాలయానికి వెళ్తే వీఆర్వో,సర్వేర్ ను సంప్రదించాలనే వారని, సచివాలయానికి వస్తే మేము,నువ్వు చేసేది ఏమీ లేదు భూమి గల రైతు మాత్రమే ఆధార్ సీడింగ్ చేసుకుంటే నీ పేరు పై నమోదైన భూమి తొలగిపోతుందని సచివాలయం సిబ్బంది తెలిపారని అన్నాడు.భూమి తొలగింపు కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి,తిరిగి ఏడాది కాలం గడిచినప్పటికీ పని జరగలేదన్నాడు. తల్లికి వందనం పథకం కింద ఈనెల 12న ప్రభుత్వం సొమ్ములు విడుదల చేస్తుందని తెలిసి మళ్ళీ సచివాలయానికి వెళ్ళగా భూమి ఉండడంతో తనకు పథకం వర్తించలేదని తెలిపారని తన తాతల కాలం నుండి భూమిలేని తనకు 18 ఎకరాల భూమిని రెవిన్యూ రికార్డులో ఎలా చూపిస్తారని ప్రశ్నించాడు.తక్షణం తన పేరుపై ఉన్న భూమిని రెవిన్యూ రికార్డుల నుండి తొలగించి తనకు న్యాయం చేయాలని తహసిల్దార్ వెంకట భాస్కర్,ఎంపీడీవో సాలట్ రాజు,ఎంపీపీ అరిగెల అచ్చియమ్మా రామయ్య దొరను వేడుకొన్నాడు. రికార్డులు పరిశీలించిన తాహసిల్దార్ భూమి తొలగింపుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు

# మృగశిర కార్తె ప్రారంభం..

## - చేపల వినియోగానికి ఆరోగ్య ప్రాధాన్యం



కడియం, జూన్ 8 ( ప్రభాతవార్త) మృగశిర కార్తె ప్రారంభమైంది. తెలుగు రాష్ట్రాల్లో మృగశిర కార్తె రోజున చేపలు తినడం అనేది అనాదిగా వస్తున్న సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ ఆచారానికి ఆరోగ్యపరమైన కారణాలు కూడా ఉన్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.మృగశిర కార్తె ప్రారంభంతో సాధారణంగా రుతుపవనాలు ప్రవేశిస్తాయి. దీంతో వాతావరణంలో తేమ పెరగడం, ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకోవడం వల్ల జలుబు, దగ్గు, శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులు, ఉబ్బసం వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో శరీరానికి అవసరమైన పోషకాలను అందించే ఆహారం తీసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.చేపల్లో సమృద్ధిగా లభించే ఒమేగా--3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్--డి, ప్రొటీన్లు, ఐరన్, జింక్, అయోడిన్ వంటి పోషకాలు శరీర రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు మెదడు పనితీరు మెరుగుపడేందుకు కూడా దోహదపడతాయి.అందుకే మృగశిర కార్తె రోజున చేపలు తినడం కేవలం సంప్రదాయం మాత్రమే కాకుండా ఆరోగ్య సంరక్షణకు అనుసంధానమైన ఆహార అలవాటుగా భావిస్తారని పెద్దలు చెబుతున్నారు. వాతావరణ మార్పుల సమయంలో శరీరానికి అవసరమైన పోషకాలను అందించేందుకు చేపల వినియోగం ప్రయోజనకరమని ఆరోగ్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ పాలన ఫలితాలు ప్రజలకు వివరించాలి.



తాళ్లరేవు, జూన్ 8( ప్రభాతవార్త): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ ప్రధానిగా గత 12 సంవత్సరాలుగా దేశంలో చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ఆ పార్టీ తాళ్లరేవు మండల ఇంచార్జ్ దూడల శంకరనారాయణ అన్నారు. భారతీయ జనతా పార్టీ తాళ్లరేవు మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షులు యనమండ్ర విజయకుమార్ అధ్యక్షతన తాళ్ళరేవులో నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరనారాయణ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5వ తేదీ నుండి ప్రపంచ యోగా దినోత్సవం జూన్ 21వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాలలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాలన్నింటినీ మండల పార్టీ కార్యవర్గం విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరినట్లు మండల అధ్యక్షులు విజయ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి కొపనాతి దత్తాత్రేయ, జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి రొక్కాల సత్తిబాబు, ముమ్మిడివరం నియోజకవర్గ కో- కన్వీనర్ కరిమెల స్వామి హాజరయ్యారు. మండల ప్రధాన కార్యదర్శి అనుసూరి రాంబాబు, మండల ఉపాధ్యక్షులు పవన్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు అనంతలక్ష్మి, కుమార్ స్వామి. వి.నాని, కె. పద్మనాభం, ఆకుల గంగాధర్, రవి శర్మ, శివ, శ్రీరామ్, ప్రకాష్, స్వామి, చందు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్లకు 'నవచేతన' శిక్షణ

## - చిన్నారుల ఎదుగుదలకు కృత్రిమ మేధ సాయం... సిడిపిఓ పూర్ణిమ



జిల్లాజగ్గంపేట, జూన్ 8 (ప్రభాతవార్త)రాష్ట్రంలోని ఎంతో ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రతి చిన్నారి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రారంభించిన 'నవచేతన' కార్యక్రమంలో భాగంగా, పుట్టినప్పటి నుంచి ఆరేళ్ల లోపు పిల్లల ఎదుగుదలను కృత్రిమ మేధతో పరిశీలించే పద్ధతులపై అంగన్‌వాడీ టీచర్లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. సోమవారం జగ్గంపేట మండలంలోని 60 మంది టీచర్లకు రాజపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కిర్లంపూడి మండలంలోని 42 మంది టీచర్లకు బూరుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ నిర్వహించినట్లు శిశు అభివృద్ధి పథక అధికారిణి పూర్ణిమ తెలిపారు. ఈ శిక్షణలో 'నవచేతన' చరవాణి సాధనం ద్వారా పిల్లల ఎదుగుదలను శాస్త్రీయంగా అంచనా వేయడం, ఎదుగుదలలో జాప్యాలను తొలిదశలోనే గుర్తించే విధానాలపై అవగాహన కల్పించారు. వైద్యురాలు పూజ మాట్లాడుతూ, పిల్లల జీవితంలో తొలి వెయ్యి రోజులు అత్యంత కీలకమని, ఈ దశలో తగిన పోషణ, ఆరోగ్య సంరక్షణ, నేర్చుకునే అవకాశాలు కల్పిస్తే వారి భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని చెప్పారు. 'నవచేతన' ద్వారా పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, పోషకాహార లేమి, ఎదుగుదల జాప్యాలు, దివ్యాంగతలు అనే 4 రకాల సమస్యలను ముందుగానే గుర్తించి తగిన సేవలకు అనుసంధానం చేయవచ్చని వివరించారు. పెద్దాపురం శిశు అభివృద్ధి పథక అధికారిణి, శిక్షకురాలు ఉష మాట్లాడుతూ, 'నవచేతన' సాధనంతో పిల్లల పెద్ద కదలికలు, చిన్న కదలికలు, మాట నైపుణ్యం, తెలివి ఎదుగుదల, సామాజిక-భావోద్వేగ ఎదుగుదలను అంచనా వేయవచ్చని తెలిపారు. పరిశీలనలో గుర్తించిన పిల్లలను అవసరమైతే వైద్య సేవలకు, జిల్లా ప్రారంభ జోక్య కేంద్రానికి పంపుతామని చెప్పారు. పూర్ణిమ మాట్లాడుతూ, 'నవచేతన' అనేది కేవలం పరిశీలన సాధనం మాత్రమేనని, ఇది తుది నిర్ధారణ కాదని, తుది నిర్ధారణ వైద్య నిపుణులే చేస్తారని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారుల సమగ్ర అభివృద్ధి కేంద్రాలుగా బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో బూరుగుపూడి వైద్యురాలు అంజలి, పర్యవేక్షకులు అమ్మాజీ, సునీత, బూసమ్మ, కరీమున్నిసా, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాగునీటి కాలువల పనులు రైతులే చేపట్టాలి

## -టిడిపి పట్టణ అధ్యక్షుడు సుబ్బారావు



గొల్లప్రోలు,జూన్ 8,(ప్రభాతవార్త) సాగునీటి కాలువల తవ్వకం పనులు పారదర్శంగా జరగాలంటే రైతులతోనే చేయించాలని గొల్లప్రోలు టిడిపి పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు కోరారు. పట్టణ పరిధిలో నిర్వహించిన పలు ఇరిగేషన్ పనుల్లో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని వెల్లువెత్తుతున్న ఆరోపణల నేపథ్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులు కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఇరిగేషన్ పనుల్లో మొదటి ప్రాధాన్యత రైతులకు ఇవ్వాలన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనైనా రైతులు పనులు చేపట్టకపోతే ఆయా టీసీలకు తెలియపరచాలని వారి అభీష్టం మేరకు ఇతరులతో పనులు చేయించుకోవచ్చు అన్నారు. గొల్లప్రోలు పట్టణ పరిధిలో అన్ని సాగునీటి కాలవలకు పనులు చేపట్టాలని అన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం కాలువల ద్వారా శివారు ఆయకట్లకు సైతం నీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు.కాలువల పనులు చేయకుండా చేసినట్లు ఎవరి ఒత్తిడి తెచ్చిన బిల్లులు చేయవద్దని అధికారులు కోరారు.ఈ సమావేశంలో ఇరిగేషన్ ఏఈ పద్మజ, పి బి సి నీటి సంఘం అధ్యక్షుడు దువ్వ కొండబాబు, ఏలేరు నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఇంధన శ్రీను, మాజీ నీటిసం అధ్యక్షుడు కదారి బాబ్జి, మాజీ మున్సిపల్ చైర్మన్ శీరం మాణిక్యం,పలువురు కూటమి నాయకులు,రైతులు పాల్గొన్నారు.

# వీఆర్వో ఆత్మహత్యను నిరసిస్తూ తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన



గొల్లప్రోలు,జూన్ 8(ప్రభాత వార్త) అధికారుల వేధింపుల కారణంగానే కర్నూలు జిల్లా వెంకయ్య పాలెం వీఆర్వో మహమ్మద్ హుస్సేన్ ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ సోమవారం గొల్లప్రోలు తహసిల్దార్ కార్యాలయం వద్ద పలువురు వీఆర్వోలు ఆందోళన వ్యక్తం చేశారు.వెంకయ్యపాలెం విఆర్ఓ హుస్సేన్ డిస్క్ ఆపరేషన్ చేయించుకుని అనారోగ్యంగా ఉన్నప్పటికీ అధికారుల అదనపు బాధ్యతలు అప్పగించి వేధించడంతోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఆర్వోలుపై వేధింపులు మానుకోవాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల మాత్రమే విధుల్లో కొనసాగేలా రెవిన్యూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయాలన్నారు.వీఆర్వోలను మానసికంగా వేధించే అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని అలాగే సెలవు రోజుల్లో వీఆర్వోలతో పరిపాలన పరమైన ఎటువంటి పనులు చేయించరాదని కోరారు.వెంకయ్య పాలెం విఆర్ఓ మహమ్మద్ హుస్సేన్ మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గొల్లప్రోలు మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు పరమేశ్వర రాజు,కార్యదర్శి పెదిరెడ్ల పద్మ శేఖర్, వీఆర్వోలు వైయస్ మాణిక్యాలరావు, జి వెంకటపతి,ఎం అనంతలక్ష్మి,వై లోవరాజు, వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు డి. తలుపులు తదితరులు పాల్గొన్నారు.

# పని భారం తగ్గించాలంటూ వీఆర్వోలు నిరసన



యు.కొత్తపల్లి: జూన్ 8 (ప్రభాతవార్త) : గ్రామ రెవెన్యూ ఉద్యోగులపై పెరుగుతున్న పని భారం తగ్గించాలని వీఆర్వోలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల గ్రామ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జగదీష్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా వెంకాయపల్లి వీర్వోఓ మహమ్మద్ హుస్సేన్ పని ఒత్తిడి కారణంగా మృతి చెందడం నిరశిస్తూ ఆందోళన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అమరావతి రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని తహశీల్దారు కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. వీర్వోరో హుస్సేన్ ఆత్మహత్యకు కారణమైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండు చేసారు. రెవెన్యూ ఉద్యోగులకు రెవెన్యూ విధులు మాత్రమే కేటాయించాలన్నారు.

# నియోజకవర్గ స్థాయి శిక్షణ తరగతులలో వనమాడి మోహన వర్మ, మల్లిపూడి వీరు:



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి జూన్ 8 (ప్రభాతవార్త) ఓటరు జాబితాల రివిజన్ ప్రక్రియ 24 ఏళ్ల తర్వాత ఎలక్షన్ కమిషన్ చేపట్టిందని, కావున ప్రతి ఒక్క బి.ఎల్.ఏ., తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగస్వాములై సమగ్ర ఓటరు జాబితా కు సహకరించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు వనమాడి మోహన్ వర్మ, నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు పేర్కొన్నారు. సోమవారం కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు అధ్యక్షతన ఎస్ ఐ ఆర్ (స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్) పై నియోజకవర్గ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వనమాడి మోహన్ వర్మ, మల్లిపూడి వీరు మాట్లాడుతూ జూన్ 15 నుంచి జూలై 14 వ తేదీ వరకు కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న (స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్) కార్యక్రమంలో బీఎల్ఓలు ఇంటింటికీ వచ్చి ఓటర్ల వివరాలు సేకరించడం జరుగుతుందని, కొత్తగా ఓటు నమోదు, తప్పుల సవరణ, ఓట్ల తొలగింపునకు కూడా అవకాశం కల్పిస్తారుని, ప్రతి ఓటరు ముఖ్యం, ప్రతి ఓటు విలువైనదని, జూలై 14 న పోలింగ్ స్టేషన్ల పునర్ వ్యవస్థీకరణ, జూలై 21వ తేదీ నాటికి ముసాయిదా ఓటరు జాబితాలు ప్రచురిస్తారని, ఆగస్టు 20 వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందని, సెప్టెంబర్ 18 వ తేదీ లోపు అభ్యంతరాలను పరిష్కరించి 22 వ తేదీన తుది జాబితాలు ప్రకటిస్తారని, బీఎల్ఓలతో కలిసి జాబితాలను పరిశీలించడంలో బీఎల్ఏలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. బీఎల్ఏల ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో చేపట్టవలసిన కార్యాచరణపై గదుల సాయిబాబా, తుమ్మల రమేష్ క్లస్టర్, కో క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలకు అవగాహన కల్పించారు. బి ఎల్ ఎ లు ప్రతి ఓటర్తో అనుసంధానమై ప్రతి బూత్లో విజయం సాధించే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలివెల రవి అనంత కుమార్, బచ్చు శేఖర్, ఒమ్మి బాలాజీ,ఎమ్ ఎ తాజుద్దీన్, ఎస్ కె రహీమ్, క్లస్టర్ ఇంచార్జీలు, కో క్లస్టర్ ఇంచార్జ్ లు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ రెవెన్యూ అధికారుల నిరసన కార్యక్రమం



కె.గంగవరం, జూన్ 8, (ప్రభాతవార్త): గంగవరం మండలం తహసిల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం కమిటీ పిలుపు మేరకు గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం వారు నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు మండల రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు మాగాపు వీరభద్రం తెలిపారు. కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారి మహమ్మద్ హుస్సేన్ పని ఒత్తిడితో మరణించడం జరిగిందని వారికి సంతాపం తెలియజేసి వారి కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు కల్పించాలని అర్హులైన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. అంతేకాకుండా ఆత్మహత్యకు కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని నిరసన ద్వారా తెలియజేశారు. ఇందుకుగాను మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# కుండలేశ్వరం పంచాయతీ చెరువు కబ్జాపై ఫిర్యాదు



కాట్రేనికోన, జూన్ 08 (ప్రభాతవార్త): కాట్రేనికోన మండలంలోని కుండలేశ్వరం గ్రామ పంచాయతీకి చెందిన చెరువు కబ్జాకు గురవుతోందని ఎంపీటీసీ సభ్యుడు అక్కల శ్రీధర్ ఆరోపించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెం. 85/1, ఎల్.టి. నెం. 202లో ఉన్న 1.18 ఎకరాల చెరువును కొంతమంది స్వార్థపరులు పూడ్చి ప్లాట్లు వేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన తహసీల్దార్ వి రవి కిరణ్ కు గ్రీవెన్స్ లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ అంశాన్ని గతంలో డిప్యూటీ ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అక్కల శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ భూములకు నీటిని అందించే ప్రధాన వనరుగా ఇది ఉపయోగపడుతుందని, చెరువును పూడ్చివేస్తే అనేక ఎకరాల పంట భూములు నీటిలేక నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సుప్రీం కోర్ట్ మార్గదర్శకాల ప్రకారం పంచాయతీ చెరువులు, నీటి వనరులను ఆక్రమించడం లేదా పూడ్చివేయడం చట్టవిరుద్ధమని శ్రీధర్ పేర్కొన్నారు. ఆక్రమణల నుంచి చెరువును రక్షించడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. పంచాయితీ, రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే స్పందించి చెరువు పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని శ్రీధర్ ఫిర్యాదులో పేర్కొన్నాడు

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# అంగన్‌వాడీల సాధికారతకే 'నవచేతన' శిక్షణా తరగతులు



ప్రత్తిపాడు, జూన్ 8( ప్రభాతవార్త) గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, పిల్లల ఆరోగ్య రక్షణలో ముందస్తు బాల్య విద్యలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని, వారి నైపుణ్యాలను పెంపొందించడానికే 'నవచేతన' శిక్షణ తరగతులు దోహదపడతాయని ఎంపీడీవో ఎం వి ఆర్ కుమార్ బాబు పేర్కొన్నారు. ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి టి.డి.ఆర్. పద్మావతి, ఎంపీడీవో కుమార్ బాబు, ఎంఈఓ రాజబాబు, రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. ఉషశ్రీ, శాంతిఆశ్రమం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. శిరీష, జె.అన్నవరం జయరాం తదితరులు హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, గర్భిణులు, బాలింతలలో పోషకాహార లోపాన్ని నివారించడం మరియు చిన్న పిల్లల శారీరక, మానసిక వికాసానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. నవచేతన శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు.ఈ శిక్షణా కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వరలక్ష్మి, చక్రవేణి, బీపీసీ సిబ్బంది, మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పామర్రు పి హెచ్ సి లో అవగాహన కార్యక్రమం



కె గంగవరం, జూన్ 08,( ప్రభాతవార్త): కె గంగవరం మండలం పామర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణకై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు రామచంద్రపురం అగ్నిమాపక అధికారి కె.వెంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇళ్లల్లోనూ,కార్యాలయాల్లోనూ జరిగే అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలో, వాటిని ఎలా నియంత్రించాలో, విద్యుత్ పరికరాలు అగ్నికి ఆహుతి అయితే ఎలా అదుపులోకి తీసుకురావాలో,ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ఎలా రక్షణ పొందాలో ప్రత్యక్షంగా మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పి విష్ణువర్ధన్, పీహెచ్సీ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎం ఎల్ పి హెచ్ లు, అగ్నిమాపక సిబ్బంది వి సుబ్రహ్మణ్యం ఎస్ వి వి సత్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ ప్రకాష్ రావు, సూపర్వైజర్ కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్సీ లక్ష్మి కుమారి భర్తను పరామర్శించిన నరసాపురం పార్లమెంటరీ పరిశీలికులు ముదునూరి మురళీకృష్ణ రాజు



ప్రత్తిపాడు, జూన్ 8, (ప్రభాతవార్త) మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి భర్త, వీఆర్వో బాలకృష్ణ ను ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత, నరసాపురం పార్లమెంటు పరిశీలకులు, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు.ఇటీవల కాలంలో బాలకృష్ణ అనారోగ్యానికి గురికావడంతో, ప్రస్తుతం ఆయన కాకినాడలో ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మురళిరాజు సోమవారం ఆసుపత్రికి వెళ్లి బాలకృష్ణను పలకరించి, ఆయనకు ధైర్యం చెప్పారు. అనంతరం ఆయనకు అందుతున్న వైద్య చికిత్సల గురించి ప్రముఖ వైద్యులు డాక్టర్ ఓబుల్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.అలాగే ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన పాల రామారావును మురళీకృష్ణంరాజు పరామర్శించారు. ఇటీవల కాలంలో రామారావుకు హార్ట్ సర్జరీ జరిగినట్లు తెలుసుకున్న మురళిరాజు, ధర్మవరంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో కోలుకుంటారని రామారావుకు ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ పరామర్శ కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు నల్ల వెంకటేష్, పాల ఫణీంద్ర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ అభ్యర్థులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శుభాకాంక్షలు

## - అమరావతి సెక్రటేరియట్‌లో నామినేషన్ల దాఖలు



ప్రత్తిపాడు, జూన్ 8 (ప్రభాత వార్త) రాజ్యసభ ఎన్నికల సందర్భంగా రాజధాని అమరావతిలోని సెక్రటేరియట్‌లో సోమవారం నామినేషన్లు దాఖలు చేసిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నామినేషన్ పత్రాలను సమర్పించిన కూటమి అభ్యర్థులు సానా సతీష్ బాబు, చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణలను ఆమె ప్రత్యేకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.దేశ అత్యున్నత సభలో ఆంధ్రప్రదేశ్ హక్కుల కోసం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులు బలమైన వాయిస్ వినిపిస్తారనే నమ్మకాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యక్తపరిచారు. నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అమరావతికి తరలివెళ్లి అభ్యర్థులకు తమ మద్దతును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ప్రత్తిపాడు నియోజకవర్గ కూటమి ముఖ్య నేతలు, జ్యోతుల పెదబాబు,మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, పర్వత సురేష్, గొల్లపల్లి బుజ్జి, జి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మండల బిజెపి సమావేశం

కాట్రేనికోన జూన్ 08(ప్రభాతవార్త)బిజెపి కార్యవర్గ సమావేశం కాట్రేనికోన లో బిజెపి మండల అధ్యక్షుడు మట్టా శివకుమార్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బిజెపి జనరల్ సెక్రెటరీ సలాది వీరబాబు హాజరయ్యారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గురించి వివరించడం జరిగింది.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి బూత్ కి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని పిలుపు మేరకు రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ సూచన మేరకు భారతీయ జనతా పార్టీ అమ్మ కోసం ఒక మొక్క నాటుదాం కార్యక్రమం లో మొక్కలు నాటడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆకుమర్తి బేబీ రాణి , బిజెపి జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ, మట్ట సూరిబాబు,సుంకర నాగేశ్వరరావు, కోటా సత్య ప్రసాద్, కొత్తలంక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps